తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శుక్రవారం 19.06.2026 | సంపుటి :12 సంచిక : 330 | పేజీలు :12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




## నేరగాళ్లకు అడ్డా.. టెలిగ్రామ్

- 'కొత్త డార్క్ వెబ్'గా మారిన యాప్
- కేంద్రప్రభుత్వం సంచలన ఆరోపణలు
- ఢిల్లీ హైకోర్టుకు నివేదిక సమర్పణ

న్యూఢిల్లీ(జనంసాక్షి):మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ టెలిగ్రామ్‌పై కేంద్రం సంచలన ఆరోపణలు చేసింది. ఈ యాప్‌ను 'కొత్త డార్క్ వెబ్'గా పేర్కొన్న కేంద్రం.. ఇది నేరగాళ్లకు అడ్డగా మారిందని ఆరోపించింది. సైబర్ నేరగాళ్లు, అతివాదులు, డ్రగ్ ముఠా సభ్యులు మిగతా 2లో..

## 'ఆధార్' కేవలం గుర్తింపుకే..



- అది అక్కడికే పరిమితం
- పౌరసత్వం, నివాస ధృవీకరణ తదితరాలకు వాడరాదు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఆధార్ కార్డు వినియోగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది ఆధార్ కార్డులను పౌరసత్వం, నివాసం, అడ్రస్ ధృవీకరణకు ప్రూఫ్ గా వాడుతున్నారని, ఇది కేవలం ఐడెంటిటీ వెరిఫికేషన్ కు మాత్రమే పరిమితం చేయాలని దాఖలైన పిటిషన్ ను విచారణకు చేపట్టిన సుప్రీంకోర్టు.. మిగతా 2లో..

# ముగిసిన యుద్ధం.. కుదిరిన ఒప్పందం

## అమెరికా - ఇరాన్ యుద్ధానికి ముగింపు

అవగాహన ఒప్పందంపై సంతకాలు చేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్

తక్షణమే అమల్లోకి రానున్న డీల్




ఫ్రాన్స్ సదస్సులో అమెరికా-ఇరాన్ ఒప్పందంపై సంతకం చేస్తున్న ట్రంప్.. అమెరికా అధ్యక్షుడు సంతకం చేసిన సంబంధిత పత్రాన్ని చూపుతున్న ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్


పారిస్(జనంసాక్షి):అమెరికా- ఇరాన్ మధ్య యుద్ధం ముగిసింది. ఇరుదేశాల మధ్య కుదిరిన శాంతి ఒప్పందానికి సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. డీల్‌కు సంబంధించి అవగాహన ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ లాంఛనంగా సంతకాలు చేశారు. 14 అంశాలతో కూడిన ఈ ఒప్పందానికి 'ఇస్లామాబాద్ మెమోరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్ బిట్వీన్ ద యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా అండ్ ద ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్' అని పేరు పెట్టారు. కొన్ని రోజుల క్రితం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాగేర్ ఘాలిబఫ్ కూడా ఈ ఎంఓయూపై సంతకాలు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఇరుదేశాల అధ్యక్షులు దీనిపై సంతకాలు చేయగా.. ఈ డీల్ తక్షణమే అమల్లోకి రానుంది జీ7 శిఖరాగ్ర సమావేశం అనంతరం వెర్సైల్స్ ప్యాలెస్‌లో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ విందు ఇచ్చారు. ఇక్కడ ట్రంప్ సంతకాల కార్యక్రమం జరిగింది. దీనికి సంబంధించిన వీడియోను వైట్‌హౌస్ విడుదల చేసింది. 'ట్రంప్ వెర్సైల్స్‌లో ఇరాన్‌తో కుదిరిన ఒప్పందంపై సంతకం చేశారు. ఇది శాశ్వత శాంతికి మార్గం సుగుమం చేస్తుంది. హర్మూజ్ జలసంధి తిరిగి తెరుచుకోనుంది. దీంతో త్వరలో ఇంధన ధరలు తగ్గుతాయి' అని మెక్రాన్ ఓ పోస్టులో మిగతా 2లో..

## హర్మ్యూజ్‌లో రైట్..రైట్..

స్టార్టైన ఇంజిన్లు

కదులుతున్న నౌకలు!

మళ్లీ రద్దీగా మారనున్న జలసంధి



2లో..

# తెలంగాణలో ఆకుపచ్చని ఆవిష్కరణలు

## హైదరాబాద్ నగర కాలుష్యాన్ని నివారించేందుకే వనమహోత్సవం



- ఎవరు అడ్డుపడినా ఫ్యూచర్ సిటీని నిర్మించి తీరుతాం
- ప్రభుత్వ భూముల కబ్జా నిరోధానికే హైడ్రా ఏర్పాటు
- పేదల జోలికి వెళ్లకుండా..కబ్జాదారుల భరతం పడుతోంది
- మూసీ మురికి కన్నా కల్వకుంట్ల విషం ప్రమాదం
- గుర్రంగూడ ఎకో పార్క్ వనమహోత్సవంలో మొక్కను నాటి ప్రసంగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

రంగారెడ్డి(జనంసాక్షి):ఎవరైనా ప్రభుత్వ భూములను కబ్జా చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. కబ్జాలతో ప్రజలకు సమస్యలు రాకూడదనే హైడ్రా తీసుకువచ్చామని ప్రస్తావించారు. హైడ్రాను ఒక భూతంలా కొందరు చూపెడుతున్నారని ధ్వజమెత్తారు. హైడ్రా పేదల జోలికి వెళ్లదని.. కబ్జాదారుల భరతం పడుతుందని స్పష్టం చేశారు. గుర్రంగూడ ఎకో పార్క్‌ను కబ్జా చేయాలని కొంతమంది చూశారని ఆరోపించారు. వనస్థలిపురంలో దేవుడి భూములనూ కూడా కబ్జా పెట్టారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం గుర్రంగూడ ఎకో పార్క్‌లో వన మహోత్సవం కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. హరితనిధి ద్వారా నాగలింగం మొక్కను ముఖ్యమంత్రి నాటారు. రోబోటిక్ ఏనుగును ఆవిష్కరించారు. ఈ క్రమంలో గుర్రంగూడ ఎకో పార్క్ నమూనాను అటవీ అధికారులు.. సీఎంకి వివరించారు. ఎకో పార్క్‌లో రూ. 35.50 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో రూ. 17.84 కోట్లతో అభివృద్ధి పనులని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మిగతా 2లో..

## వీబీజీరాంజీ అమలు చేయం

- కేంద్ర పథకంపై నిరసన తెలుపుతాం
- 30న రైతు భరోసా నిధులు విడుదల
- వానాకాలం సాగుకు అండగా ప్రభుత్వం
- ఏడు రకాల సన్నాలకు బోనస్
- ధాన్యం కొనుగోళ్లలో కేంద్రం మొండివైఖరి
- కేబినేట్ భేటీలో పలు అంశాలపై చర్చ
- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి): ఈనెల 30వ తేదీన రైతు భరోసా నిధులు విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశమైంది. మిగతా 2లో..

# ఇజ్రాయెల్‌లో ఆగమాగం

## ప్రధాని నెతన్యాహుకు వ్యతిరేకంగా నిరసన వెల్లువ

### దేశాన్ని సంక్షోభంలోకి నెట్టిన నాయకత్వం వైదొలగాలని డిమాండ్



- టెల్‌అవీవ్, జెరూసలేం సహా పలు నగరాల్లో వేలాది మంది వీధుల్లోకి వచ్చి నినాదాలు
- ఇజ్రాయెల్ రాజకీయాల్లో కీలక పరిణామాలకు దారితీసే అవకాశం
- అల్ట్రా-ఆర్థోడాక్స్ యూదులకు సైనిక సేవ మినహాయింపుల అంశంపైనా ఉద్రిక్త పరిస్థితులు

టెల్‌అవీవ్(జనంసాక్షి):ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు మళ్లీ ఉద్ధృతమవుతున్నాయి. ప్రభుత్వ విధానాలు, యుద్ధ నిర్వహణ, అక్టోబర్ 7 దాడులపై సమగ్ర విచారణ చేపట్టకపోవడం, బందీల విడుదల విషయంలో వైఫల్యం వంటి అంశాలపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.తెల్ అవీవ్, జెరూసలేం సహా మిగతా 2లో..

## 'రాయదుర్గం'పై ముందుకెళ్లొద్దు

- భూముల వేలం ప్రక్రియపై హైకోర్టు స్టే
- అందులో 5 ఎకరాలు తమవేనంటూ ఎస్‌బిఐ పిటిషన్
- కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు నోటీసులు




హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్ రాయదుర్గం భూముల వేలంపై తెలంగాణ హైకోర్టు స్టే విధించింది. మూడు వారాల పాటు స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మూడు వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని ఈ సందర్భంగా ప్రతివాదులను న్యాయస్థానం ఆదేశించింది. రాయదుర్గంలోని సర్వే నంబర్ 83/1లోని భూమికి ఇటీవల వేలం నిర్వహించారు. ఈ స్థలాన్ని ఎకరాకు మిగతా 2లో..

## ఆర్టీసీ ఉద్యోగులకు 11శాతం ఫిట్‌మెంట్

జూలై 1 నుంచే అమలుకు నిర్ణయం:మంత్రి పొన్నం 2లో..

## పకడ్బందీగా నీట్ రీ టెస్ట్

వందతులను నమ్మొద్దు • విద్యార్థులకు ఎన్‌టీఏ వినతి

తెలంగాణలో అభ్యర్థులకు విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం

న్యూఢిల్లీ,జూన్18(జనంసాక్షి):నీట్-యూజీ రీటెస్టును పకడ్బందీగా నిర్వహించేందుకు విస్తృతమైన ఏర్పాట్లు చేసినట్లు 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ' ఎన్‌టిఎ తెలిపింది. విద్యార్థులు ప్రశాంతంగా ఉండి.. పరీక్ష సన్నద్ధతపై దృష్టి పెట్టాలని సూచించింది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 21న రీటెస్టు ఉంటుందని.. పరీక్ష వాయిదా పడుతుందన్న మిగతా 9లో..

NTA NET

## సీసీటీవీ దృశ్యాలు తారుమారు..!

### అయోధ్య విరాళాలపై సిట్ దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి..




లక్నో(జనంసాక్షి):ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య రామమందిరానికి అందిన విరాళాలు, వచ్చిన కానుకల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. తాజా దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. సాక్ష్యాలు లేకుండా ఉండేందుకు ఆలయంలోని సీసీటీవీ కెమెరాలను ట్యాంపర్ చేసి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. ఇందుకు సంబంధించిన కొన్ని క్లూస్‌ను సిట్ అధికారులు దర్యాప్తులో గుర్తించారు.సిట్ ప్రకారం.. గత 11 నెలల్లో ఆలయ మిగతా 9లో..

## మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఉర్దూ అకాడమీ గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భంగా ముషాయిరా
- భూముల పరిరక్షణ, కొత్త స్మశాన వాటికల స్థల సేకరణపై కలెక్టర్లకు ఉత్తర్వులు
- మైనార్టీల సంక్షేమం, అభివృద్ధిపై ఉన్నత స్థాయి సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి
- సమావేశానికి హాజరైన మంత్రి హజారుద్దీన్. మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్లు

హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్రంలోని మైనార్టీల సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇందుకోసం బడ్జెట్‌లో భారీగా నిధులను కేటాయించామని, వాటికి సంబంధించిన అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన వేగవంతం చేస్తున్నామని ఆయన వెల్లడించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మైనార్టీల మిగతా 2లో..



## గీత దాటితే వేటే..

పార్టీ లైన్ దాటితే క్షమించేది లేదు

ఎంతటి వారైనా పార్టీకి కట్టుబడి ఉండాల్సిందే

క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి

హైదరాబాద్(జనంసాక్షి): ఎంతటి వారైనా సరే వారి వ్యక్తిగత సమస్యలను పార్టీపై రుద్ద వద్దని నేతలకు క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి స్పష్టం చేశారు. మీకు ఏమైనా సమస్యలు ఉంటే.. వాటిని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ లేకుంటే రాష్ట్ర వ్యవహారాల బాధ్యులు మిగతా 2లో..

## సాంకేతికత వికేంద్రీకరణ జరిగినప్పుడే ప్రగతి సాధ్యమవుతుంది

- పారిస్ సదస్సులో ప్రధాని మోదీ
- 'ఏఐ'ని 'ఆల్ ఇంక్లూసివ్'గా అభివర్ణన
- ప్రపంచంలో సగం ఆన్‌లైన్ లావాదేవీలు భారత్‌లోనే జరుగుతున్నాయన్న వెల్లడి




పారిస్(జనంసాక్షి):సమాజంలోని చివరి వ్యక్తి వరకు సాంకేతికత అందినప్పుడే నిజమైన పురోగతి సాధ్యమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. టెక్నాలజీ కేవలం కొన్ని దేశాలకే పరిమితం కాకుండా ప్రజాస్వామ్యబద్ధంగా అందరికీ దక్కాలని ఉద్ఘాటించారు. ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్‌లో జరుగుతున్న 'వివాటెక్-2026' గ్లోబల్ టెక్నాలజీ సదస్సులో ప్రధాని మోదీ మాట్లాడారు. సాంకేతికత వికేంద్రీకరణ జరిగినప్పుడే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందన్నారు. గత దశాబ్ద కాలంలో భారత్ టెక్నాలజీ ఆధారంగా వేగవంతమైన పరివర్తనను సాధించిందని వివరించారు.భారత్‌లో విద్య, టెలిమెడిసిన్, వ్యవసాయం వంటి రంగాల్లో మునుపెన్నడూ లేని విధంగా సాంకేతికతను భారీ స్థాయిలో వినియోగిస్తున్నట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న డిజిటల్ లావాదేవీల్లో సగానికి పైగా కేవలం భారత్‌లోనే జరుగుతున్నాయని మోదీ గుర్తుచేశారు. టెక్నాలజీ ద్వారా పారదర్శకతను పెంచి, అవినీతికి తావులేకుండా సేవలను నేరుగా ప్రజలకు చేరుస్తున్నామని మోదీ స్పష్టం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)కి ప్రధాని మోదీ కొత్త నిర్వచనాన్ని ఇచ్చారు. భారత్‌లో ఏఐ అంటే 'ఆల్ ఇంక్లూసివ్ (అందరినీ కలుపుకుపోయే సమ్మిళిత అభివృద్ధి)'అని పేర్కొన్నారు." భారత్, యూరప్‌కు 2026 సంవత్సరం అత్యంత ప్రత్యేకమైనది. ఎందుకంటే, ఈ ఏడాది ప్రారంభంలోనే మేం చారిత్రాత్మక భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నాం. దీని ద్వారా ఇరు ప్రాంతాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, పర్యాటకం వంటి సరికొత్త రంగాలకు మార్గం సుగమమైంది. అలాగే, ఈ ఏడాది ప్రారంభించిన మిగతా 2లో..

# ముగిసిన యుద్ధం.. కుదిరిన ఒప్పందం

రాసుకొచ్చారు. విందు అనంతరం ప్యాలెస్ నుంచి వెళ్తూ.. ఇరాన్‌తో అవగాహన ఒప్పందంపై సంతకం చేసినట్లు ట్రంప్ విలేకరులతో పేర్కొన్నారు. వాస్తవానికి సంతకాల కార్యక్రమం రేపు స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో జరగాల్సి ఉండగా, ముందుగానే జరగడం గమనార్హం. అయితే, స్విట్జర్లాండ్‌లో ఇరుదేశాల ప్రతినిధుల సమావేశం ఉంటుందని ఇరాన్ అధికారులు పేర్కొన్నారు. తాము కూడా ఈ అవగాహన ఒప్పందంపై సంతకం చేశామని ఇరాన్ విదేశాంగ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి పేర్కొన్నారు. 60 రోజుల ఈ అవగాహన ఒప్పందాన్ని బలహీనపరిచే చర్యలను అమెరికా చేపట్టకూడదన్నారు. ఈ సమయంలో తమపై కొత్త ఆంక్షలు విధించడం గానీ.. ఈ ప్రాంతంలో సైనిక మోహరింపులు పెంచడం వంటివి చేయకూడదని స్పష్టంచేశారు. తమ వద్దనున్న శుద్ధి చేసిన యురేనియం దేశంలోనే ఉంటుందని.. దానిని విదేశాలకు తరలించబోమని తేల్చి చెప్పేశారు. అమెరికా- ఇరాన్ మధ్య ఒప్పందానికి మధ్యవర్తిత్వం వహించిన పాకిస్థాన్ కూడా ఈ సంతకాల విషయాన్ని ధ్రువీకరించింది. దీన్ని 'ఇస్లామాబాద్ అవగాహన ఒప్పందం'గా పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటించుకున్నారు. ఈ ఒప్పందం తక్షణమే అమల్లోకి వస్తుందని తెలిపారు. ఇందులో తొలి అడుగుగా ఇరాన్ తక్షణమే హార్మూజ్‌ను పూర్తిగా తెరుస్తుందని.. అమెరికా నావికా దిగ్బంధాన్ని ఎత్తివేస్తుందని వెల్లడించారు.

## హార్మూజ్‌లో రైట్..రైట్..

టెహ్రాన్(జనంసాక్షి):ఇరాన్-అమెరికా మధ్య ఒప్పందం కుదిరిన నేపథ్యంలో ప్రపంచ చమురు రవాణాకు జీవనాడిగా పేర్కొనే హార్మూజ్‌కు మళ్లీ ఊపిరి పోసినట్లయ్యింది. ఆంక్షల నేపథ్యంలో కొంతకాలంగా అక్కడ వందలాది నౌకలు చిక్కుకుపోగా.. తాజాగా పరిస్థితులు కుదుటపడడంతో తిరిగి తమ ప్రయాణాన్ని కొనసాగించేందుకు ఆయా నౌకలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఒప్పందం తక్షణమే అమల్లోకి రావడంతో కొన్ని నౌకలు ఇప్పటికే ఆ మార్గంలో బయలుదేరినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి.నౌకల రాకపోకలను ట్రాకింగ్ చేసే వ్యవస్థ 'విండ్‌వార్డ్' ప్రకారం.. హార్మూజ్‌లో సుదీర్ఘ కాలంగా నిలిచిపోయిన నౌకల్లో కొన్ని గురువారం ఉదయమే తమ ప్రయాణాన్ని ప్రారంభించాయి. తొలుత చైనాతో సంబంధమున్న ఐదు నౌకలు కదలగా, యూరోపియన్ జెండాలున్న రెండు నౌకలు తర్వాత క్రమంలో వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ ఏడు నౌకలు కూడా గత వంద రోజులకుపైగా హార్మూజ్ సమీపంలో చిక్కుకుపోయినవేనని సమాచారం. వీటితోపాటు మరికొన్ని నౌకలు కూడా లంగరు వేసిన ప్రదేశం నుంచి జలసంధి వైపు వెళ్లేందుకు సిద్ధమవుతున్నాయి. ఇందులో హాంకాంగ్, జపాన్‌కు చెందిన భారీ నౌకలు ఉన్నట్లు తెలిసింది. కాల్పుల విరమణ ఒప్పందం, వ్యూహాత్మక జలమార్గాన్ని తెరవడం వంటి అంశాలపై విశ్వాసం పెరుగుతోందనడాన్ని తాజా పరిణామం సూచిస్తోందని నౌకల ట్రాకింగ్ వ్యవస్థలు అంచనా వేస్తున్నాయి. అయితే, హార్మూజ్‌లో పూర్తిగా సాధారణ పరిస్థితులు నెలకొనడం అనేది శాంతి ఒప్పందం అమలుపై ఇరుపక్షాల నిబద్ధతపైనే ఆధారపడి ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు.

## ఇజ్రాయెల్‌లో ఆగమాగం

పలు నగరాల్లో వేలాది మంది వీధుల్లోకి వచ్చి నెతన్యాహు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 7 ఘటనపై స్వతంత్ర విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో ప్రతిపక్ష పార్టీలు, బందీల కుటుంబ సభ్యులు, పౌరసంఘాలు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తున్నాయి. ఇటీవలి వారాల్లో యుద్ధ వ్యతిరేక నినాదాలతో జరిగిన ప్రదర్శనల్లో ప్రజలు "ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి", "యుద్ధానికి ముగింపు పలకాలి" అంటూ ఆందోళనలు నిర్వహించారు. తెల్ అవీవ్‌లో నిర్వహించిన భారీ నిరసనల్లో నెతన్యాహు ప్రభుత్వ విధానాలను ప్రజలు తీవ్రంగా విమర్శించారు. ఇక మరోవైపు, అల్ట్రా-ఆర్థోడాక్స్ యూదులకు సైనిక సేవ మినహాయింపుల అంశంపై కూడా దేశంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ వివాదం నెతన్యాహు సంకీర్ణ ప్రభుత్వంపై మరింత ఒత్తిడిని పెంచుతోంది.

**ప్రభుత్వంపై దాడిని ముమ్మరం**

ప్రతిపక్ష నేత యార్ లాపిడ్ నేతృత్వంలోని నెతన్యాహు వ్యతిరేక శక్తులు రాబోయే ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వంపై దాడిని ముమ్మరం చేశాయి. తాజా సర్వేల ప్రకారం నెతన్యాహు నేతృత్వంలోని కూటమిపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, గాజా యుద్ధం, బందీల సమస్య, అవినీతి ఆరోపణలు, న్యాయ వ్యవస్థ సంస్కరణల వివాదం వంటి అంశాలు నెతన్యాహు ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారాయి. దీంతో ఇజ్రాయెల్ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**ప్రజల్లో అసంతృప్తి**

లెబనాన్, గాజా ప్రాంతాల్లో కొనసాగుతున్న సైనిక చర్యలు, బందీల విడుదల విషయంలో ప్రభుత్వం విఫలమైందనే విమర్శలు, అలాగే దేశీయ రాజకీయ సంక్షోభం కారణంగా ప్రజల్లో అసంతృప్తి పెరిగినట్లు తెలుస్తోంది. నిరసనకారులు యుద్ధాలకు ముగింపు పలకాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని నినదించారు. ఐతే.. ప్రస్తుతం కొనసాగుతున్న నిరసనలు ఇజ్రాయెల్ రాజకీయాల్లో కీలక పరిణామాలకు దారితీసే అవకాశం ఉందని పరిశీలకులు పేర్కొంటున్నారు. నెతన్యాహు ప్రభుత్వ భవిష్యత్తుపై ఈ ఆందోళనలు ప్రభావం చూపే అవకాశముందని భావిస్తున్నారు.

## 'ఆధార్' కేవలం గుర్తింపుకే..

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటను స్పందించాలని సుప్రీంకోర్టు కోరింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసం, న్యాయవాది అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్ పిటిషన్ ను విచారించింది. ఈ పిటిషన్ పై కేంద్ర ప్రభుత్వం, అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది. ఆధార్‌ను ఐడెంటిటీ ప్రూఫ్ గా మాత్రమే వాడాలని పౌరసత్వం, నివాసం, అడ్రస్, పుట్టిన తేదీకి సంబంధించిన రుజువుగా వినియోగించకుండా కేంద్ర, రాష్ట్ర, ఎన్నికల సంఘాలకు ఆదేశాలు జారీ చేయాలని పిటిషన్‌లో కోరారు పిటిషనర్ అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్. ఓటరు నమోదుకు బర్త్ డేట్, రెసిడెంట్ ప్రూఫ్ లకు ఆధార్ కార్డును వినియోగిస్తున్నారని, ఇది ఆధార చట్టానికి విరుద్ధమని పిటిషనర్ వాదించారు. ఆధార్ చట్టం, 2016లోని సెక్షన్ 9 'ఆధార్ పౌరసత్వానికి లేదా రెసిడెంట్ కు ప్రూఫ్ కాదని స్పష్టంగా తెలిపింది ఉడాయ్. అయినప్పటికీ, ఆధార్‌ను స్కూల్ అడ్మిషన్లు,ప్రాపర్టీ కొనుగోలు, బర్త్ ప్రూఫ్ రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ పొందడం కోసం వయస్సు, పౌరసత్వం, నివాస ధృవీకరణ పత్రంగా ఉపయోగించడమే కాకుండా, కొత్త ఓటరు నమోదుకు, పుట్టిన తేదీకి, నివాస ధృవీకరణ పత్రంగా కూడా వాడుతున్నారు. ఈ విధంగా, చొరబాటుదారులు, అక్రమ వలసదారులు ఆధార్‌ను ఉపయోగించి వివిధ డాక్యుమెంట్లను పొందుతున్నారని పిటిషన్‌లో కోర్టుకు తెలిపారు. ఎన్నికల పక్రియలలో ధృవీకరణ వ్యవస్థను సమగ్రంగా ప్రక్షాళన చేయాలని, సంస్కరణలను పర్యవేక్షించేందుకు విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తితో పాటు సైబర్ సెక్యూరిటీ, ఫోరెన్సిక్ నిపుణులతో కూడిన ఉన్నత స్థాయి పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేయాలని పిటిషన్‌లో కోరారు.

తెలంగాణ ప్రభుత్వము
పంచాయతీరాజ్ ఇంజినీరువారి కార్యాలయము
పీఐయూ డివిజన్, నల్గొండ
Lr.No.D3/Tenders/03/2026-27/DPRENLG ఈ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు Dt:15.06.2026
నల్గొండ జిల్లా నల్గొండ టౌన్‌లో & పీఐయూ డివిజన్‌లో మొత్తం అంచనా విలువ రూ.67.50 లక్షల పనులకు దిగువ సంతకం దారు (07) టెండర్లను ఆహ్వానించడమైనది. దరఖాస్తుకు చివరి తేదీ: 22.06.2026. టెండరు షెడ్యూల్ జారీ చేయు తేదీ: 25.06.2026. టెండరు స్వీకరించు& తెరచుతేదీ: 27.06.2026. మిగతా వివరాలకు నల్గొండ డీపీఆర్ఈ పీఐయూ కార్యాలయము, జడ్పీపీ కాంప్లెక్స్, రెండవ అంతస్థు, మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా, నల్గొండ టౌన్‌లో సంప్రదించగలరు.
సం/- జిల్లా డీపీఆర్ఈ ఇంజినీర్, పీఐయూ.. :: నల్గొండ
DIPR No.4539-PP/CL/ADVT/2026-27

# తెలంగాణలో ఆకుపచ్చని ఆవిష్కరణలు

మాట్లాడారు. 2018లో కొందరి కుట్ర వల్ల కొడంగల్‌లో ఓడిపోయానని చెప్పుకొచ్చారు. ఇక తాను ఏమీ చేయలేనని కొందరు భావించారని అన్నారు. మల్కాజ్‌గిరి ప్రజలు తనను ఎంపీగా గెలిపించారని తెలిపారు. ప్రశ్నించే గొంతు ఉండాలని నాడు ఎంపీగా తనను గెలిపించారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. తనను ఓడించాలని కొందరు ఎన్నో కుట్రలు పన్నారని ధ్వజమెత్తారు. ఇక్కడి ప్రజల అభిమానమే తనను ముఖ్యమంత్రిగా నిలబెట్టిందని వివరించారు. ఎల్బీనగర్ ప్రజలు తనకు 30 వేలకుపైగా ఓట్ల మెజారిటీ ఇచ్చారని అన్నారు. తన సొంతూరు కొండారెడ్డిపల్లి లాంటిదే తనకు ఎల్బీనగర్ అని అభివర్ణించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎల్బీనగర్ అభివృద్ధిని పట్టించుకోలేదని మండిపడ్డారు. సీఎంగా ఎల్బీనగర్ సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని మాటిచ్చారు. రంగారెడ్డి జిల్లాకు అన్నివిధాలా అండగా నిలుస్తున్నామని స్పష్టం చేశారు. కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాలుష్య కోరల్లో చిక్కుకుని ఢిల్లీ ప్రజలు బాధపడుతున్నారని సీఎం వ్యాఖ్యానించారు. మన హైదరాబాద్‌కు అలాంటి పరిస్థితి రావొద్దనే మొక్కల పెంపకాన్ని ప్రోత్సాహిస్తున్నామని వివరించారు. మూసీ పునరుజ్జీవం చేస్తామంటే కొందరు అడ్డుపడుతున్నారని ఆగ్రహించారు. మూసీ ఒడ్డున నివసిస్తున్న ప్రజలను తరలించి.. అభివృద్ధి చేస్తామంటే కొందరు మోకాలడ్డుతున్నారని మండిపడ్డారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీకి ప్రణాళికలు సిద్ధం చేశామని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ కడతామంటే మళ్లీ ఫార్మా కంపెనీలు తెస్తామంటున్నారని చెప్పుకొచ్చారు. ఫ్యూచర్ లేనివాళ్లు ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామంటున్నారని దుయ్యబట్టారు. ముందు సిద్దిపేట గెలిచిరండి.. ఆ తర్వాత రద్దుపై మాట్లాడదామని హితవు పలికారు. 60 శాతం గ్రీనరీ పెంచుతామంటే కేసులు వేశారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరేమనుకున్నా మూసీ నది ప్రక్షాళన చేసి తీరుతామని రేవంత్‌రెడ్డి అన్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ మేర ఈ పనులు చేపడతామని చెప్పారు. సబర్మతి, గంగా రివర్‌ఫ్రంట్‌ల కంటే మెరుగ్గా అంతర్జాతీయ స్థాయిలో దీన్ని తీర్చిదిద్దుతామన్నారు. కాలుష్య రహిత వాతావరణం ప్రజలకు ఇవ్వాలని ప్రయత్నిస్తున్నాం. నగర అవసరాల కోసం 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. ఫ్యూచర్ లేని నేతలు ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని చెబుతున్నారు. వాళ్ల ఫ్యూచర్‌ను ప్రజలు నిర్ణయిస్తే.. ఫాంహౌస్‌కు పరిమితమయ్యారు. ఫ్యూచర్‌సిటీని రద్దు చేస్తానన్న ఆయన ఈసారి సిద్దిపేటలో గెలవరు. కొందరు ఎన్జీటీలో కేసులు వేస్తున్నారు. మూసీలో కాలుష్యం కంటే.. కల్వకుంట్ల వాళ్ల కడుపులో కాలుష్యమే ఎక్కువ. ఎవరు అడ్డుపడినా అంతర్జాతీయస్థాయిలో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించి తీరుతాం అని అన్నారు. కేసీఆర్ ఫ్యామిలీపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. గుర్రంగూడలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు అభివృద్ధి పనులను వర్చువల్ గా ప్రారంభించారు సీఎం రేవంత్. మూసీ పునరుజ్జీవం చేస్తామంటే అడ్డుపడుతున్నారని.. మూసీలో ఉండే కాలుష్యం కంటే కల్వకుంట్లోళ్ల కడుపులో విషం ఎక్కువని అన్నారు. మూసీ పునరుజ్జీవం వద్దంటున్న సుధీర్ రెడ్డి గతంలో మూసీ కార్పొరేషన్ చైర్మెన్ పదవి ఎలా తీసుకున్నారని ప్రశ్నించారు. భూకబ్జాలతో ప్రజలకు సమస్య రావొద్దని హైడ్రా తెచ్చామని... హైడ్రాను భూతంలా చూపిస్తున్నారని మండిపడ్డారు.హైడ్రా పేదల జోలికి వెళ్ళదని.. కబ్జాదారుల భరతం పడుతుందని అన్నారు.

## వీబీజీరాంజీ అమలు చేయం

ఈ సమావేశంలో ఈ మేరకు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. వరుసగా తొమ్మిది రోజుల పాటు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం ఈ నిధులను జమ చేయనుంది. 30న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మధిరలో నిర్వహించే సభలో సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధులను విడుదల చేయనున్నారు. రైతు భరోసా కింద రైతులకు ప్రభుత్వం ఏటా ఎకరానికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తోంది. ఈ పెట్టుబడి సాయాన్ని రెండు పంటల కాలాలకు ఖరీఫ్, రబీ కాలంలో విడగొట్టి, ప్రతి సీజన్‌కు ఎకరాకు రూ. 6,000 చొప్పున నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. మరోవైపు.. 23వ ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకం సంబంధిత నిధులను కేంద్రం ఈ నెల 20న విడుదల చేయనుంది. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలోని తారకేశ్వర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. దీంతో ఒక్కో రైతు ఖాతాలో రూ. 2 వేలు చొప్పున నగదు జమ కానుంది. దీంతో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు 10 రోజుల తేడాతో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నాయి. సచివాలయంలో మంత్రులతో ప్రత్యేకంగా నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై సీఎం చర్చించారు. హైదరాబాద్ మెట్రో రైలు, ధాన్యం కొనుగోళు,, వీబీజీ రాంజీ పథకం, కేంద్ర ప్రభుత్వ వైఖరి తదితర అంశాలపై మంత్రులతో చర్చలు జరిపారు. వానాకాలం రైతు భరోసా నిధులు విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నామని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. జూన్ 30వ తేదీన మధిరలో రైతు సమ్మేళనం పేరిట నిర్వహించే బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులు విడుదల చేస్తారని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్ల సమావేశంలో వివరించారు. ఏడు రకాల సన్నాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. మార్కెట్లో వాటికి ఉన్న డిమాండ్ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మన రాష్ట్రం నుంచి కేంద్రం తక్కువ ధాన్యం సేకరించడంపై ఈ సమావేశంలో ఆందోళన వ్యక్తమైందని పేర్కొన్నారు. మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని డిమాండ్ చేశామని తెలిపారు. కేంద్రం కనీస మద్దతు ధర ఇచ్చి కొనే ధాన్యాన్ని మాత్రమే తెలంగాణ కొనాలని నిర్ణయించామన్నారు. ఎరువుల కోటాను వెంటనే విడుదల చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై పలుమార్లు కేంద్రానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖలు రాశారని గుర్తు చేశారు. త్వరలో ఢిల్లీకి వెళ్లి ఆయా అంశాలను కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయించామన్నారు. రామగుండంలో తయారయ్యే యూరియాలో అత్యధిక శాతాన్ని తెలంగాణకే కేటాయించాలని కేంద్రానికి స్పష్టం చేశారు. అలాగే హైదరాబాద్ మెట్రో విస్తరణకు కూడా సహకరించాలని కేంద్రాన్ని కోరారు. అందుకు మెట్రో రెండో దశకు అనుమతి ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఐఆర్ఎఫ్‌సీ నుంచి రావాల్సిన రుణాన్ని వెంటనే విడుదల చేయించాలని కేంద్రాన్ని కోరుతున్నట్లు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి అడ్డంకులు లేకుండా ప్రాజెక్టుల అనుమతులు ఇప్పించడానికి కలిసి రావాలని బీజేపీ ఎంపీలకు ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ పిలుపునిచ్చారు. ఇకపై డిజిటల్ క్యాబినెట్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. జూన్ 21వ తేదీన జరిగే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించా లని ఈ కేబినెట్ భేటీలో నిర్ణయించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇక వీబీ- జీ ఆర్ఏఎం జీ పై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సబ్ కమిటీలో మంత్రులు సీతక్క, తుమ్మల, ఉత్తమ్ ఉంటారు. దీనిపై ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం తర్వాత.. జూన్ 25 లోపు ప్రభుత్వానికి కేబినెట్ సబ్ కమిటీ నివేదిక అందజేయనుందని స్పష్టం చేశారు.

## నేరగాళ్లకు అడ్డాగా టెలిగ్రామ్

చట్టం నుంచి తప్పించుకునేందుకు ఈ యాప్ ను ఎక్కువగా వినియోగిస్తున్నారని దుయ్యబట్టింది. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టుకు అఫిడవిట్ సమర్పించింది. నీట్ రీఎగ్జామ్ నేపథ్యంలో దేశంలో టెలిగ్రామ్ వినియోగంపై కేంద్రం ఇటీవల తాత్కాలిక నిషేధం విధించిన సంగతి తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసు విచారణలో భాగంగా కేంద్రం గురువారం అఫిడవిట్ దాఖలు చేసింది. నీట్ యూజీ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా దుమారం లేపిన నేపథ్యంలో.. జూన్ 21న రీటెస్ట్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఈ పరీక్షకు సంబంధించిన కొన్ని ముఠాలు టెలిగ్రామ్ వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ ఇటీవల దీనిపై కేంద్రం తాత్కాలిక నిషేధం విధించింది. ప్రశ్నపత్రాల లీకేజీ, తప్పుడు వార్తల వ్యాప్తిని నివారించేందుకు, మోసపూరిత నెట్‌వర్క్‌లను అరికట్టడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం తెలిపింది. జూన్ 22 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించింది.ఈ సందర్భంగా క్రిమినల్ నెట్‌వర్క్‌లు, అతివాద ముఠాలు, సైబర్ నేరగాళ్లు ఈ యాప్‌ను దుర్వినియోగం చేస్తున్న తీరును కేంద్రం అందులో వివరించింది. గోప్యతకు సంబంధించి టెలిగ్రామ్‌లో ఉన్న అధునాతన ఫీచర్లు క్రిమినల్ నెట్‌వర్క్‌లను ఎక్కువగా ఆకర్షిస్తున్నాయని పేర్కొంది.ఇందులోని ప్రైవసీ సెట్టింగ్‌లతో యూజర్లు తమ టెలిగ్రామ్ ఐడీలు, ఫోన్ నంబర్లు వంటి గుర్తింపు వివరాలను దాచిపెట్టేందుకు వీలు లభిస్తోంది. దీనివల్ల అసలు వ్యక్తులు ఎవరో గుర్తించడం దర్యాప్తు అధికారులకు కష్టంగా మారుతోంది. ఈ ఫీచర్ల వల్లే నేరగాళ్లు ఈ యాప్‌ను దుర్వినియోగం చేసి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, దోపిడీ, ఉగ్రదాడులు, మోసాలు వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇది కొత్త డార్క్ వెబ్‌గా మారింది. క్రిమినల్స్ డార్క్ వెబ్ లింక్‌లతో పరస్పరం అనుసంధానం చేసుకుంటున్నారు. దీంతో అధికారులు వారిని ట్రాక్ చేయలేక పోతున్నారని కేంద్రం తమ అఫిడవిట్‌లో ఆరోపించింది. ఇక, హింసాత్మక, తీవ్రవాదం, ఉగ్రవాద సంస్థలకు సంబంధించిన కంటెంట్‌ను ప్రచారం చేయడానికి టెలిగ్రామ్ గ్రూపులు, ఛానెళ్లను ఉపయోగిస్తున్నారని కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. దీనివల్ల తప్పుడు సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతోందని, ఫలితంగా శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతోందని ఆరోపించింది.

## గీత దాటితే వేటే..

మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకెళ్లాలని నేతలకు ఆయన సూచించారు. గురువారం గాంధీ భవన్‌లో మల్లు రవి విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ క్రమశిక్షణ కమిటీ ముందు హాజరవుతారన్నారు. కామారెడ్డిలో ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్నారని వివరించారు. షబ్బీర్ ఆలీకి నోటీసులు జారీ చేశామని చెప్పారు. ఆదివారం కమిటీ ముందు హాజరు కావాలని ఆయనకు సూచించామన్నారు. అందుకు షబ్బీర్ అలీ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ముందుగా షబ్బీర్ ఆలీ ఇచ్చిన ఫిర్యాదుపై క్రమశిక్షణ కమిటీ చర్చిందన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న తర్వాత తమ నిర్ణయం ప్రకటిస్తామని మల్లు రవి వెల్లడించారు. పార్టీ వ్యతిరేకంగా ఎవరు ప్రవర్తించిన క్రమశిక్షణ కమిటీ చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదని నేతలకు ఎంపీ మల్లు రవి వార్నింగ్ ఇచ్చారు.

## ఆర్టీసీ ఉద్యోగులకు 11శాతం ఫిట్‌మెంట్

హైదరాబాద్,జూన్18(జనంసాక్షి):తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభవార్త చెప్పారు. ఆర్టీసీ సమ్మెలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులకు జులై 1 నుంచి 11 శాతం ఫిట్‌మెంట్ అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం టీజీఎస్‌ఆర్టీసీ ఉన్నతాధికారులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. నాగర్ కర్నూల్, పెద్దపల్లి బస్ డిపో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వేములవాడ, కథలాపూర్ బస్ స్టేషన్లకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. హుజూర్‌నగర్, కోదాడ, నాగర్‌కర్నూల్ బస్ స్టేషన్లకు కూడా మంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ములుగు బస్ స్టేషన్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మహాలక్ష్మి పథకంపై ప్రత్యేక అధ్యయనం చేయాలని సూచించారు. మహిళా సంఘాలకు చెందిన 553 బస్సుల పనితీరుపై మంత్రి నివేదిక కోరారు. రాష్ట్రంలో 1,050 ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణపై సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు. ఆర్టీసీ వద్ద 10,173 బస్సులు.. 38,128 మంది ఉద్యోగులు ఉన్నారని, రోజుకు 61 లక్షల మంది ప్రయాణికులు టీజీఎస్‌ఆర్టీసీ సేవలు పొందుతున్నట్లు తెలిపారు. పెండింగ్ కారుణ్య నియామకాలను వెంటనే పూర్తి చేయాలని అధికారులను పొన్నం ఆదేశించారు. తొలగించిన ఉద్యోగుల్లో 244 మందికి ఇప్పటికే విధుల్లోకి అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. ఉద్యోగి శంకర్ కుటుంబానికి రూ.1 కోటి చెక్కును ఆర్టీసీ అందజేయనున్నట్లు తెలిపారు. శంకర్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినట్లు చెప్పారు. దక్షిణ భారత రవాణా శాఖ మంత్రులతో త్వరలో ప్రత్యేక సమావేశం జరగనుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## 'రాయదుర్గం'పై ముందుకెళ్లొద్దు

రూ.237కోట్ల చొప్పున గౌరా వెంచర్స్ కొనుగోలు చేసింది. అయితే, ఆ భూమిలో 5 ఎకరాలు తమదేనంటూ హైకోర్టును ఎస్బీఐ బ్యాంక్ ఆశ్రయించింది. ఈ మేరకు పిటిషన్ దాఖలు చేసింది. సర్వే నెంబర్ 83/1లోని 5 ఎకరాల భూమి తిరిగి ఇప్పించాలని విజ్ఞప్తి చేసింది. దీనిపై గురువారం విచారణ చేపట్టిన ధర్మాసనం.. రాయదుర్గం భూముల వేలంపై స్టే విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ఎస్‌బీఐ, టీజీఐఐసీ, గౌర వెంచర్స్‌కు నోటీసులు జారీ చేసింది. రాయదుర్గంలోని పన్మక్తలో టీజీఐఐసీ జరిపిన భూముల వేలంపై ఇటీవల ఎస్‌బీఐ హైకోర్టును ఆశ్రయించింది. ఆ భూములు తమవేనంటూ పిటిషన్ దాఖలు చేసింది. దీంతో విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం వేలంపై స్టే విధించింది. ఇటీవల జరిగిన వేలంలో అక్కడ ఎకరం రూ.237 కోట్లు పలికిన సంగతి తెలిసందే. సర్వే నం.83/1లో ఐదు ఎకరాల భూమిపై హక్కులు కోరుతూ ఎస్‌బీఐ హైకోర్టును ఆశ్రయించింది. మే 6న జారీ చేసిన వేలం నోటిఫికేషన్‌తోపాటు తదనంతరం జరిగిన భూ విక్రయాన్ని, తమ వినతిపత్రాన్ని తిరస్కరిస్తూ మే 20న జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ ఎస్‌బీఐ రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేసింది.

# మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

సంక్షేమం, వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శనివారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు.ఉర్దూ అకాడమీ గోల్డెన్ జూబ్లీ (స్వర్ణోత్సవాల) సందర్భంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో ఉర్దూ సంస్కృతిని ప్రతిబింబించేలా పెద్ద ఎత్తున 'ముషాయిరా' (కవి సమ్మేళనాలు) నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఈ కార్యక్రమం నిర్వాహణకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలను అన్ని రకాల ఆధునిక హంగులు, వసతులతో నిర్మిస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 20 రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని, మరో 17 పాఠశాలలు నిర్మాణ దశలో ఉన్నాయని అధికారులు ఈ సందర్భంగా వివరించారు. దీనిపై భట్టి విక్రమార్క స్పందిస్తూ... అసంపూర్తిగా మిగిలిపోయిన మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల భవనాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. పనులు ఎక్కడా ఆగకుండా ఒక నిర్ణీత టైమ్ క్యాలెండర్‌ను రూపొందించుకుని, దాని ప్రకారమే పనులు పూర్తయ్యేలా పర్యవేక్షణ చేయాలని, మిగిలిన 17 పాఠశాల భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.మైనార్టీ యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు మరియు వారిని ఆర్థికంగా నిలబెట్టడానికి రాజీవ్ యువ వికాసం' పథకం ద్వారా పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పథకం అమలు చేయడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారుక్రిస్టియన్ మైనార్టీల సంక్షేమం కొరకు ప్రత్యేకంగా రూ. 50 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నిధులను క్రిస్టియన్ మైనార్టీ యువత స్వయం ఉపాధి రంగంలో రాణించడానికి తగిన ఆర్థిక ప్రోత్సాహం అందించడానికి కేటాయిస్తామన్నారు. మైనార్టీ సంస్థలకు సంబంధించిన విలువైన వక్ఫ్ మరియు ఇతర భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు తగిన చట్టపరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే, మైనార్టీల స్మశాన వాటికల చుట్టూ ప్రహరీ గోడల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఇందుకోసం తక్షణమే ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న జిల్లా, డివిజన్ కేంద్రాల్లో స్మశాన వాటికల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను సేకరించి కేటాయించాల్సిందిగా జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేయనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు.మొహర్రం వేడుకలకు ఉప ముఖ్యమంత్రికి ఆహ్వానంహైదరాబాద్ నగరంలో జరగబోయే మొహర్రం వేడుకల సందర్భంగా, 9వ రోజున నిర్వహించే ప్రత్యేక కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ కోరగా.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించి, తప్పకుండా హాజరవుతానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ప్లానింగ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ గౌరవ ఉప్పల్, ఫైనాన్స్ సెక్రెటరీ సిక్తా పట్నాయక్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కోత్వాల్, మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ మరియు ప్రెసిడెంట్ ఫహీమ్ ఖురేషీ, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హమ్దాన్, క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాను, మైనార్టీ వెల్ఫేర్ సెక్రెటరీ షఫీ ఉల్లా తదితర ఉన్నతాధికారులు ఉన్నారు.

## సాంకేతికత వికేంద్రీకరణ జరిగినప్పుడే ప్రగతి సాధ్యమవుతుంది

భారత్-ఫ్రాన్స్ ఇన్నోవేషన్ ఇయర్ ద్వారా, భారత్, యూరప్ టెక్ ఎకోసిస్టమ్ వ్యవస్థలను మరింత దగ్గర చేయడానికి ఫ్రాన్స్ ఒక ముఖ్యమైన వారధిలా పనిచేస్తోంది" అని మోదీ పేర్కొన్నారు. ఇక, ఈ వివాటెక్? సదస్సు విజయవంతం చేసినందుకు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, నిర్వాహకులకు మోదీ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

ఇదిలా ఉండగా, భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని ఫ్రెంచ్ పారిశ్రామికవేత్తలు, సంస్థలను మోదీ కోరారు. షిప్పింగ్, లాజిస్టిక్స్, రైల్వేలు, నిర్మాణం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి రంగాల్లో సహకారంపై చర్చించారు. జీ7 సమావేశం తర్వాత పారిస్ చేరుకున్న మోదీ అటం అఉఓ సంస్థ ఛైర్మన్, సీఈఓ రోడోల్ఫ్ సాదేతో సమావేశమయ్యారు. సముద్ర రవాణా, లాజిస్టిక్స్, గ్లోబల్ సప్లై చైన్స్‌పై సాదేతో చర్చించారు. భారత్‌లో పెట్టుబడులు, విస్తరణ ప్రణాళికలను మోదీకి సాదే వివరించినట్లు విదేశాంగశాఖ తెలిపింది. సెయింట్-గోబైన్ ఛైర్మన్, సీఈఓ నోయిట్ బాజిన్‌తోనూ, ప్రధాని సమావేశమయ్యారు. మెటీరియల్స్, నిర్మాణ రంగంలో అవకాశాలపై బాజిన్‌తో మోదీ చర్చించారు. భారత్‌లో మరిన్ని పెట్టుబడులు, విస్తరణ ప్రణాళికలను సెయింట్-గోబైన్ ఛైర్మన్ ప్రధానికి వివరించారు. ఆల్‌స్టోమ్ సీఈఓ మార్టిన్ సియాన్‌తోనూ మోదీ సమావేశమయ్యారు. మొబిలిటీ, రైల్వే ఆధునీకరణలో అవకాశాలపై చర్చించారు. భారత్‌లో మరింత విస్తరణ, పెట్టుబడుల కోసం ఆల్‌స్టోమ్ ప్రణాళికలను ప్రధానికి సియాన్ వివరించారు. 'మిస్ట్రాల్ ఏఐ' సీఈఓ అర్థర్ మెన్ష్‌తోనూ ఆయన భేటీ అయ్యారు. భారత్‌తో కలిసి పనిచేయడానికి, ఏఐ విస్తరణకు అర్థర్ ఆసక్తిని వ్యక్తం చేశారని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. మహిళా సాధికారత, శాంతి భద్రత పరిరక్షణలో ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నామని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి వేదికగా భారత్? వెల్లడించింది. మహిళలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో అవకాశాలు కల్పించినప్పుడే శాశ్వత ఫలితాలు సాధ్యమవుతాయమని భారత్ అనుభవం నిరూపించిందని పేర్కొంది. మహిళలు, శాంతి, భద్రత అంశంపై జరిగిన యూఎన్ఎస్‌సీ బహిరంగ చర్చల్లో మాట్లాడిన ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి హరీశ్ పర్వతనేని ఈ మేరకు ఇండియా సాధించిన విజయాలను ప్రస్తావించారు.'స్థానిక స్వపరిపాలనా సంస్థల్లో రాజ్యాంగబద్ధ రిజర్వేషన్ల ద్వారా 10 లక్షలకుపైగా మహిళలు ఎన్నికైన పదవుల్లో పనిచేస్తున్నారు. ప్రస్తుతం స్థానిక సంస్థల్లో ఎన్నికైన పదవుల్లో మూడో వంతు స్థానాలు మహిళలే ఉన్నారు. అలాగే ఈ నిబంధనను మహిళల రిజర్వేషన్ చట్టం-2023 ద్వారా పార్లమెంట్‌లోనూ అమలు చేస్తున్నారు. భారత్?లో మహిళలు అత్యున్నత పదవులు అధిరోహించిన చరిత్ర ఉంది. దేశానికి ప్రధానంత్రిగా, పార్లమెంట్ స్పీకర్‌గా మహిళలు సేవలందించారు. ప్రస్తుతం దేశాధినేతగా కూడా మహిళే ఉన్నారని చెప్పడం నాకు గర్వంగా ఉంది' అని పర్వతనేని హరీశ్ తెలిపారు.

**లైబీరియాలో చరిత్ర సృష్టించిన భారత్**

లైబీరియాలోని ఐక్యరాజ్యసమితి శాంతి మిషన్‌కు పూర్తిగా మహిళలతో కూడిన ప్రత్యేక దళాన్ని పంపిన తొలి దేశం భారత్ అని పర్వతనేని హరీశ్ గుర్తు చేశారు. దీనివల్ల వేలాది లైబీరియా మహిళలు తమ దేశ పోలీసు విభాగంలో చేరేందుకు స్ఫూర్తినిచ్చిందన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వివిధ యూఎన్ మిషన్లలో 160 మందికి పైగా భారత్ మహిళా శాంతి సిబ్బంది సేవలందిస్తున్నారని తెలిపారు. ది సెంటర్ ఫర్ యునైటెడ్ నేషన్స్? పీస్ కీపింగ్ ద్వారా 2016 నుంచి ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహిళ సైనిక అధికారులకు శిక్షణ అందిస్తున్నట్లు వెల్లడించారు. గతేడాది ఫిబ్రవరిలో 35 దేశాల మహిళా శాంతి సిబ్బందితో గ్లోబల్ సౌత్ మహిళా శాంతి పరిరక్షకుల సదస్సును భారత్ నిర్వహించిందన్నారు. అలాగే 2025 ఆగస్టులో యూఎన్ మహిళా సైనిక అధికారుల కోర్సుకు 15 దేశాల ప్రతినిధులు హాజరయ్యారని చెప్పారు.

## డైట్ కాలేజీల్లో లెక్చరర్ పోస్టులకు నోటిఫికేషన్

### టీజీపీఎస్సీ మరో గుడ్‌న్యూస్..

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణలో నిరుద్యోగులకు టీజీపీఎస్సీ శుభవార్త చెప్పింది. ఇటీవల పలు ఉద్యోగ నియామక నోటిఫికేషన్లు విడుదల చేసిన టీజీపీఎస్సీ.. తాజాగా పాఠశాల విద్యాశాఖ పరిధిలోని డైట్ కళాశాలల్లో సీనియర్ లెక్చరర్స్, లెక్చరర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు జూన్ 24 నుంచి జులై 29వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. నవంబర్‌లో ఈ పరీక్ష జరిగే అవకాశం ఉంది.టీజీపీఎస్సీ మొత్తంగా 86 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా.. వీటిలో సీనియర్ లెక్చరర్లు 23 కాగా, వివిధ సబ్జెక్టులకు సంబంధించి 63 లెక్చరర్ పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయసు 2026 జులై 1 నాటికి కనీసం 18 ఏళ్లు పూర్తయి ఉండాలి. గరిష్ఠ వయో పరిమితిని 44 ఏళ్లుగా పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం వివిధ కేటగిరీలకు వయో పరిమితిలో సడలింపు ఉంటుంది. లెక్చరర్ పోస్టుల భర్తీకి సంబంధించి జోన్ల వారీగా పోస్టుల ఖాళీలు, వయో పరిమితి, వేతనం, పరీక్ష సిలబస్ తదితర వివరాలను వెబ్‌సైట్‌లో చూడొచ్చు.

# సన్నవడ్లకు పెరుగుతున్న ధరలు

- కేసముద్రం మార్కెట్లో పెరిగిన కొనుగోళ్లు



**మహబుబాబాద్, జూన్18 (జనంసాక్షి)** : సన్న ధాన్యానికి మద్దతు పెరుగుతోంది. మార్కెట్లలో మద్దతు ధరలను మించి ధరలు పెంచి కొనుగోళ్లు చేస్తున్నారు. ఈయేడు సరిగా పంటలు పండకపోతే ధరలు పెరుగుతాయన్న భావనలో వ్యాపారులు ఉన్నారు. మహబుబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో ధాన్యం ధర ఈ సీజన్‌లో అత్యధికంగా క్వింటాకు రూ.2,906 నమోదైంది. గత 15 రోజులుగా ఈ మార్కెట్‌లో ఆర్‌ఎన్‌ఆర్ రకం వడ్లరేట్ రోజురోజుకూ పెరుగుతోంది. స్థానిక మార్కెట్‌కు ఈ- వేలం'లో క్వింటాకు గరిష్ఠంగా రూ.2,906, కనిష్ఠంగా రూ.2,226, సగటున రూ.2,589 ధరలతో వ్యాపారులు ఖరీదులు చేశారు. ధాన్యానికి ప్రభుత్వ కనీస మద్దతు ధర క్వింటాకు రూ.2,389 ఉండగా, ఈ సీజన్‌లో అంతకంటే ఎక్కువగానే మార్కెట్లో ధరలు ఉన్నాయి. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా ఉంటాయనే కారణాలతో వ్యాపారులు నిల్వ చేసేందుకు మార్కెట్లో ధాన్యం ఖరీదులు పెంచారు. ఈ క్రమంలో దేశీయంగా ధాన్యానికి డిమాండ్ ఏర్పడడంతో మార్కెట్లో ఈ సీజన్‌లో గత 15 రోజులుగా ధాన్యం సగటు ధర పెరుగుతూ వస్తోంది. ఈ నెల 1న ధాన్యం సగటు ధర రూ.2,475 నుంచి రూ.2,495 వరకు ఉన్నాయి. ఆ తర్వాత ఈనెల 4న సగటు ధర రూ.2, 589, 5న రూ.2636, 8న రూ.2,689, 9న రూ.2,729గా నమోదయ్యాయి. తాజా గా గరిష్ఠ ధర రూ.2,900 మార్కు దాటడం విశేషం.

# ఆర్ట్స్ కళాశాల సెమిస్టర్ ఫలితాలు విడుదల



**హనుమకొండ ప్రతినిధి, జూన్ 18 (జనం సాక్షి)** : హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీఏ ఆనర్స్, బ్యాచిలర్ ఆఫ్ వొకేషనల్ కోర్సులకు సంబంధించిన 4వ, 6వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను గురువారం కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాపరెడ్డి విడుదల చేశారు. 6వ సెమిస్టర్‌లో మొత్తం 680 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 663 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 398 మంది ఉత్తీర్ణులై 60.03% ఉత్తీర్ణత నమోదైంది. 4వ సెమిస్టర్‌లో 1050 మంది దరఖాస్తు చేసుకోగా, 1030 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 573 మంది ఉత్తీర్ణులై 55.63% ఉత్తీర్ణత సాధించినట్లు వైస్ ఛాన్సలర్ తెలిపారు. 6వ సెమిస్టర్ ఫలితాల్లో బీఏ విభాగంలో 204 మంది పరీక్ష రాయగా 127 మంది (62.25%), బీకాం విభాగంలో 176 మందిలో 96 మంది (54.54%), బీఎస్సీ విభాగంలో 259 మందిలో 159 మంది (61.38%), బీఏ ఆనర్స్‌లో 21 మందిలో 13 మంది (61.90%) ఉత్తీర్ణులయ్యారు. బ్యాచిలర్ ఆఫ్ వొకేషనల్ కోర్సులో పరీక్షకు హాజరైన ముగ్గురు విద్యార్థులు ముగ్గురూ ఉత్తీర్ణులై 100% ఫలితాన్ని నమోదు చేశారు. 4వ సెమిస్టర్‌లో బీఏ విభాగంలో 385 మంది పరీక్షలకు హాజరుకాగా 252 మంది (70.64%), బీకాం విభాగంలో 213 మందిలో 99 మంది (46.47%), బీఎస్సీ విభాగంలో 392 మందిలో 189 మంది (48.21%), బీఏ ఆనర్స్‌లో 14 మందిలో 6 మంది (42.85%) ఉత్తీర్ణులయ్యారు. బ్యాచిలర్ ఆఫ్ వొకేషనల్ కోర్సులో పరీక్షకు హాజరైన ఒక్క విద్యార్థి ఉత్తీర్ణుడై 100% ఫలితాన్ని సాధించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయం ఓఎస్డీ ప్రొఫెసర్ వెంకటరామిరెడ్డి, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, ఉస్మానియా విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య ఎస్. సత్యనారాయణ, డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ అనిల్ కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ రెహమాన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీలత, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి, వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ శ్రీధర్ కుమార్, డాక్టర్ భిక్షపతి, డాక్టర్ హరికుమార్, డాక్టర్ స్వామి, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ చందులాల్, డాక్టర్ పుల్ల రమేష్, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ నాగయ్య, డాక్టర్ జె.పి., డాక్టర్ సతీష్, డాక్టర్ లక్ష్మారెడ్డి, డాక్టర్ ప్రసాద్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులను మోసం చేసిన రేవంత్

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



**వరంగల్, జూన్18 (జనంసాక్షి)** : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలే లక్ష్యంగా పోటీ పరీక్షలకు సన్నదమవుతున్న విద్యార్థి, నిరుద్యోగులను ఉద్యోగార్థులుగా తీర్చిదిద్దేందుకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి చే ప్రత్యేకంగా రూపొందించిన యాపస్‌ను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, గండ్ర రమణా రెడ్డి చేతుల మీదుగా హన్మకొండలోని అంబేద్కర్ భవన్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో అన్ని శాఖల్లో కలిపి లక్షా 67 వేల ఉద్యోగాలు ఇచ్చింది. పరోక్షంగా ప్రయివేటు రంగంలో స్వాతంత్య భారత దేశంలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగాలు కల్పించారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఉన్న ప్రయివేటు కంపెనీలు తరలి వెళ్లే పరిస్థితి వచ్చి ఎక్కడా ఉద్యోగ కల్పన జరగడకపోవడం దుర్మార్గం అన్నారు. ప్రతి రెండేళ్లకోసారి పోలీస్ ఉద్యోగాలను భర్తీ చేసుకోవడం బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక అనవాయితీగా ఉండేది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 30 నెలల కావొస్తున్నా ఒక్క పోలీస్ ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వలేదని మండిపడ్డారు. విద్యారంగాన్ని సైతం నిర్వీర్యం చేసే కుట్ర సాగుతుంది. ఇప్పటి వరకు ఏ ఒక్క యూనివర్సిటీలో కూడా అధ్యాపక పోస్ట్ లు భర్తీ చేయడం లేదు. ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి అని నోటికొచ్చిన హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే ఫ్లేట్ పిరాయించారని మండిపడ్డారు. నిరుద్యోగులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఉన్నత విద్యావంతుడు నిరుద్యోగ యువత సమస్యలు నిత్యం వారు పడే కష్టాలు చూసే వ్యక్తి కాబట్టి మీ అందరి కోసం యాప్ ను రూపొందించిన ఉచితంగా మీకు అందించడం నిజంగా అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, ఆర్ట్స్ అండ్ సైన్స్ ప్రొఫెసర్ తిర్నారి శేషు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుకుమార్, ప్రముఖ న్యూరో వైద్యులు నవీన్ ఉన్నారు.

# ఫీజు రీయంబర్స్‌మెంట్ కోసం ఆందోళన

- బీఆర్ఎస్వీ విద్యార్థి నాయకులను ముందస్తు అరెస్ట్



**సూర్యాపేట, జూన్18 (జనంసాక్షి)** : ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయాలని, పాఠశాలల్లో కనీస వసతులు కల్పించలాని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ విద్యార్థి సంఘం పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా వేకువజాము నుంచే బీఆర్ఎస్వీ విద్యార్థి నాయకులను ముందస్తు అరెస్ట్ చేసి వివిధ పోలీస్ స్టేషన్‌లకు తరలిస్తున్నారు. బీఆర్ఎస్వీ జిల్లా కో ఆర్డినేటర్ క్లలెట్లపల్లి శోభన్ బాబుతో పాటు విద్యార్థి నాయకులను అరెస్ట్ చేసి సూర్యాపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అసలు రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా? పోలీసులు దుర్మార్గంగా వ్యవహరిస్తూ విద్యార్థి నాయకులను అక్రమంగా అరెస్ట్ లు చేస్తున్నారని శోభన్ బాబు మండిపడ్డారు. ప్రశ్నించినా, నిలదీసినా కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. కేసులకు, అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేసే వరకు నిరంతరం ప్రజల తరపున ప్రశ్నిస్తామన్నారు.

# వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలి

- దిశా సమావేశంలో కేంద్ర పథకాలపై సమీక్ష




**వరంగల్ బ్యూరో, జూన్ 18 (జనం సాక్షి)** : కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, నిధుల వినియోగంపై వరంగల్ జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశంలో సమగ్ర సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ డా. సత్య శారద అధ్యక్షతన జరిగిన సమావేశానికి శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, కె.ఆర్. నాగరాజు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండా ప్రకాశ్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వైద్య, ఆరోగ్య శాఖ పనితీరుపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ వ్యవసాయానికి ప్రాధాన్యం ఇస్తూ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడిపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ నేల సారాన్ని కాపాడేందుకు రైతులను సహజ, సేంద్రియ వ్యవసాయ పద్ధతుల వైపు ప్రోత్సహించాలని సూచించారు. అలాగే పాఠశాలల్లో పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు కృషి చేయాలని అన్నారు. వరంగల్ అభివృద్ధికి అవసరమైన నిధుల కేటాయింపుల కోసం సంబంధిత శాఖలు త్వరగా డీపీఆర్‌లు సిద్ధం చేసి సమర్పించాలని, వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి నిధులు సాధించేందుకు కృషి చేస్తానని ఎంపీ కడియం కావ్య పేర్కొన్నారు. ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య మాట్లాడుతూ ఎంజీఎం ఆస్పత్రిలో నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అన్ని రకాల వైద్య పరీక్షలు అక్కడే నిర్వహించే విధంగా సౌకర్యాలు కల్పించాలని కోరారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ రైతులకు అవసరమైన మేరకే యూరియా సరఫరా చేయాలని, అధిక రసాయన ఎరువుల వినియోగం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. రైతులకు రసాయనాల వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని, వైద్యుల హాజరు పర్యవేక్షణకు ఫేస్ రికగ్నిషన్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. కలెక్టర్ డా. సత్య శారద మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుని పూర్తి స్థాయిలో నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమావేశంలో జడ్పీ సీఈఓ రామ్‌రెడ్డి, డీఆర్‌డీఓ నాగపద్మజ, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సుమ, ఉమారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి


- నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ బ్యూరో, జూన్ 18 (జనంసాక్షి)** : బాసర లోజరగనున్న గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం బాసర పుష్కరాల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వచ్చే సంవత్సరంలో నిర్వహించే గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా పాత పుష్కర ఘాట్లకు అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు, అవసరమైన చోట కొత్త ఘాట్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పుష్కర ఘాట్లను భక్తులకు కనువిందుగా ఉండేలా సుందరీకరించాలని, కళ్యాణ కట్ట, పిండ ప్రదాన వేదికలు, దుస్తులు మార్చుకునే గదులను తక్షణమే నిర్మించాలని సూచించారు. చేపట్టే ప్రతి నిర్మాణ పనిలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ఘాట్ల సమీపంలో భక్తులకు తాగునీటి కొరత లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అలాగే, ఆయా శాఖల అధికారులు తమకు కేటాయించిన పనులకు సంబంధించిన పూర్తి స్థాయి ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. ఈ సందర్భంగా బాసర ఆలయ మాస్టర్ ప్లాన్‌పై కూడా చర్చించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, బాసర ఆలయ ఈవో అంజనా దేవి, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ సందీప్, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాసర ఆలయ అభివృద్ధి పనులకు వేగం

- దేవాదాయ శాఖ స్థపతి, డిజైన్ నిపుణుల బృందం క్షేత్రస్థాయి పరిశీలన



**బాసర, జూన్18 (జనం సాక్షి)** : జ్ఞాన సరస్వతి అమ్మవారి క్షేత్రమైన బాసర ఆలయ సమగ్ర అభివృద్ధికి దేవాదాయ శాఖ రంగం సిద్ధం చేస్తోంది. వచ్చే నెలలో పనులు ప్రారంభించేందుకు అధికారులు కార్యాచరణ వేగవంతం చేశారు. ఇందులో భాగంగా గురువారం రాష్ట్ర దేవాదాయ శాఖ స్థపతి మోతీలాల్, ప్రముఖ రూపకల్పన నిపుణురాలు మాధవి నేతృత్వంలోని ప్రత్యేక బృందం ఆలయాన్ని సందర్శించింది. ఆలయ కార్యనిర్వహణ అధికారి అంజనీదేవి, స్థానాచార్యుడు ప్రవీణ్ పాటక్, ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారితో కలిసి బృందం ఆలయ ప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలించింది. ముఖ్యంగా ప్రస్తుతం భక్తుల రద్దీగా ఉండే రూ.150 అక్షరాభ్యాస మండపం, నూతనంగా ప్రతిపాదించిన బాలాలయం స్థలం, రూ.1,000 ప్రత్యేక అక్షరాభ్యాస మండపం ఏర్పాటు ప్రాంతం, భక్తుల సౌకర్యార్థం చేపట్టనున్న క్యూలైన్ మార్గాలను బృందం సమగ్రంగా పరిశీలించింది. అక్షరాభ్యాసాల కోసం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వసతులు కల్పించాలని, ఆలయ వాస్తు, సంప్రదాయాలకు అనుగుణంగా డిజైన్లు రూపొందించాలని ఆలయ ఇంజినీరింగ్ అధికారులకు స్థపతి బృందం పలు కీలక సూచనలు చేసింది. పనుల నాణ్యతలో రాజీ పడవద్దని స్పష్టం చేసింది. ఈ పరిశీలన కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు సంజీవరావు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. వచ్చే నెల నుండి అభివృద్ధి పనులు ప్రారంభమైతే భక్తులకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆలయ అధికారులు తెలిపారు.

## వన మహోత్సవ్-2026 సందర్భంగా జిల్లాలో
# రూ.1.84 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం

- వర్చువల్ గా పనులు ప్రారంభించిన సీఎం కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ ఎమ్మెల్యే..



**ఖానపురం, జూన్ 18: (జనం సాక్షి)**: రాష్ట్ర స్థాయి వన మహోత్సవ్--2026 వేడుకల సందర్భంగా వరంగల్ జిల్లాలో అటవీ శాఖ ఆధ్వర్యంలో పూర్తి చేసిన అభివృద్ధి, ఎకో-టూరిజం మౌలిక సదుపాయాల పనులను గురువారం సాయంత్రం గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నర్సంపేట రేంజ్ పరిధిలోని పాఖాల్ బయోడైవర్సిటీ పార్క్ లో సందర్శకుల సౌకర్యాల విస్తరణకు చేపట్టిన పలు పనులు అందుబాటులోకి వచ్చాయి. సఫారీ వాహనాలు, పెడల్ బోటింగ్ పూల్, పర్యావరణ విద్యా కేంద్రం (ఈఈసీ) భవనం, డార్మిటరీ హాల్, నైట్ క్యాంపింగ్ ప్రాంతం, ఆర్‌వో ప్లాంట్, సీసీ రోడ్ల నిర్మాణం వంటి పనులను హరిత నిధి, బయోసోట్ , అఫారెస్టేషన్ ఫండ్స్, జాపాట్ పథకాల కింద రూ.153.95 లక్షల వ్యయంతో పూర్తి చేశారు. అదేవిధంగా, వరంగల్ జిల్లా అటవీ కార్యాలయ భవనంలో పునరుద్ధరణ, ఆధునికీకరణ పనులను సీఏ-పీడీ ఇంటరెస్ట్ నిధుల కింద రూ.30 లక్షల వ్యయంతో చేపట్టి పూర్తి చేశారు. మొత్తం రూ.183.95 లక్షల విలువైన ఈ అభివృద్ధి పనులు ఎకో-టూరిజం ప్రోత్సాహం, పర్యావరణ విద్య విస్తరణ, సందర్శకులకు మెరుగైన సౌకర్యాల కల్పన, అటవీ శాఖ మౌలిక వసతుల బలోపేతానికి దోహదపడనున్నాయని అధికారులు తెలిపారు. వన మహోత్సవ్ సందర్భంగా ఈ పనుల ప్రారంభం రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ, అటవీ సంపద అభివృద్ధి, ప్రకృతి ఆధారిత పర్యాటక రంగ ప్రోత్సాహానికి ఇస్తున్న ప్రాధాన్యతను ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ సత్య శారద, సీపీ సన్ ప్రీత్ సింగ్ ,అదనపు కలెక్టర్లు గణేష్, సంధ్యారాణి, ఆర్డీవో ఉమా రాణి, ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు..

# మహిళా డిగ్రీ కాలేజీలో ప్రవేశాలు

- 21వ తేదీలోపు దరఖాస్తుకు ఆహ్వానం

**నల్లగొండ, జూన్18 (జనంసాక్షి)** : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల నల్లగొండ, డిగ్రీ మొదటి సంవత్సరం వివిధ కోర్సుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం అడ్మిషన్లు కొనసాగుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పవిత్ర వాణి కర్ష తెలిపారు. కళాశాలలో వివిధ కోర్సుల్లో విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 21వ తేదీ లోపు కళాశాలలో సంప్రదించాల్సిందిగా సూచించారు. ఆసక్తి గల ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు పదో తరగతి మెమో, ఇంటర్మీడియట్ మెమో, 2026 జనవరి తర్వాత పొందిన ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, ఐదు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ జిరాక్స్, ఇంటర్మీడియట్ టీసీతో పాటుగా రెండు సెట్ల జిరాక్స్ కాపీస్ తో నేరుగా కళాశాలలో హాజరై అడ్మిషన్లు పొందవచ్చునని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 10:00 నుండి సాయంత్రం 4 గంటల వరకు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

# వర్షాలు సమృద్ధిగా కురవాలని పూజలు

**ఆదిలాబాద్, జూన్18 (జనంసాక్షి)** : ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం రాంపూర్‌లో ఆదివాసులు అకాడి పండుగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామ సమీపంలోని శివారులో వన దేవతకు సాంప్రదాయ పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పశు వులకు కొత్తగా చిగురించిన మేతను తినిపించారు. వర్షాలు సమృద్ధిగా కురువాలని , పంట దిగుబడి రావాలని, మూగజీవాలకు, పశు కాపర్లకు విష జంతువుల నుంచి ఎలాంటి హాని కలుగకుండా రక్షణ కల్పించాలని వన దేవతకు వేడుకున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హెచ్ కె జంగు పటేల్, దేవారి రూప్ దేవ్, జగ్గేరావు, సీతారాం, దేవ్ రావు, పాండు, దాది రావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# అనుమానాస్పద స్థితిలో దంపతుల మృతి

- కుమారుడి ఫిర్యాదుతో పోలీసుల దర్యాప్తు

**కుమ్రంభీం ఆసిఫాబాద్, జూన్18 (జనంసాక్షి)** : కుమ్రం భీం జిల్లా ఆసిఫాబాద్ మండలంలో అనుమానాస్పద స్థితిలో దంపతులు మృతి చెందడం కలకలం సృష్టిస్తోంది. తుంపల్లి గ్రామపంచాయతీ కోసార గ్రామ పరిధిలోని భవానీ నగర్‌లో దారుణం చోటు చేసుకుంది. బానోత్ రాజు ,సునీత దంపతులు బుధవారం రాత్రి అనుమానాస్పదంగా మృతి చెందారు. ఇద్దరు దంపతులు కొడుకు, కోడలుతో కలిసి భవానీ నగర్‌లో జీవనం కొనసాగిస్తున్నారు. రాత్రి భోజనం చేసిన అనంతరం భార్యాభర్తలు ఇద్దరు ఇంటి బయట వరండాలో పడుకున్నారు. రాత్రి 3 గంటల ప్రాంతంలో కరెంట్ పోవడంతో కోడలు తమ చిన్న పాపను అత్త సునీత దగ్గర పడుకోబెట్టేందుకు వచ్చి నిద్ర నుంచి లేపే ప్రయత్నం చేయగా ఆమె నుంచి స్పందన రాకపోవడంతో చూడగా అప్పటికే ఇద్దరు మృతి చెందారు. గతంలో పీరీల విషయంలో గొడవలు జరిగాయని, తమ తల్లిదండ్రులను హత్య చేసి ఉంటారని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆసిఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ధర్మపురిలో విషాద ఘటన

- కోతుల కొట్లాటలో రాయిపడి మహిళ మృతి

**జగిత్యాల, జూన్18 (జనంసాక్షి)** : జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. కోతుల కొట్లాట ఓ మహిళ ప్రాణాన్ని బలి తీసుకుంది. మిద్దెపై కోతులు కొట్లాడుకుంటూ కింద ఉన్న మహిళ తలపై సిమెంట్ ఇటుక పడేశాయి. దీంతో ఆ మహిళ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. ధర్మపురిలోని కమలాపూర్ రోడ్డు ఇందిరమ్మ కాలనీకి చెందిన కొనపర్తి సత్యనారాయణ, పద్మ భార్యాభర్తలు. బుధవారం సాయంత్రం పద్మ ఇంటి ముందు కూర్చుని మరో మహిళతో మాట్లాడుతోంది. అదే సమయంలో ఇంటి రేకులపై కోతులు తీవ్రంగా గొడవపడసాగాయి. ఈ నేపథ్యంలోనే రేకులు గాలికి ఎగిరిపోకుండా ఉండటానికి బరువు కోసం పెట్టిన సిమెంట్ ఇటుకను కిందకు పడేశాయి. ఆ ఇటుక నేరుగా పద్మ తలపై పడింది. తలకు తీవ్ర గాయం అవ్వటంతో పద్మ అక్కడికక్కడే చనిపోయింది. ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
19 జూన్ 2026

# అవమానాల నీడలో ఇజ్రాయిల్

సంపాదకీయం

కుదిరింది శాంతి ఒప్పందం.. కానీ ఆ శాంతి వెనుక ఒంటినిండా గాయాలతో నిలబడింది ఇజ్రాయిల్. అనుకున్నదొకటి, అయ్యింది మరొకటి. పర్షియన్ల తెగువ ముందు తలవంచిన దేశంగా చరిత్రలో నిలిచిపోయే పరిస్థితి దాపురించింది. అమెరికా ఇరాన్‌లను చర్చల బల్ల దగ్గర కూర్చోబెట్టిన ఈ ఒప్పందం విజేత నిర్దేశించిన ఒప్పందం కాదు, ఇరు పక్షాలూ అలసిన తర్వాత చేసుకున్న రాజీ. కానీ ఈ రాజీని అర్థం చేసుకోవాలంటే, అమెరికా గత రెండు దశాబ్దాలుగా ప్రపంచంపై చలాయించిన ఆధిపత్యాన్ని తెరచి చూడాలి. ప్రజాస్వామ్యం పేరిట, శాంతి పేరిట, న్యాయం పేరిట జరిగిన ఆ చరిత్ర మరొక రూపంలో చెప్పాలంటే బలమైన దేశం బలహీన దేశాలపై సాగించిన నేరాల పట్టిక.

2003లో అమెరికా ప్రపంచం ముందు ఒక సీసా పట్టుకొని నిలబడింది. ఇది సామూహిక విధ్వంస రసాయన ఆయుధాల సాక్ష్యమని అన్నది. ఆ సీసాలో ఏముందో తర్వాత తెలిసింది. అది నిరాధారమైన నటన మాత్రమే. కానీ అప్పటికే పాచిక పడింది. ఐరాస అనుమతి లేకుండా, ప్రపంచ అభ్యంతరాలను పక్కన పెట్టి అమెరికా ఇరాక్‌పై దాడి చేసింది. సద్దాం హుస్సేన్‌ను పట్టుకుని అతని దేశంలోనే ఉరి తీసింది. ఒక దేశాధ్యక్షుడిని ఉరికంబానికి ఎక్కించడం సంఘటన కాదు.. అది ఒక దేశాన్ని మొత్తంగా అవమానపరచడం. ఇరాక్‌లో దొరికింది ఏమిటి? సామూహిక విధ్వంస ఆయుధాలు దొరకలేదు. దొరికింది లక్షలాది మంది నిర్దోషుల మరణాలు, ఒక దేశం శిథిలాలు, ఐఎస్ఐఎస్ పుట్టుకకు అనువైన నేల.

*సద్దాం ఉరికంబం కంటే దారుణంగా ముగిసిన కథ ముఅమ్మర్ గద్దాఫీది. 2011లో అమెరికా నేతృత్వంలో నాటో దాడులు లిబియాను చీకటిలోకి నెట్టాయి. గద్దాఫీని వెతికి పట్టుకున్నారు. విచారణ లేదు, న్యాయస్థానం లేదు, హక్కులు లేవు. నడిబజారులో అతన్ని అత్యంత క్రూరంగా హత్య చేశారు. అమెరికా విదేశాంగ మంత్రి హిల్లరీ క్లింటన్ ఆ వార్త విన్నప్పుడు నవ్వుతూ "వి కేమ్, విసా, హి డైడ్" అన్నారు. ఒక దేశాధ్యక్షుని మరణాన్ని వేడుకగా పరిగణించడం.. దానికి పేరు ఏమిటి? లిబియా ఇప్పటికీ గుండె రక్తం కారుతున్న గాయంలా ఉంది. స్థిరమైన ప్రభుత్వం లేదు, శాంతి లేదు, మనుషులు సముద్రాల మీద పడవలలో ప్రాణాలు పణంగా పెట్టి పారిపోతున్నారు.*

వెనిజులా విషయంలో అమెరికా మరింత నగ్నంగా వ్యవహరించింది. హ్యూగో చావెజ్ అమెరికాకు నచ్చలేదు. ఎందుకంటే అతను వెనిజులా చమురు సంపదను అమెరికన్ కంపెనీల చేతుల నుండి తీసుకుని సొంత ప్రజలకు పంచాడు. 2002లో సీఐఏ ప్రత్యక్ష ప్రమేయంతో చావెజ్‌ను అపహరించారు. తాత్కాలికంగా అధికారం కోల్పోయాడు. కానీ వెనిజులా ప్రజలు వీధుల్లోకొచ్చారు. చావెజ్ తిరిగొచ్చాడు. అయినా అమెరికా ఆగలేదు. ఆర్థిక ఆంక్షలు, దిగ్బంధనాలు, ప్రత్యర్థులకు నిధులు, ఒక దేశాన్ని మోకాళ్ళపై నిలబెట్టే ప్రయత్నం నేటికీ కొనసాగుతోంది. ప్రజలు పస్తులుంటున్నారు. ఆ ఆకలి కూడా అమెరికా విధానాల ఫలితమే. ఇరాక్, లిబియా, వెనిజులాలలో సాధించిన విజయాల మత్తులో అమెరికా ఇరాన్ విషయంలోనూ అదే ఫార్ములా పని చేస్తుందని అనుకుంది. యుద్ధం మొదలుపెడితే లోపల తిరుగుబాటు వస్తుందని, అందులోంచి కీలుబొమ్మ ప్రభుత్వాన్ని తీసుకొస్తామని, ఇరాన్ చమురు సంపదపై పట్టు సాధిస్తామని లెక్కేసింది. అనుకున్నదొకటి అయ్యింది మరొకటి. ఇరాన్ ప్రజలు 1953లో సీఐఏ తమ ప్రజాస్వామ్యికంగా ఎన్నుకున్న నాయకుడు మొసాదేగ్‌ను పడగొట్టిన చరిత్ర మర్చిపోలేదు. పర్షియన్ల తెగువతో నిలబడ్డారు. బాహ్య శత్రువు ముందు విడిపోయే బదులు ఒక్కటయ్యారు. ఇరాన్ మెడ వంచాలన్న కల కలగానే మిగిలిపోయింది.

నెతన్యాహు ప్రభుత్వం ఇరాన్‌ను మోకరిల్లించాలని ముందుకు నెట్టింది. కానీ ఆ పందేంలో పణంగా పెట్టింది ఇజ్రాయిల్ సొంత భూభాగపు భద్రతను, ప్రజల నమ్మకాన్ని. ఒంటినిండా గాయాలతో నిలబడిన ఇజ్రాయిల్ వీధుల్లో ఇప్పుడు నెతన్యాహుకు వ్యతిరేకంగా నినాదాలు మిన్నంటుతున్నాయి. యుద్ధం ఆరంభమయినప్పుడు ప్రజలు నాయకుని చుట్టూ మూగుతారు. కానీ యుద్ధం సాగినకొద్దీ, ముగింపు కనిపించని కొద్దీ, చెల్లించిన మూల్యం అర్థమైన కొద్దీ ప్రజలు ప్రశ్నించడం మొదలెడతారు. ఇరాక్‌లో ఉరికంబం, లిబియాలో నడిబజారు హత్య, వెనిజులాలో అపహరణ ఇవన్నీ చేసిన దేశమే ఇప్పుడు శాంతి ఒప్పందం కుదుర్చుకుందంటే చరిత్రకు వింత అనిపించదు. ఆధిపత్యం అనంతంగా సాగదు. ప్రతి సామ్రాజ్యం ఒక దశలో గోడకు ఢీకొంటుంది. అమెరికాకు ఇప్పుడు ఆ గోడ కనిపించింది. ఇరాన్‌తో యుద్ధం గెలవలేకపోవడమే కాదు.. ఆ ప్రయత్నంలో తన అతి నమ్మకమైన మిత్రుడైన ఇజ్రాయిల్‌ను అస్థిరపరిచింది. పర్షియన్ల తెగువ ముందు తలవంచిన ఇజ్రాయిల్.. ఈ అవమానం చరిత్ర పుటల్లో చెరిగిపోదు. యుద్ధం మిగిల్చే గాయాలు, అవమానాలు బలవంతులకైనా బలహీనులకైనా సమానంగా తగులుతాయి. అది మళ్ళీ రుజువైంది.

# జెన్-జీ.. నవభారత నిర్మాణంలో చారిత్రక శక్తి

***"చరిత్రను చదవడం కాదు... చరిత్రను నిర్మించడం యువత కర్తవ్యం!"***



నేటి ప్రపంచంలో "జెన్-జీ" గా పిలువబడే యువత కేవలం ఒక వయో వర్గం మాత్రమే కాదు. వారు ఒక మహా చారిత్రక శక్తి. భారతదేశ జనాభాలో అత్యధిక శాతం యువతే ఉన్న నేపథ్యంలో, దేశ భవిష్యత్తును నిర్ణయించే అత్యంత కీలకమైన సామాజిక శక్తిగా వారు నిలుస్తున్నారు. సాంకేతిక విప్లవం, డిజిటల్ యుగం, ప్రపంచీకరణ ప్రభావాల మధ్య పెరిగిన ఈ తరం అపారమైన అవకాశాలను అందిపుచ్చుకునే స్థితిలో ఉన్నప్పటికీ, అదే సమయంలో ఎన్నడూ లేనంత సంక్లిష్టమైన సవాళ్లను కూడా ఎదుర్కొంటోంది.

నేటి భారత యువత చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంది, ప్రపంచ సమాచారానికి తలుపులు తెరచిన ఇంటర్నెట్ ఉంది, కానీ భవిష్యత్తుపై నమ్మకం మాత్రం క్రమంగా క్షీణిస్తోంది. ఒకవైపు "విశ్వగురు భారత్" అనే గొప్ప నినాదాలు వినిపిస్తుంటే, మరోవైపు లక్షలాది చదువుకున్న యువత ఉద్యోగాల కోసం నిరీక్షణలో నిలబడాల్సి వస్తోంది. డిగ్రీలు పెరుగుతున్నాయి కానీ ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయి. విద్యను ఒక ప్రాథమిక హక్కుగా కాకుండా, కొనుగోలు చేయాల్సిన వస్తువుగా మార్చే విధానాలు యువత భవిష్యత్తును సంక్షోభంలోకి నెడుతున్నాయి.

### నిరుద్యోగం - యువత భవిష్యత్తుపై మబ్బులు

స్వాతంత్ర్యం తర్వాత ఎన్నడూ లేనంతగా నేడు నిరుద్యోగం యువత జీవితాలను ప్రభావితం చేస్తోంది. పోటీ పరీక్షలకు సంవత్సరాల తరబడి సిద్ధమవుతున్న లక్షలాది మంది యువకులు ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ రంగ నియామకాలు క్షీణిస్తున్నాయి. కాంట్రాక్ట్ విధానం, ఔట్‌సోర్సింగ్, గిగ్ ఎకానమీ పేరుతో ఉద్యోగ భద్రత లేని వ్యవస్థను యువతపై రుద్దుతున్నారు. ఒకప్పుడు విద్య పూర్తయితే ఉపాధి లభిస్తుందని నమ్మకం ఉండేది. ఇప్పుడు విద్య పూర్తయినా ఉపాధి లభిస్తుందనే హామీ లేదు. ఇదే యువతలో అసంతృప్తికి, నిరాశకు కారణమవుతోంది. కానీ ఈ అసంతృప్తి కేవలం వ్యక్తిగత సమస్య కాదు; ఇది ఒక సామాజిక, రాజకీయ ప్రశ్న. ఉపాధి హక్కు కోసం యువత చేసే పోరాటం ప్రజాస్వామ్య పోరాటంలో అంతర్భాగం.

### విద్యపై కార్పొరేట్ పట్టు

విద్య అనేది ఒక సమాజ అభివృద్ధికి పునాది. కానీ నేడు విద్యా వ్యవస్థ క్రమంగా కార్పొరేట్ ఆధీనంలోకి వెళ్లిపోతోంది. ప్రభుత్వ విద్యా సంస్థలను బలహీనపరుస్తూ, ప్రైవేటు విద్యను ప్రోత్సహించే విధానాలు అమలవుతున్నాయి. ఫలితంగా పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారుతోంది. విద్య అనేది ఉద్యోగం పొందడానికి మాత్రమే కాదు, సమాజాన్ని అర్థం చేసుకోవడానికి, ప్రశ్నించడానికి, విమర్శనాత్మక ఆలోచన పెంపొందించుకోవడానికి అవసరం. అందుకే విద్యను వ్యాపార వస్తువుగా మార్చే ప్రయత్నాలను యువత అర్థం చేసుకుని ప్రతిఘటించాలి.

### డిజిటల్ యుగం - అవకాశమా? ప్రమాదమా?

జెన్-జీ తరం డిజిటల్ ప్రపంచంలో పెరిగింది. సోషల్ మీడియా, కృత్రిమ మేధస్సు, డిజిటల్ కమ్యూనికేషన్ వారి జీవితంలో భాగమయ్యాయి. ఇవి అపారమైన అవకాశాలను తెచ్చిపెట్టాయి. సమాచారాన్ని వేగంగా అందించాయి. ప్రపంచవ్యాప్తంగా జరిగే పరిణామాలను తెలుసుకునే అవకాశాన్ని కల్పించాయి. అయితే ఇదే డిజిటల్ ప్రపంచం మరోవైపు అసత్య ప్రచారాలకు, విద్వేష రాజకీయాలకు, కుట్ర సిద్ధాంతాలకు వేదికగా కూడా మారింది. అబద్ధాన్ని వందసార్లు ప్రచారం చేసి నిజమని నమ్మించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. యువతను మతం, కులం, ప్రాంతం పేరుతో విభజించే ప్రచార యంత్రాంగం నిరంతరం పనిచేస్తోంది.

అందువల్ల జెన్-జీ యువత కేవలం సమాచార వినియోగదారులుగా కాకుండా, సమాచారాన్ని విశ్లేషించే విమర్శనాత్మక పౌరులుగా ఎదగాలి. ప్రతి సమాచారాన్ని ప్రశ్నించాలి. ప్రతి ప్రచారాన్ని పరిశీలించాలి. శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి.

### భగత్‌సింగ్ నుంచి అంబేద్కర్ వరకు - యువతకు దిక్సూచులు

భారత చరిత్రలో యువత ఎప్పుడూ మార్పుకు చోదకశక్తిగానే నిలిచింది. భగత్‌సింగ్ కేవలం ఒక విప్లవకారుడు మాత్రమే కాదు, యువతకు ఒక ఆలోచనా విధానం. ఆయన యువతను మూఢనమ్మకాల నుండి, అంధ విశ్వాసాల నుండి విముక్తి పొంది శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చాడు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విద్య, సంఘటితం, పోరాటం అనే మూడు మహా ఆయుధాలను యువత చేతుల్లో పెట్టాడు. కుల వివక్ష లేని సమాజం కోసం ఆయన చేసిన పోరాటం నేటికీ మార్గదర్శకమే. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం మనకు ధైర్యాన్ని నేర్పింది. నక్సల్బరీ తిరుగుబాటు దోపిడీకి వ్యతిరేకంగా ప్రతిఘటన అవసరాన్ని గుర్తు చేసింది. ఈ చారిత్రక అనుభవాలన్నీ నేటి జెన్-జీకి విలువైన పాఠాలు.

### వర్గ పోరాటం - కుల నిర్మూలన విడదీయరాని అంశాలు

భారత సమాజాన్ని అర్థం చేసుకోవాలంటే కేవలం ఆర్థిక అసమానతలను మాత్రమే చూడటం సరిపోదు. కుల వివక్ష, లింగ అసమానత, ప్రాంతీయ వెనుకబాటుతనం.. ఇవి పరస్పరం ముడిపడి ఉన్నాయి. సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ రాజకీయ దృక్పథం ప్రకారం, వర్గ పోరాటం మరియు కుల నిర్మూలన పరస్పర విరుద్ధ అంశాలు కావు. అవి ఒకే విముక్తి ప్రాజెక్ట్‌కు చెందిన రెండు ధ్రువాలు. భూమిలేని రైతులు, అసంఘటిత రంగ కార్మికులు, అట్టడుగు వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకోకుండా సామాజిక మార్పు సాధ్యం కాదు.

అందువల్ల ఉద్యోగ హక్కు కోసం పోరాడే యువకుడు కుల వివక్షను కూడా ప్రశ్నించాలి. మహిళా సమానత్వం కోసం పోరాడే యువతి ఆర్థిక అసమానతలపై కూడా గళమెత్తాలి. ఈ సమన్వయ దృక్పథమే నూతన ప్రజాస్వామ్య భారత నిర్మాణానికి పునాది.

### ఫాసిజం మరియు యువత

చరిత్రలో ప్రతి ఫాసిస్టు శక్తి ముందుగా యువతనే లక్ష్యంగా చేసుకుంది. ఎందుకంటే యువత సమాజంలో అత్యంత చురుకైన, సృజనాత్మక శక్తి. ఫాసిజం యువతను ప్రశ్నించే వ్యక్తులుగా కాకుండా అంధానుచరులుగా మార్చాలని చూస్తుంది. చరిత్రను వక్రీకరించడం, శాస్త్రీయ ఆలోచనను బలహీనపరచడం, మత విద్వేషాలను రెచ్చగొట్టడం, కల్పిత శత్రువులను సృష్టించడం.. ఇవన్నీ ఫాసిస్టు రాజకీయాల సాధారణ లక్షణాలు. యువత ఈ కుట్రలను గుర్తించాలి. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను, లౌకికతను, సౌభ్రాతృత్వాన్ని కాపాడే బాధ్యతను స్వీకరించాలి.

### యువత - ప్రజాస్వామ్యానికి రక్షక కవచం

సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ దృష్టిలో యువత కేవలం ఎన్నికల సమయంలో ఓటు వేసే పౌరులు కాదు. వారు ప్రజాస్వామ్యానికి రక్షక కవచాలు. సమాజ మార్పుకు చోదకశక్తులు. ప్రతి ప్రజా ఉద్యమంలో, ప్రతి కార్మిక సమ్మెలో, ప్రతి రైతాంగ పోరాటంలో, ప్రతి విద్యార్థి ఉద్యమంలో యువత అగ్రభాగాన నిలబడాలి.

నిరుద్యోగంపై పోరాటం, విద్యా హక్కు కోసం ఉద్యమం, రాజ్యాంగ పరిరక్షణ కోసం సమీకరణ, మహిళా సమానత్వం కోసం కృషి, కుల వివక్ష వ్యతిరేక ఉద్యమం.. ఇవన్నీ విడివిడిగా కనిపించినా, వాస్తవానికి ఒకే ప్రజాస్వామ్య పోరాటంలోని విభిన్న పార్శ్వాలు.

### నవభారత నిర్మాణం - జెన్-జీ చారిత్రక బాధ్యత

నక్సల్బరీ లేవనెత్తిన ప్రశ్నలు ఇంకా సమాధానం కోసం ఎదురు చూస్తున్నాయి. తెలంగాణ రైతాంగ పోరాటం కలగన్న సమానత్వం ఇంకా పూర్తిగా సాకారం కాలేదు. అంబేద్కర్ ఆశించిన సామాజిక ప్రజాస్వామ్యం ఇంకా అసంపూర్ణంగానే ఉంది. భగత్‌సింగ్ కలగన్న దోపిడీ రహిత భారతం ఇంకా నిర్మాణ దశలోనే ఉంది. ఈ చారిత్రక అసంపూర్ణతలను పూర్తి చేసే బాధ్యత నేటి జెన్-జీ భుజాలపై ఉంది. చరిత్రను వారసత్వంగా స్వీకరించడం మాత్రమే కాదు, దానిని ముందుకు తీసుకెళ్లడం కూడా యువత కర్తవ్యం. యువత ముందుకు వస్తే చరిత్ర కదులుతుంది. ప్రజలు సంఘటితమైతే వ్యవస్థలు మారతాయి. సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం అనే పునాదులపై నిర్మితమయ్యే నవభారతమే మన గమ్యం.

యువ మిత్రులారా!

మీ చేతుల్లో ఉన్న మొబైల్ ఫోన్ కంటే మీ చేతుల్లో ఉన్న చరిత్ర గొప్పది. మీ సోషల్ మీడియా ఖాతా కంటే మీ సామాజిక బాధ్యత గొప్పది. మీ వ్యక్తిగత విజయాల కంటే ప్రజల విముక్తి కోసం చేసే కృషి గొప్పది.

ప్రశ్నించండి.
ఆలోచించండి.
సంఘటితమవండి.
పోరాడండి.
ఫాసిజాన్ని ఓడిద్దాం!
ప్రజాస్వామ్యాన్ని గెలిపిద్దాం!
యువశక్తిని ఏకం చేద్దాం!
సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక
న్యాయంతో కూడిన నవభారతాన్ని
నిర్మిద్దాం!



**- మామిండ్ల రమేష్ రాజా**
రాష్ట్ర కార్యదర్శి,
సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ తెలంగాణ
సెల్ : 7893230218

## ఎవరి పానాల్ వాళ్లే భద్రం..



ముప్పది గుర్రాల్ది బండి
ముచ్చటైన హెల్తు దండీ!
నెలల్నిండని పిండమండి
పుట్కనుండీ గండాలండీ!!
ఫస్ట్ సర్కార్ సెక రెట్రీలు
నెక్స్ట్ సర్వీస్ సంఘాల్..
లాస్ట్ వజీపైన వజీర్లంట
జీహుజూర్ దోస్తానాలన్నీ..
నిన్నగాక మొన్నొర్గిననడ్డి
ఎట్లెక్కెనో అన్నిమెట్లుకడ్డి..

పంతుళ్ళ ప్రతిష్టెల్ల జవిరె
ఏలెటోళ్ల కాళ్ళ కాడ బెట్టె..
సంఘాలజీల్చె ఘనులీల్లు
ఉద్యమాల్ కూల్చె దిట్టల్..
సోపతైరి తంత్రీ సర్కార్లకు
ఎవరి పానాల్ వాళ్లే భద్రం..
కంగాలీ వైద్య కార్పొరేట్లు
మోసకారి ప్రభుత్వేజెంట్లు..

పదురుకుంటే మన పార్ట్స్
కిడ్నీ లివర్ లన్నీ మటాష్..
సావురాక మళ్ళీ పోతిమో
ఒకటే ఉండెని బొంకుతరు..
మాకేం తెలుసని సవాల్జేసీ
అందుకేసచ్చెని రిపోటిస్తరు..
నెల నెల దుడ్లు జప్రు కుంట
మజాల్జల్సాల్ జేసేస్కుంటా!
ముప్పై దొంగలు ముఠాగల్సి
బతుకులు పక్కా దోసేస్తరు!!

**డా. ఇక్బాల్ పాషా**
**9440775732**

## ఆర్ఎస్ఎస్ పారదర్శకతపై కీలక ప్రశ్నలు

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వం అనేది కేవలం అధికారాన్ని నిర్వహించే యంత్రాంగం కాదు. అది ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపం, రాజ్యాంగ విలువలకు సంరక్షకురాలు, సామాజిక న్యాయానికి మార్గదర్శి. ఎన్నికల ద్వారా ఏర్పడిన ప్రతి ప్రభుత్వం ప్రజల తరఫున పాలించే బాధ్యతను స్వీకరిస్తుంది. ఆ బాధ్యతలో ప్రధానమైనది ప్రజల సమస్యలను పరిష్కరించడం, సంక్షేమాన్ని పెంపొందించడం, అభివృద్ధిని సమానంగా అందించడం. అయితే ఆధునిక కాలంలో అనేక దేశాల్లో పాలన కంటే ప్రచారానికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు పెరుగుతున్నాయి. ప్రభుత్వ కార్యక్రమాల అమలుకన్నా వాటి ప్రచారంపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించడం ప్రజాస్వామ్య నాణ్యతను ప్రభావితం చేస్తోంది. ఒక పథకం ప్రారంభానికి ముందు ప్రచారం, ప్రారంభం తర్వాత ప్రచారం, అమలులో ప్రచారం, చివరికి విజయోత్సవ ప్రచారం జరుగుతోంది. ప్రజలకు సమాచారం అందించడం అవసరమైనప్పటికీ, అదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా మారకూడదు. ప్రజలు చివరకు చూసేది ప్రకటనలు కాదు; తమ జీవితాల్లో వచ్చిన మార్పు.

చరిత్రను పరిశీలిస్తే ప్రజల నమ్మకాన్ని సంపాదించిన ప్రభుత్వాలు ప్రచారంతో కాదు, పనితీరుతో నిలిచాయి. స్వాతంత్ర్యం తర్వాత 1950లో భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది ప్రజల విశ్వాసమే. అప్పటి ప్రభుత్వాల వద్ద ఆధునిక ప్రచార సాధనాలు లేకపోయినా, ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యం ప్రధానంగా ఉండేది. గ్రామీణాభివృద్ధి, విద్య, ఆరోగ్యం, సాగునీరు, మౌలిక వసతులపై దృష్టి పెట్టడం వల్ల ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం పెరిగింది. ఆ కాలంలో ప్రభుత్వం చేసిన ప్రతి పని ప్రజల జీవితాల్లో ప్రత్యక్ష మార్పును తీసుకువచ్చేది. అందుకే ప్రచారం లేకున్నా ప్రజలు ప్రభుత్వాన్ని గౌరవించేవారు. ప్రస్తుతం సమాచార సాంకేతిక విప్లవం కారణంగా పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. టెలివిజన్, సోషల్ మీడియా, డిజిటల్ ప్రచార వేదికలు, అధికారిక ప్రకటనలు, భారీ ఈవెంట్లు ప్రభుత్వ కార్యకలాపాల్లో భాగమయ్యాయి. ఒక పథకం ప్రారంభానికి ముందు ప్రచారం, ప్రారంభం తర్వాత ప్రచారం, అమలులో ప్రచారం, చివరికి విజయోత్సవ ప్రచారం జరుగుతోంది. ప్రజలకు సమాచారం అందించడం అవసరమైనప్పటికీ, అదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా మారకూడదు. ప్రజలు చివరకు చూసేది ప్రకటనలు కాదు; తమ జీవితాల్లో వచ్చిన మార్పు.

ప్రపంచంలోని అనేక అధ్యయనాలు ఒక ముఖ్యమైన విషయాన్ని సూచిస్తున్నాయి. ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం ఎక్కువగా ఉండే దేశాల్లో పారదర్శకత, బాధ్యతాయుత పాలన, అవినీతి నియంత్రణ, సమర్థవంతమైన సేవలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రచారం మాత్రమే విశ్వాసాన్ని పెంచలేదని అనేక అంతర్జాతీయ పరిశోధనలు పేర్కొన్నాయి. ప్రజలు ప్రభుత్వాన్ని అంచనా వేసేది తమ అనుభవాల ఆధారంగానే తప్ప ప్రకటనల ఆధారంగా కాదు.

ఒక రైతు పంటకు సరైన ధర పొందితే అతనికి ప్రభుత్వం గొప్పగా కనిపిస్తుంది. ఒక విద్యార్థికి నాణ్యమైన విద్య అందితే అతను ప్రభుత్వాన్ని విశ్వసిస్తాడు. ఒక నిరుద్యోగికి ఉపాధి లభిస్తే ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుంది. ఒక రోగికి సమయానికి వైద్యం అందితే అతనికి ప్రచారం అవసరం ఉండదు. ప్రజల జీవితాలను మెరుగుపరచే పాలన ఏ ప్రకటనకన్నా శక్తివంతమైన ప్రచారం అవుతుంది.

భారతదేశంలో సుమారు 65% జనాభా ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తోంది. వారికి ప్రభుత్వ ప్రచారాల కంటే తాగునీరు, విద్యుత్, ఆరోగ్యం, రహదారులు, సాగునీరు, ఉపాధి వంటి అంశాలే ముఖ్యమైనవి. ప్రభుత్వం ఎన్ని ప్రకటనలు ఇచ్చిందన్నది గ్రామీణ ప్రజలకు పెద్దగా ప్రాధాన్యం కాదు. వారి గ్రామంలో మార్పు వచ్చిందా లేదా అన్నదే అసలు ప్రమాణం.

ప్రభుత్వ ఖజానాలోని ప్రతి రూపాయి ప్రజల పన్నుల ద్వారానే వస్తుంది. ఆ నిధులను ప్రధానంగా ప్రజా సంక్షేమానికి వినియోగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. అభివృద్ధి పనులకు కేటాయించాల్సిన నిధులు ప్రకటనల కోసం వెళ్తున్నాయనే భావన ఏర్పడితే ప్రజల విశ్వాసం తగ్గే అవకాశం ఉంటుంది. అందువల్ల ప్రచారం అవసరమైనంత వరకు మాత్రమే పరిమితం కావాలి.

ప్రజాస్వామ్యంలో ప్రజలే యజమానులు, ప్రభుత్వం వారి సేవకురాలు అనే భావన ఎల్లప్పుడూ బలంగా ఉండాలి. ప్రజలను ప్రభావితం చేయడం కంటే ప్రజలకు సేవ చేయడమే ప్రభుత్వ ప్రధాన కర్తవ్యంగా మారినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం బలపడుతుంది. ప్రచార సర్కార్ కంటే ప్రజల సర్కార్ అనే గుర్తింపే ఏ ప్రభుత్వానికైనా శాశ్వత గౌరవాన్ని తీసుకువస్తుంది.

ఒక ప్రభుత్వం నిజంగా ప్రజల ప్రభుత్వంగా నిలవాలంటే పారదర్శకత, జవాబుదారీతనం, సమర్థత, నిష్పాక్షికత, రాజ్యాంగ నిబద్ధత అనే 5 మూల సూత్రాలను పాటించాలి. ప్రతి శాఖ పనితీరు ప్రజలకు అందుబాటులో ఉండాలి. ప్రభుత్వ వ్యయాలపై స్పష్టమైన సమాచారం ఉండాలి. ప్రజా ధనాన్ని ప్రజా ప్రయోజనాలకే వినియోగించాలి. సంక్షేమ పథకాలు రాజకీయ అభిమానం ఆధారంగా కాకుండా అర్హత ఆధారంగా అమలుకావాలి. అప్పుడు మాత్రమే ప్రజల్లో ప్రభుత్వం పట్ల విశ్వాసం మరింత బలపడుతుంది. ప్రజలు ఎప్పటికీ ప్రచారాన్ని కాదు, నిజాయితీని గుర్తుంచుకుంటారు. ప్రకటనలను కాదు, అభివృద్ధిని గుర్తుంచుకుంటారు. ప్రసంగాలను కాదు, పనితీరును గుర్తుంచుకుంటారు. అధికారాన్ని కాదు, సేవా భావాన్ని గౌరవిస్తారు. అందువల్ల ప్రతి ప్రభుత్వం ఒక విషయాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. ప్రజల కోసం ఆలోచించాలి, ప్రజల కోసం పనిచేయాలి, ప్రజలతో కలిసి ముందుకు సాగాలి. అప్పుడే ప్రభుత్వం నిజమైన అర్థంలో ప్రజల సర్కార్‌గా అవతరిస్తుంది. అలాంటి ప్రభుత్వాన్ని ప్రజలు 100% విశ్వసిస్తారు. చరిత్ర కూడా గౌరవంతో గుర్తుంచుకుంటుంది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

## బ్రాండ్ బానిసలం అవుతున్నామా?

# అద్దె ఇంట్లో ఐఫోన్ల గోల!




నేటి ఆధునిక సమాజంలో గాలి, నీరు, ఆహారం తర్వాత మనిషిని ఎక్కువగా శాసిస్తున్నది ఏదైనా ఉందంటే అది బ్రాండ్. ఒకప్పుడు బ్రాండ్ అంటే కేవలం నాణ్యతకు, మన్నికకు ఒక భరోసా. కానీ, నేడు అది ఒక సామాజిక హోదా. ఒక వ్యక్తి వేసుకునే చొక్కా కాలర్ మీద ఉన్న లోగో, జేబులో ఉన్న స్మార్ట్‌ఫోన్ వెనుక ఉన్న చిహ్నం.అతను సమాజంలో ఏ స్థాయిలో ఉన్నాడో నిర్ణయించే కొలబద్దలుగా మారిపోయాయి. ఈ క్రమంలో మన మధ్యతరగతి కుటుంబాలు ఒక విచిత్రమైన, వర్ణించలేని మానసిక సంఘర్షణలోకి నెట్టివేయబడ్డాయి. తమ జేబుకు తగినట్లు జీవించాలా? లేక పక్కింటి వాడు చూసి అసూయపడేలా జీవించాలా? అనే ప్రశ్న ప్రతి నెలాఖరున జీతం రాగానే వారిని వేధిస్తోంది.

హైదరాబాద్ లాంటి మహానగరంలో ఒక మధ్యతరగతి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కథను తీసుకుందాం. నెలకు యాభై వేల రూపాయల జీతం. పైకి చూడటానికి గౌరవప్రదమైన సంపాదన. కానీ, అద్దెలు, ఈఎంఐలు, పిల్లల స్కూల్ ఫీజులు, పెరిగిన నిత్యావసర ధరల తర్వాత చేతిలో మిగిలేది అతి స్వల్పం. అయితే, ఆఫీసులో కొలీగ్స్ వాడే ఐఫోన్లు, స్నేహితులు వేసుకునే బ్రాండెడ్ షూస్ చూసినప్పుడు అతనిలో ఒక తెలియని అభద్రతా భావం మొదలవుతుంది.

తన కొడుకు స్కూల్‌లో అందరూ నైకీ షూస్ వేసుకుంటున్నారని మొండికేస్తాడు. భార్య మనసు యాపిల్ వాచ్ మీద ఉంటుంది. తను కూడా ఆఫీసు పార్టీకి వెళ్లినప్పుడు సాధారణ చొక్కా వేసుకుంటే తక్కువగా చూస్తారేమోనన్న భయం. ఇది ఒక్క కుటుంబం కథ కాదు, ఇది కోట్లాది మధ్యతరగతి గుండె చప్పుడు. అవసరం లేకపోయినా, శక్తి లేకపోయినా బ్రాండ్ కోసం పరితపించడం నేడు ఒక సామాజిక వ్యాధిగా మారుతోంది.

వినియోగదారుల పరిశోధన సంస్థలు వెల్లడిస్తున్న గణాంకాలు దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి. భారతీయ మధ్యతరగతి కుటుంబాలు తమ నెలవారీ ఆదాయంలో దాదాపు 18% నుండి 25% వరకు కేవలం బ్రాండెడ్ దుస్తులు, గ్యాడ్జెట్లు మరియు విలాసవంతమైన ఖర్చులకే వెచ్చిస్తున్నాయి. కానీ, వారి భవిష్యత్తు కోసం చేసే పొదుపు మాత్రం 8% కంటే తక్కువగా ఉంటోంది. అంటే, మనం రేపటి భద్రతను తాకట్టు పెట్టి, ఇవాల్టి ప్రదర్శన కోసం ఆరాటపడుతున్నాం అన్నమాట. ఈ బ్రాండ్ పిచ్చి హఠాత్తుగా పుట్టుకురాలేదు. దీని వెనుక కార్పొరేట్ కంపెనీల భారీ వ్యూహం ఉంది. టీవీ ప్రకటనలు ఒక ఎత్తు అయితే, నేటి ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లూయెన్సర్లు, యూట్యూబ్ వ్లాగర్లు చేసే హడావుడి మరో ఎత్తు. వారు చూపే అన్‌బాక్సింగ్ వీడియోలు, స్టార్‌బక్స్ కాఫీ కప్పులతో దిగే ఫోటోలు చూసి మధ్యతరగతి యువత అదే అసలైన జీవితం అని భ్రమిస్తోంది. ఒకప్పుడు కేవలం అవసరం కోసం వస్తువు కొనేవారు. ఇప్పుడు 'ఫోమో' (FOMO - Fear Of Missing Out) వల్ల కొంటున్నారు. అంటే, ఎదుటివాడి దగ్గర ఉన్నది నా దగ్గర లేకపోతే నేను వెనుకబడిపోతానేమో అన్న ఆందోళన. అందుకే జేబులో చిల్లి గవ్వ లేకపోయినా, క్రెడిట్ కార్డులను అరిగేలా వాడి మరీ బ్రాండెడ్ లోగోల కోసం వేల రూపాయలు ధారపోస్తున్నారు.

అన్నిటికంటే బాధాకరమైన విషయం ఏమిటంటే, ఈ విష సంస్కృతి పిల్లల మనసుల్లోకి పాకడం. స్కూళ్లలో పిల్లల మధ్య ఆరోగ్యకరమైన పోటీ కంటే, బ్రాండ్ల పోటీ పెరిగిపోతోంది. మంచి మార్కులు రావడం కంటే, లేటెస్ట్ గ్యాడ్జెట్ ఉండటం గొప్పగా భావిస్తున్నారు. బ్రాండెడ్ వస్తువులు లేని పిల్లలు తాము ఏదో వెనుకబడిపోయామని, తమ తల్లిదండ్రులు తక్కువ స్థాయి వారని న్యూనతా భావానికి గురవుతున్నారు. ఈ మనస్తాపం చూడలేక తల్లిదండ్రులు తమ ఇన్సూరెన్స్ ప్రీమియంలను పక్కన పెట్టి, హెల్త్ పాలసీలను రద్దు చేసుకుని మరీ పిల్లలకు ఖరీదైన బహుమతులు కొనిస్తున్నారు. మనం పిల్లలకు విలువలను నేర్పించాల్సింది పోయి, వస్తువుల ధరలను నేర్పిస్తున్నాం.నలభై వేలు సంపాదించి లక్ష రూపాయల జీవితాన్ని అనుభవించాలని కోరుకోవడమే మధ్యతరగతి యొక్క అతిపెద్ద విషాదం.బ్రాండ్ అంటే పూర్తిగా చెడ్డది అని కాదు. ఒక వస్తువు నాణ్యతగా ఉండి, ఎక్కువ కాలం మన్నిక ఇస్తుందంటే అది ఖచ్చితంగా పెట్టుబడే. కానీ, ఇక్కడ సమస్య ఏమిటంటే చాలామంది నాణ్యత కోసం కాకుండా, కేవలం ఆ లోగో కోసం డబ్బు చెల్లిస్తున్నారు. ఒక సాధారణ టీ షర్ట్ ఇచ్చే సౌకర్యం కంటే, దాని మీద ఉండే గుచ్చీ లేదా అర్మానీ అనే అక్షరాలు ఇచ్చే అహంకారం కోసమే ఆరాటం. ఆ లోగో మీకు శారీరకంగా ఏ సౌకర్యాన్ని ఇవ్వదు, కానీ ఇతరుల ముందు మిమ్మల్ని కొద్దిసేపు గొప్పగా చూపిస్తుంది. ఆ కొద్దిసేపు కోసం జీవితకాలపు పొదుపును త్యాగం చేయడం ఎంతవరకు సమంజసం?

మనస్తత్వవేత్తలు దీనిని సామాజిక పోలిక సిద్ధాంతం అని పిలుస్తారు. మనం ఎప్పుడూ మనల్ని మన చుట్టూ ఉన్నవారితో పోల్చుకుంటాం. సోషల్ మీడియా వల్ల ఈ పోలిక ఇప్పుడు కేవలం పక్కింటి వారితోనే కాదు, ప్రపంచంలో ఎక్కడో ఉన్న ధనవంతులతో కూడా మొదలైంది. ఈ నిరంతర పోలిక మనలో అసంతృప్తిని పెంచుతోంది. మార్కెటింగ్ కంపెనీలు ఈ బలహీనతను వాడుకుని, మీరు ఈ వాచ్ కొంటే విజేతలు అవుతారు,ఈ కారులో ప్రయాణిస్తేనే మీరు ఉన్నత వర్గం అనే భ్రమలను కల్పిస్తున్నాయి. గుర్తింపును వస్తువుల ద్వారా కొనుక్కోలేము అనే నిజాన్ని మనం మర్చిపోతున్నాం.ఈ బ్రాండ్ మోజు వెనుక మరో చీకటి కోణం ఉంది. అది క్రెడిట్ కార్డుల వినియోగం. చాలా కుటుంబాలు తమ వద్ద డబ్బు లేకపోయినా, ఈఎంఐల రూపంలో బ్రాండెడ్ వస్తువులను కొంటున్నారు. నెలాఖరుకు వచ్చేసరికి వడ్డీలు కట్టలేక సతమతమవుతున్నారు. పెళ్లిళ్లు, శుభకార్యాల్లో బ్రాండెడ్ బట్టలు కట్టుకుని రాకపోతే అది ఒక అవమానంగా భావిస్తున్నారు. బయటకు నిగనిగలాడే బట్టలు, చేతికి ఖరీదైన గడియారాలు ఉన్నా.. ఇంట్లో మాత్రం అనారోగ్యం వస్తే ఆసుపత్రి ఖర్చుల కోసం ఇతరుల ముందు చేయి చాచాల్సిన దుస్థితి నేడు అనేక కుటుంబాల్లో కనిపిస్తోంది.మనం ఈ బ్రాండ్ మాయలో నుండి బయటపడాలంటే కొన్ని ప్రాథమిక మార్పులు అవసరం.నేను ఈ వస్తువును ఎవరి కోసం కొంటున్నాను? అని ప్రశ్నించుకోవాలి. నా అవసరం కోసమా? లేక పదిమందికి చూపించుకోవడం కోసమా? వస్తువు పేరు చూసి కాదు, దాని ఉపయోగాన్ని బట్టి కొనడం అలవాటు చేసుకోవాలి. వేయి రూపాయల వస్తువు ఐదేళ్లు వస్తే, ఐదు వేల రూపాయల బ్రాండ్ వస్తువు కంటే అదే మేలు.పిల్లలకు చిన్నప్పటి నుండే డబ్బు విలువను, పొదుపు ప్రాముఖ్యతను నేర్పాలి. ప్రేమను ఖరీదైన వస్తువులతో కాదు, నాణ్యమైన సమయంతో కొలవాలని వారికి తెలియజెప్పాలి. ఇతరుల లైఫ్ స్టైల్ చూసి కుంగిపోకుండా, మన వాస్తవికతను మనం ప్రేమించడం నేర్చుకోవాలి.

చివరగా ఒక్క మాట బ్రాండ్ అనేది కేవలం ఒక పరికరం మాత్రమే. అది మనిషిని లేదా అతని వ్యక్తిత్వాన్ని నిర్వచించదు. ఒక మనిషి గొప్పతనం అతను సమాజానికి చేసే మేలులో, అతని ప్రవర్తనలో, అతను పెంచుకున్న బంధాలలో ఉంటుంది కానీ.. అతను ధరించే బూట్లలోనో, వాడే ఫోన్ లోనో ఉండదు. మధ్యతరగతి ప్రజలు ఈ సత్యాన్ని ఎంత త్వరగా గ్రహిస్తే అంత మేలు. లోగోల కోసం కాకుండా, లోతైన విలువల కోసం జీవిద్దాం. అప్పుడే మన జీవితం ఒక అందమైన బ్రాండ్‌గా మారుతుంది.

**డా .సూర్యదేవర రామకృష్ణ,**
**9490754169**

## వసతి గృహాల్లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలి

● జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ



**తాండూరు, జూన్ 18 (జనంసాక్షి) :** వసతి గృహాల్లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులను ఆదేశించారు. గురువారం తాండూర్ మున్సిపల్ పరిధిలో జిల్లా కలెక్టర్ పర్యటించి వివిధ అభివృద్ధి పనులతో పాటు వసతి గృహాలను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ నిర్వహణ సక్రమంగా నిర్వహించాలన్నారు. మిషన్ భగీరథ మంచినీటి ట్యాంకు పనులను నాణ్యతతో చేపట్టాలని ఆయన తెలిపారు. శాంతినగర్ పార్కులో వివిధ పరికరాలను సమకూర్చి అభివృద్ధి పర్చాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. 2 బి.హెచ్.కె ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తి మౌలిక సదుపాయాలతో సిద్ధం చేయాలని ఆయన తెలిపారు. గిరిజన, మైనారిటీ బాలికల సంక్షేమ వసతి గృహాలలో వంట గది, నిత్యావసర సరుకుల నిల్వ గదిని పరిశీలించి గడువు తేదీ పూర్తయిన సరుకులను వాడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఆకస్మిక తనిఖీల్లో మున్సిపల్ కమిషనర్ రాకేష్ రెడ్డి, హౌసింగ్ డిఈ మహమ్మద్ ఖలీముద్దీన్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఆడపిల్ల భారం కాదు, కుటుంబానికి వెలుగునిచ్చే దీపం

● ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, జూన్ 18 (జనంసాక్షి) :** తాండూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో తాండూరు మండలం మరియు పట్టణానికి చెందిన 164 మంది లబ్ధిదారులకు రూ.1,64,19,024/- విలువ గల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పంపిణీ చేశారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తోందని, లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజా ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి కట్టుబడి మహిళా సాధికారతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆ దిశగా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. సంక్షేమ పథకాల అమలులో పార్టీలకు అతీతంగా వ్యవహరిస్తున్నామని, అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జూన్ 25 నుంచి సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియ ప్రారంభం కానుందని, అర్హులైన ఓటర్లందరూ పాల్గొని సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి, ఏఎంసి చైర్మన్ పట్లోళ్ళ నర్సింలు, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, మున్సిపల్ కౌన్సిలర్ లు, వివిధ గ్రామాల సర్పంచ్ లు, ఎంపీడీవో, రెవిన్యూ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలి

● ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి



**కేశంపేట, జూన్ 18 (జనం సాక్షి) :** శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు అధికారులు నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తంగా ఉండాలని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి అన్నారు. గురువారం కేశంపేట పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ లో రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిని తెలుసుకున్నారు. శాంతి భద్రతల నిర్వహణ, నేరాల నియంత్రణ, ప్రజలకు పోలీసులు అందిస్తున్న సేవలను, స్టేషన్ సిబ్బంది పనితీరును ఆరా తీసారు. స్టేషన్ కు వచ్చే ప్రజల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని అన్నారు. పెండింగ్ లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. మహిళలు, చిన్నపిల్లల భద్రత పై ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మండల ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలు అందించాలని సీఐ నరహరిని ఆదేశించారు. తనిఖీల్లో షాద్ నగర్ డీసీపీ శిరీష, ఏసీపీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## పేద ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

● వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి



**బొంరాస్‌పేట, జూన్ 18 (జనం సాక్షి) :** పేద ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వము అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి కృషి చేస్తుందని వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని నాందార్ పూర్, మేడిచెట్టు తండా గ్రామపంచాయతీలలో నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై స్థానిక సర్పంచులు లక్ష్మి, రవి నాయక్ తో కలిసి ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు సొంతింటి కల నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ముఖాలలో చిరునవ్వులు కనిపిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ జయ కృష్ణ, ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నర్సింలు గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు అంజిల్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేష్, పంచాయతీ కార్యదర్శి శోభారాణి, ఉప సర్పంచ్ అమర్నాథ్, సంతోష్ నాయక్, రాజు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# టీడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల ధర్నా, నిరసన

**నిజాంపేట్, జూన్ 18 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వ వివక్ష, నిర్లక్ష్య వైఖరికి నిరసనగా, తమ డిమాండ్ల సాధనకై గురువారం జర్నలిస్టులు "ఛలో హైదరాబాద్"కార్యక్రమం టిడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో నిరసన, ధర్నా కార్యక్రమం నిర్వహించారు. గన్ పార్క్ నుంచి సచివాలయం ముట్టడికి బయలుదేరిన జర్నలిస్టులను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ఇచ్చిన "ఛలో హైదరాబాద్" పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల నుంచి తరలివచ్చిన జర్నలిస్టుల గన్ పార్క్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ వ్యవస్థాపక, రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య గన్ పార్క్‌లోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద పూలు పెట్టి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ అమరవీరుల స్థూపానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో పన్నెండేళ్ళుగా జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా పాలకులు వివక్ష చూపుతున్నారని విమర్శించారు. తెలంగాణ కోసం తెలంగాణ జర్నలిస్టులు అన్న నినాదంతో తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన జర్నలిస్టులను పాలకులు చిన్నచూపు చూడడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినప్పటికీ, జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం మొండి చేయి చూపుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. తెలంగాణలో అనేక చిన్న, మధ్య తరహా పత్రికలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని, రెండున్నర సంవత్సరాలుగా ప్రభుత్వం అడ్వర్టైజ్మెంట్స్ బిల్స్ ఇవడంలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్స్ వెంటనే ఇవ్వాలని, ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు అక్రెడిటేషన్ కార్డుతో పాటు హెల్త్ కార్డు ఇవ్వాలని, గ్రేటర్ హైదరాబాద్ తో సహా రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్లస్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్ఎన్ఐ, పీఆర్జీఐ రిజిస్ట్రేషన్‌తో రెగ్యులారిటీ ఉన్న పత్రికలను ఎంపానెల్మెంట్ చేయాలని, జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు, కళాశాలల్లో ఉచిత విద్యను అందించాలని, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి జర్నలిస్టుకు ఉచిత బీమా పథకం ఏర్పాటు చేయాలని, 60 సంవత్సరాలు దాటిన జర్నలిస్టులకు పెన్షన్లు ఇవ్వాలని, జర్నలిస్టుల సంక్షేమానికి బడ్జెట్ లో రూ.100 కోట్లు కేటాయించాలని, జర్నలిస్టుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన అనేక మంది జర్నలిస్టులు పాల్గొని ప్లే కార్డులతో నినాదించారు. అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించగా పోలీసులు వారిని అడ్డుకొని అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిని పంజాగుట్ట పోలీస్ స్టేషన్, ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్ లకు తరలించారు. జర్నలిస్టుల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం నెరవేర్చకపోతే రాబోయే కాలంలో గత ప్రభుత్వాని పట్టిన గతే ఈ ప్రజా ప్రభుత్వానికీ పడుతుందని మామిడి సోమయ్య హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కో-కన్వీనర్లు బండి విజయ్ కుమార్, యాదగిరి, తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ చిత్రా శ్రీనివాస్, దామెర జగదీశ్వర్ గుప్తా, కే. పాండురంగారావు, పద్మనాభరావు, సామ్రాట్ గుప్తా, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవి కుమార్, కో-కన్వీనర్లు ఆర్. శ్రీనివాస్ గౌడ్, సంతోష్ కుమార్, ఎం.రవికుమార్, సుభాష్, రేగటి వెంకన్న, ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నానబాల రామకృష్ణ, అర్వపల్లి నగేష్, మహబూబ్ నగర్ జిల్లా కార్యాధ్యక్షుడు గండీటి నర్సింహా, కార్యదర్శి గోపాల్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మధు, సూర్యాపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్వాయి జానయ్య, ముషం హరిప్రసాద్, వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జక్కుల విజయ్ కుమార్, స్వామిదాస్, పాలడుగు సురేందర్, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు దూమర్ల బాస్కర్, రంగారెడ్డి జిల్లా నాయకులు అశోక్ కుమార్ గౌడ్, పర్వతాలు, మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, గడ్డమీది అశోక్, జిల్లా నాయకులు సత్యనారాయణ, చిన్నబాబు, శ్రీనివాస్ రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గోవిందరావ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శివకుమార్, శివకుమార్ గౌడ్, డప్పు రామస్వామి, వాసాల బాలరాజు, శ్రీశైలం, నామమోహన్, దుర్గారావు, వి.రమేష్, ప్రవీణ్, కొండల్ రెడ్డి, శ్యామ్ ముదిరాజ్, సామల వెంకటేష్, ఎండి ఫర్వేజ్, మంజులరెడ్డి, సుస్మిత, స్వప్న, సౌభాగ్యవతి తదితరులు పాల్గొన్నారు.



# పార్కులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతాం

● జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, జూన్ 18 (జనం సాక్షి) :** వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని పార్కులను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతూ ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి గురువారం పట్టణంలోని వెంగల్‌రావు కాలనీలో గల మున్సిపల్ పార్కును సందర్శించి అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. ముఖ్యంగా చిన్నారులు ఆడుకునే ప్రాంతాన్ని తనిఖీ చేసి పార్కు అభివృద్ధికి సంబంధించిన అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

### మహిళా వ్యవసాయ డిగ్రీ కళాశాల సందర్శన

అనంతరం కలెక్టర్ భగీరథ కాలనీలోని మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల బాలికల వ్యవసాయ డిగ్రీ కళాశాలను సందర్శించారు. కళాశాల ప్రాంగణం, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి విద్యార్థినులతో నేరుగా మాట్లాడారు. కళాశాల మరియు హాస్టల్‌లో అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పాత క్యాంపస్‌తో పోలిస్తే కొత్త కళాశాల భవనంలో మెరుగైన వసతులు అందుతున్నాయా అని విద్యార్థినులను ప్రశ్నించగా, వారు సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలతో చదువుకొని జీవితంలో మంచి స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. విద్యతోనే భవిష్యత్తు నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొంటూ క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, 27వ వార్డు కౌన్సిలర్ జంగిడి సరిత రవి యాదవ్, 28వ వార్డు కౌన్సిలర్ కోట్ల శిరీష రవి, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు భరోసా

● ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల, జూన్ 18 (జనంసాక్షి) :** పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు ఒక భరోసా, పేద కుటుంబాల గృహ భద్రతే ప్రభుత్వ ప్రాధాన్యత అని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 8వ వార్డు పామెన గ్రామంలో బి.మాణెమ్మ, ఎం.రాజేందర్ లు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు గృహ సౌకర్యం కల్పిస్తూ జీవన ప్రమాణాల పెంపునకు కృషి చేస్తోందన్నారు. అనంతరం నూతన గృహ యజమానులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ రాముగౌడ్, కౌన్సిలర్లు బండారి శైలజాఆగి రెడ్డి, దావల్గారి గోపాల్ రెడ్డి, చేవెళ్ల ముడిమ్యాల్ సొసైటీ చైర్మన్లు దేవర వెంకట్ రెడ్డి, గోనె ప్రతాప్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ బేగరి రాములు, గుడి మల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండు, మాజీ సర్పంచులు జనార్ధన్ రెడ్డి, పడాల ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ రవీందర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గౌండ్ల యాదయ్య, నాయకులు నడిమొల్ల శంకర్, మద్దెల చింటూ, జి. రవీందర్, బేగరి విజయ్ కుమార్, కరుణాకర్ రెడ్డి, ఎర్ర గోపాల్, అబ్దుల్ గనీ, బూర్ల మహేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మసి విద్యార్థులు కొత్త ఔషధ ఆవిష్కరణలకు కృషి చేయాలి



**మొయినాబాద్, జూన్ 18 (జనం సాక్షి) :** ఫార్మసీ చదువుతున్న విద్యార్థులు ఫార్మా రంగంలో నూతన టెక్నాలజీతో కొత్త ఔషధ మందులను కనుగొనేందుకు ప్రయోగాలను నిర్వహించాలని భారత క్లినికల్ రీసెర్చ్ సంఘం ప్రతినిధి డాక్టర్ తుపాకుల సురేష్ పేర్కొన్నారు గురువారము మండల పరిధిలోని అండాపూర్ చౌరస్తాలో గల భాస్కర ఫార్మసీ కళాశాలలో అంతర్జాతీయ క్లినికల్ డే ను ఆ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమం కళాశాల కార్యదర్శి జెవి కృష్ణారావు అధ్యక్షతన ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ తుపాకుల సురేష్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు ఆయన మాట్లాడుతూ దేశ విదేశాలలో నేడు మందులు అనేటివి నిత్యవసర ంగా వాడుతున్నారని తెలిపారు వాటిని కనుకునేందుకు నూతన వరవడితో కొత్త ఔషధాలను కనిపెట్టే విధంగా విద్యార్థులు ఎదగాలని సూచించారు ఈ కార్యక్రమంలో ముందుగా జ్యోతి ప్రజ్వలన చేయగా ముఖ్య అతిథిని ఘనంగా ఫార్మసి కళాశాల ద్వారా సన్మానించారు ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ రవి ప్రొఫెసర్ గీత కళాశాల డైరెక్టర్ డాక్టర్ సంజయ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు కిషోర్ బాబు ఉదయ్ చంద్రిక సుష్మిత మౌనిక విద్యార్థులు పాల్గొన్నారు.

## వ్యాపార సంస్థల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు భద్రతకు అత్యంత కీలకం

● జిల్లా ఎస్పీ డి.జానకి



**మహబూబ్ నగర్ రూరల్, జూన్ 18 (జనం సాక్షి) :** మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓం కన్వెన్షన్ హాల్‌లో గురువారం మహబూబ్‌నగర్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గాంధీ నాయక్ ఆధ్వర్యంలో పట్టణంలోని వ్యాపారవేత్తలకు సీసీటీవీ కెమెరాలపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ డి.జానకి, మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి వ్యాపార సంస్థ, షాపింగ్ కాంప్లెక్స్, గోదాం మరియు వాణిజ్య సముదాయాలలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి అవసరంగా మారిందని తెలిపారు. సీసీటీవీ కెమెరాలు నేరాల నివారణలో, నేరస్తులను గుర్తించడంలో, అనుమానాస్పద కదలికలను పర్యవేక్షించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఎస్పీ వివరించారు. వ్యాపార సంస్థల్లో నాణ్యమైన కెమెరాలు, సరైన స్టోరేజ్ సామర్థ్యంతో ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే వ్యాపారవేత్తలు తమ సీసీటీవీ వ్యవస్థలను మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్‌తో అనుసంధానం చేయవచ్చని తెలిపారు. దీనివల్ల అత్యవసర పరిస్థితుల్లో పోలీసులు వేగంగా స్పందించే అవకాశం ఉంటుందని చెప్పారు. అదేవిధంగా హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌తో కూడా అనుసంధానం ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. వ్యాపారవేత్తలు తమ సంస్థల భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు. నగదు లావాదేవీలు జరిగే ప్రదేశాలు, ప్రవేశ ద్వారాలు, పార్కింగ్ ప్రాంతాలు వంటి ముఖ్య ప్రదేశాల్లో తప్పనిసరిగా కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా వ్యాపారవేత్తలు సీసీటీవీ అనుసంధానం, సాంకేతిక సదుపాయాలపై తమ అభిప్రాయాలు, సూచనలు జిల్లా ఎస్పీ తెలియజేశారు. పోలీస్ శాఖ చేపడుతున్న ఈ భద్రతా చర్యలకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గాంధీ నాయక్, మహబూబ్‌నగర్ రూరల్ సబ్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ మరియు పెద్ద ఎత్తున వ్యాపారవేత్తలు, సంస్థల యజమానులు పాల్గొన్నారు.

# క్యాన్సర్, కిడ్నీ, గుండె వ్యాధుల నిర్ధారణకు ఏఐ వినియోగం

● నిమ్స్-ఐఐఎస్‌సీ సంయుక్త పరిశోధన ప్రారంభం

**ఖైరతాబాద్, జూన్ 18 (జనం సాక్షి) :** కృత్రిమ మేధస్సు(ఏఐ) ఆధారిత వైద్య నిర్ధారణ, చికిత్సా విధానాల అభివృద్ధి లక్ష్యంగా హైదరాబాద్‌లోని నిజాంస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సస్ (నిమ్స్) బెంగళూరులోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్‌సీ) సంయుక్తంగా పరిశోధన కార్యక్రమాన్ని ప్రారంభించాయి. ఈ మేరకు ఐఐఎస్ సీ శాస్త్రవేత్తల బృందం గురువారం నిమ్స్‌ను సందర్శించి, వైద్య నిపుణులు, అధ్యాపకులతో సమావేశమై పరిశోధన కార్యాచరణపై చర్చించింది. ఈ సమావేశానికి నిమ్స్ డీన్ డా.పి.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్, నోటి క్యాన్సర్, మూత్రపిండాల వ్యాధులు, గుండె జబ్బులు, ఊబకాయం వంటి వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించడంలో వేగవంతమైన, ఖచ్చితమైన నిర్ధారణ అందించడం లో కృత్రిమ మేధస్సు ఆధారిత సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. 'నిమ్స్-ఐఐఎస్‌సీ' సంయుక్త పరిశోధన ద్వారా భారతీయ రోగుల అవసరాలకు అనుగుణంగా వినూత్న ఏఐ నమూనాలను అభివృద్ధి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులో రొమ్ము క్యాన్సర్, నోటి క్యాన్సర్, మూత్రపిండాల వ్యాధులు, గుండె జబ్బులు, ఊబకాయం సంబంధిత వ్యాధుల నిర్ధారణ, ప్రమాద అంచనా, వ్యాధి పురోగతి విశ్లేషణ, వ్యక్తిగతీకరించిన చికిత్సా విధానాల కోసం అత్యాధునిక ఏఐ మోడళ్లను రూపొందించనున్నారు. ఈ మోడళ్లు వైద్యులకు క్లినికల్ నిర్ణయాలు తీసుకోవడంలో సహకరించడమే కాకుండా, సాధారణ ప్రజలకు మెరుగైన, అందుబాటు వైద్య సేవలు అందించడంలో దోహద పడనున్నాయి. ప్రాజెక్టు తొలి దశను ఆరు నెలల్లో పూర్తి చేయాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. ఈ కాలంలో క్లినికల్ డేటా విశ్లేషణ, ఏఐ అల్గోరిథమ్‌ల రూపకల్పన, ప్రాథమిక నమూనాల అభివృద్ధి చేపట్టనున్నారు. ఐఐఎస్‌సీ తరఫున డా.శ్రీరామ్, డా.హేమ, డా.అనఘ హాజరై సంయుక్త పరిశోధన కార్యాచరణపై చర్చించారు. భారతీయ పరిస్థితులకు అనుగుణంగా తక్కువ వ్యయంతో, అధిక ఖచ్చితత్వం కలిగిన ఏఐ ఆధారిత నిర్ధారణ, చికిత్సా విధానాలను అభివృద్ధి చేయడం ఈ సంయుక్త పరిశోధన ప్రధాన లక్ష్యంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ సమావేశంలో నిమ్స్ డాక్టర్లు డా.లిజా, డా.శ్రీభూషణ్ రాజు, డా.అనూ కపూర్, డా.సుబ్బలక్ష్మి, డా.సుజాతా పట్నాయక్, డా.రామకృష్ణ, డా.ఆన్నీ, డా.రవితేజ, డా.పాయల్ పాల్గొన్నారు.




# బాల్య వివాహా రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలి

● కలెక్టర్ సీహెచ్. ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 18 (జనం సాక్షి) :** నారాయణ పేటను బాల్య వివాహా రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ నేటి నుంచి సంకల్పం తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక అన్నారు.జిల్లా అంటే అందమైన రోడ్లు, సుందరమైన భవనాలే కాదని,జిల్లాలో అక్షరాస్య త, బాలల హక్కులు, మహి ళా చట్టాలు, సంపూర్ణంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని ఆమె తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్.ఆర్ గార్డెన్స్ లో జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాల్య వివాహా నిషేధ చట్టం 2006 లైంగిక నేరాల నుంచి బాలల రక్షణ చట్టం 2012 పై నారాయణ పేట ఐ సీ డీ ఎస్ ప్రాజెక్టు పరిధిలోని బాలల సంరక్షణ కమిటీ సభ్యులకు, ప్రజా ప్రతినిధులకు, సంబంధిత శాఖల అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథు లుగా జిల్లా కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ డాక్టర్ వినీత్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్య క్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ నా భవిష్యత్తు నా సంకల్పం అనే నినాదంతో ప్రారంభమైన ఈ కార్యక్రమం సాదారణమైనది కాదని, ఇక నుంచి గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలోనూ ఈ కార్యక్రమాలు కొనసాగు తాయని చెప్పారు.ఈ కార్య క్రమం ద్వారా మనం వేసే ప్రతీ అడుగు ఆడపిల్లందరూ చదువుకోవాలని, పెళ్ళీడు వచ్చాకే వివాహం చేసుకు నేలా క్షేత్ర స్థాయిలో అవ గాహన కల్పించడమే అని ఆమె స్పష్టం చేశారు. బాల్య వివాహాలు ఎక్కువ జరిగే జిల్లాగా మన జిల్లాకు పేరుం దని,మనం సంకల్పించు కుంటే ఆ పేరును చెరిపే యవచ్చని అన్నారు. ఒక ప్పుడు వితంతుల పెళ్లిళ్లు ఆశ్చర్యం కలిగించేలా ఉండే వని, కానీ ఇప్పుడు సాధార ణం అయ్యాయని తెలిపారు. కార్యక్రమానికి వచ్చిన వాళ్లం దరూ బాల్య వివాహాలను నిరోధించే అధికారం ఉన్న వాళ్లే నని, న్యాయ, చట్ట పరంగా ప్రోహిబిషన్ అధికా రులు అని అన్నారు. బాల్య వివాహాలను జరగక ముందే ఆపాలని, సమాచారం ఇవ్వాలన్నారు. ఒకవేళ బాల్య వివాహం జరిగిన విషయం చెప్పక పోయినా, బాల్య వివాహాన్ని ప్రోత్స హించినా రెండేళ్ల జైలు శిక్ష ఉంటుందని కలెక్టర్ తెలి పారు. జిల్లాలో నేటికి ఇంకా చాలా గ్రామాల్లో ప్రజలకు బాల్య వివాహాల నిరోధక చట్టం గురించి తెలియదని, ఇకపై అన్ని గ్రామాల్లో చట్టం పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రచారం చేయా లని సంబంధిత అధికారు లను ఆమె ఆదేశించారు.ఇది మొదటి కార్యక్రమం అని, జిల్లా అంతటా ఇలాం టి అవగాహన కార్యక్రమాల ను నిర్వహిస్తారన్నారు. ఇక పై ఎక్కడైనా బాల్య వివాహం జరిగినట్లు రుజువైతే సంబం ధిత క్షేత్ర స్థాయి అధికారి నుంచి జిల్లా స్థాయి అధికారి వరకు సంజాయిషీ ఇవ్వాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ చెప్పారు. గ్రామాల్లో సర్పం చులు కూడా బాల్య వివా హాలను అరికట్టాలనీ ఆమె సూచించారు.జిల్లాలో ఈ సంవత్సరం ఏ గ్రామంలో అయితే ఒక్క బాల్య వివా హం జరగకుండా అడ్డుకు న్న, అరికట్టిన సర్పంచులకు రాష్ట్రస్థాయిలో ఉత్తమ సర్పంచి గా అవార్డు ఇప్పిస్తా నని కలెక్టర్ సమావేశంలో ప్రకటించారు. బాల్య వివా హాల నిర్మూలనకు జిల్లా విద్యా శాఖ, జిల్లా గ్రామీ ణాభివృద్ధి సంస్థ అధికారులు సమన్వయంతో పని చేసి జిల్లాలో డ్రాఫ్ అవుట్ పిల్లలు లేకుండా చూడాలని,అవస రమైతే ఉల్లాస్ కార్యక్రమం ద్వారా అయినా చదివించా లని,ఈ సంవత్సరం జిల్లాలో బాల్య వివాహాల సంఖ్య జీరో గా డిక్లేర్ చేసి రాష్ట్ర స్థాయిలో మన జిల్లా బాల్య వివాహా రహిత జిల్లాగా రికార్డు పొందాలని కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ బాల్య వివాహం నేరమని, 2006 లోనే చట్టం వచ్చింద ని,చట్టం అమలులోకి వచ్చి ఇరవై ఏళ్ళు అవుతున్నా నెలకో కేసు నమోదు కావడం దురదృష్టకరం అన్నారు. సంప్రదాయ మార్పు రాకపోతే చట్టాలున్నా వృథా అని అభిప్రాయ పడ్డారు.ముఖ్యం గా సరిహద్దు ప్రాంతాల్లో బాల్య వివాహాలు చేస్తున్నా రని, ఆడపిల్ల ను వేరే ఇంటికి తొందరగా పంపించాలనే ఆలోచన ధోరణి తల్లిదండ్రు లలో మారాలని ఎస్పీ తెలి పారు. డ్రాఫ్ అవుట్ అయిన ఆడపిల్లలకు బాల్య వివాహాలు చేస్తున్నారని, అందుకే డ్రాఫ్ అవుట్ పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని ఆయన సూచించారు.నిరుపేదలైన తల్లిదండ్రులకు ఉపాధి కల్పించాలన్నారు. జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ మిష న్ మోడ్ లో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో భాగంగా బాలల సంరక్షణ సలహాదారు డేవిడ్ రాజ్ ,బాల్య వివాహా నిరోధక చట్టం, పోక్సో చట్టం గురించి అధికారులు, ప్రజాప్రతినిధు లకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా క్లుప్తంగా వివరించారు.ఈ కార్యక్ర మంలో జెడ్పీ సీ ఈ వో శ్రీనివాస్ రావు, డిఆర్డిఓ వెంకట్ రాములు, ఆర్డిఓ రమేష్, డీ డబ్ల్యు ఓ రాజేంద ర్ గౌడ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్, సీడబ్లుసీ చైర్మన్ అశోక్ కుమార్, డీసీపీవో కరిష్మా, సీ డబ్ల్యు సీ కమిటీ సభ్యులు,తహా సిల్దారులు, ఎంపీడీవోలు, సిడిపిఓలు, సూపర్ వైజర్లు, ఎంపీ ఓలు, ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని సర్పం చులు, పంచాయతీ కార్యదర్శులు, వీసీపీసీలు, డీసీపీవో బృందం, అంగన్ వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



**రామచంద్రాపురం, జూన్ 18 (జనం సాక్షి) :** నూతన దేవాలయాల నిర్మాణంతో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుందని, భక్తి భావం మనుషులకు మానసిక ప్రశాంతతను అందిస్తుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని జ్యోతిరావు పూలే కాలనీలో వెలసిన శ్రీ విజయదుర్గా పెద్దమ్మ తల్లి ఆలయంలో శ్రీ శివ పంచాయతన సహిత నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ మహోత్సవం జూన్ 16 నుంచి 18 వరకు మూడు రోజుల పాటు వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సాగింది. ముగింపు వేడుకల్లో భాగంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు, పూర్ణాహుతి కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన నీలం మధు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇలాంటి దైవ కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజలకు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని ఆకాంక్షించారు. ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని విజయవంతం చేసిన ఫౌండర్స్ కొల్లూరి అమృత--సత్యయ్య దంపతులు, కొల్లూరి భరత్, ఆలయ కమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర ప్రజలందరిపై భగవంతుని కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో చిన్న శ్రీశైలం యాదవ్, మాజీ కార్పొరేటర్ పుష్పనాగేష్ యాదవ్, పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, డాకూర్ రామ్మోహన్ రెడ్డి, లింగం, మధుసూదన్, రవిచారి, పాండు, బాబు గౌడ్, ఐలేష్ యాదవ్, ధరణి రాజు, రాజేష్, లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఎస్ఐఆర్ నిర్వహించాలి

● పర్యావరణానికి సహకరించాలి..
● ఆర్డీవో రమాదేవి..



**నిజాంపేట, జూన్ 19 (జనం సాక్షి) :** ఎస్ఐఆర్ ను పకడ్బందీగా నిర్వహించాలని, మెదక్ ఆర్డిఓ రమాదేవి సూచించారు. నిజాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎస్ఐఆర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా బూత్ సాయి అధికారులకు తగు సూచనలు చేశారు. అలాగే పాఠశాల విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. పాఠశాలలో మొక్కను నాటి ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చెయ్యాలన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తాసిల్దార్ రమ్యశ్రీ సంబంధిత అధికారులు ఉన్నారు.

# గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ




**గద్వాల నడిగడ్డ, జూన్ 18 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా టౌన్ పోలీస్ స్టేషన్ ను గురువారము శ్రీనివాసరావు ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్ ను సందర్శించి పరిసరాలను, ఆవరణలో వాహనాల పార్కింగ్ ప్రదేశాలు. రిసెప్షన్, స్టేషన్ రైటర్, టెక్ టీమ్‌ను పరిశీలించారు. స్టేషన్‌లోని రిసెప్షన్, రికార్డులు, టెక్ టీమ్, బీట్ బుక్స్, జనరల్ డైరీ, సీసీటీఎన్ఎస్ పనితీరును పరిశీలించి, పెండింగ్ లేకుండా ఆన్‌లైన్ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్ లో ఎంత మంది సిబ్బంది ఉన్నారు, వారు ఏ ఏ విధులు నిర్వహిస్తున్నారు అని ఒక్కొక్కరిని అడిగి తెలుసుకొన్నారు. పోలీస్ స్టేషన్ నుండి రోజు ఎన్ని బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ విధులు నిర్వహిస్తున్నాయని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడెక్కడ ఎన్ని బీట్స్ నడుస్తున్నాయని తెలుసుకొని ప్రాపర్‌గా పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. రైటర్స్ , సి సి టి ఎన్ ఎస్ రైటర్స్ ఆన్లైన్ వర్క్ పెండింగ్ లేకుండా, ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని తెలిపారు. విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలని సూచించారు.డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని, బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ నిరంతరం 24ఇ7 గస్తీ నిర్వహించాలని పేర్కొన్నారు.సిబ్బందికి కేటాయించిన కాలనీల పూర్తి సమాచారం అందరి దగ్గర ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఎప్పుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి. ఎస్పీ వై.మోగిలయ్య, గద్వాల సి ఐ టంగుటూరి శ్రీను,పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్సైలు కె.కళ్యాణ్, జహంగీర్, ఎన్. కుమార్, వెంకటేశ్వర రెడ్డి, సిబ్బంది, ట్రాఫిక్ ఆర్.ఎస్సై. బాలచంద్రుడు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల విజయసంకల్ప యాత్ర పోస్టర్ ఆవిష్కరణ



**వెల్దండ, జూన్ 18 (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమకారుల విజయ సంకల్పయాత్ర పోస్టర్ ను నాగర్ కర్నూలు జిల్లా ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు జంగిలి నిరంజన్ చేతుల మీదుగా గురువారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో జరిగిన కీలక సంఘటనలను, ప్రస్తుతం ఉద్యమకారులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. తెలంగాణ సాధన కోసం ఉద్యమకారులు చేసిన త్యాగాలను గుర్తు చేసుకుంటూ వారి సంక్షేమం కోసం ప్రభుత్వం మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ఈనెల 29న ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఓరుగంటి ఆనంద్ ఆధ్వర్యంలో అదిలాబాదు నుంచి 101 కార్లతో నిర్వహించే విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలోని తెలంగాణ ఉద్యమకారులందరూ ఈ యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని జంగిలి నిరంజన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ జేఏసీ చైర్మన్ బొల్లె ఈశ్వర్, ఉద్యమకారుల మండల అధ్యక్షుడు గజిని శ్రీను, కో చైర్మన్ మాడుగుల శంకర్, టౌన్ అధ్యక్షుడు గణేష్, ప్రవీణ్, జేఏసీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, కొండల్, దేవయ్య, సింహరెడ్డి, ఏకుల శ్రీను, పోలే అశోక్ , జంగిలి ప్రవీణ్, సిర్సనగండ్ల శేఖర్ పలువురు ఉద్యమకారులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందాలి



**వెల్దండ, జూన్ 18 (జనంసాక్షి) :** ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలందరికీ పూర్తిస్థాయిలో అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ పాటిల్ సూచించారు. గురువారం వెల్దండ మండల కేంద్రంతో పాటు పెద్దాపూర్ గ్రామాలలో జిల్లా కలెక్టర్ పర్యటించి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలుతీరును పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని ఆయన పరిశీలించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించి, నిర్మాణాలను నిర్దేశిత ప్రమాణాలకు అనుకూలంగా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన ఉడుత జంగయ్య కు దివ్యాంగ సర్టిఫికెట్, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వెల్దండ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ కలెక్టర్ ను కోరారు. సంబంధిత అంశాలను పరిశీలించి ప్రభుత్వ నిబంధన మేరకు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతిగృహం పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని సర్పంచ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పెద్దాపూర్ గ్రామంలో నర్సరీలోని మొక్కలను పరిశీలించి వాటి పెంపకంపై దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్శనలో కలెక్టర్ తో పాటు ఆర్డీవో జనార్దన్ రెడ్డి, తహసిల్దార్ కార్తీక్ కుమార్, ఎంపీడీవో కృష్ణయ్య, మండల విద్యాధికారి చంద్రుడు, పెద్దాపూర్ సర్పంచ్ కేశమల్ల అనుష, వెల్దండ ఉపసర్పంచ్ శ్రీను ముదిరాజ్, జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షులు కొయ్యల పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి గిరి గౌడ్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ముదిగొండ రమేష్, ఎండి రషీద్ తదితరులు పాల్గొన్నారు.

# రాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాల ఫ్లాగ్ మార్చ్

● జిల్లా ఎస్పీ డి.జానకి



**మహబూబ్‌నగర్ రూరల్, జూన్ 18 (జనం సాక్షి) :** మహబూబ్‌నగర్ పట్టణంలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో గురువారం మహబూబ్‌నగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) బలగాలతో కలిసి భారీ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగింది. ఈ ఫ్లాగ్ మార్చ్‌లో జిల్లా ఎస్పీ డి.జానకి, స్వయంగా పాల్గొని బలగాలను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఇజాజ్‌ఉద్దీన్ ఆర్ఏఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్,ఆర్ఏఎఫ్ సిబ్బంది, పోలీసు అధికారులు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. ఫ్లాగ్ మార్చ్ ఓల్డ్ డిఈఓ ఆఫీస్, రైల్వే స్టేషన్, ఎర్రసత్యం క్రాస్ రోడ్, బోయపల్లి గేట్, తెలంగాణ చౌరస్తా, న్యూ బస్ స్టాండ్, మల్లికార్జున చౌరస్తా తదితర ప్రధాన ప్రాంతాల్లో నిర్వహించబడింది. ప్రజా రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్తంగా నిఘా కొనసాగిస్తున్నట్లు ఈ ఫ్లాగ్ మార్చ్ ద్వారా ప్రజలకు భరోసా కల్పించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోంది. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో జీవించేలా జిల్లా పోలీసు యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తోంది. అసాంఘిక కార్యకలాపాలు, నేరాలను సమర్థవంతంగా అరికట్టడంతో పాటు ప్రజల్లో భద్రతా భావన పెంపొందించడమే ఈ ఫ్లాగ్ మార్చ్ ముఖ్య ఉద్దేశ్యం అని తెలిపారు. అదేవిధంగా, ప్రజా రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొంటూ, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, అనుమానాస్పద వ్యక్తులు లేదా అనుమానాస్పద సంఘటనలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. జిల్లాలో శాంతిభద్రతలను కాపాడేందుకు జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ ప్రజలతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తుందని, ప్రజల సహకారం పోలీసులకు ఎంతో కీలకమని జిల్లా ఎస్పీ తెలిపారు.

# ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్ 18 (జనం సాక్షి) :** మహబూబ్ నగర్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఉన్న ఈ.వి.ఎం గోదాంను త్రైమాసిక తనిఖీలో బాగంగా గురువారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా రాజకీయ పార్టీ ప్రతినిధిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గనిర్ధేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవిఎం గోదాంను తనిఖీచేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవిఎంల రక్షణ భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోదాశీ వద్ద సిబ్బంది హాజరు తీరుపై ఆరా తీశారు. ఈవిఎం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈవియం గదుల వివి ప్యాట్ గదుల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ,అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని,రాజకీయ పార్టీల ప్రతినిధుల ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి

● కొత్త కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి
● పాలిటెక్నిక్ విద్యార్థులకు కలెక్టర్ దిశా నిర్దేశం



**గద్వాల నడిగడ్డ, జూన్ 18 (జనం సాక్షి) :** ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం గద్వాల మండలం గోనుపాడు గ్రామం వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలోని పలు విభాగాలను పరిశీలించి, తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు తీసుకున్న వివిధ కోర్సులు, వారి భవిష్యత్తు లక్ష్యాల గురించి అడిగారు. వివిధ ల్యాబ్ లను సందర్శించి విద్యార్థులకు అర్థమయ్యేలా శిక్షణ ఇవ్వాలని, అవసరమైన సెమినార్లు నిర్వహించి వివిధ అంశాలపై అవగాహన కల్పించాలని అక్కడి అధ్యాపకులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గద్వాలలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఇప్పటికే ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్ కోర్సులు ఉండగా ఈ సంవత్సరం నూతనంగా సైబర్ ఫిజికల్ సిస్టం సెక్యూరిటీ కోర్స్ ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. పాలిసెట్ కౌన్సిలింగ్ సందర్భంగా ఇప్పటికే వివిధ కోర్సుల్లో చేరిన విద్యార్థులు కొత్త కోర్సులోకి మారేందుకు అవకాశం ఉందన్నారు. ఇటీవల పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షలు రాసిన విద్యార్థులకు కూడా ఈ కళాశాలలో చేరేందుకు స్పాట్ అడ్మిషన్స్ ద్వారా అవకాశం ఉంటుందన్నారు. వడ్డేపల్లి లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్స్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ప్రతి కోర్సులో 60 సీట్లు ఉంటాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడి కళాశాలలో చేరిన విద్యార్థులు గద్వాలలోని పలు వసతి గృహాల్లో ఉన్నందున వారు కళాశాలకు వెళ్లి వచ్చేందుకు ఇబ్బంది లేకుండా బస్సులను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ సమీపంలోని గద్వాల మండలానికి చెందిన కస్తూర్బా విద్యాలయాన్ని సందర్శించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ ను పరిశీలించి తగు సూచనలు చేశారు. కొత్త విద్యార్థుల అడ్మిషన్స్ గురించి అడిగి, నిబంధనల ప్రకారం విద్యార్థులను చేర్చుకోవాలన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు రోజులవుతున్న విద్యార్థులు పూర్తిస్థాయిలో విద్యాలయానికి రాకపోవడమేమిటిని ప్రశ్నించారు. ఈ సందర్భంగా పలు తరగతి గదులలో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకొని మంచి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేశారు. మెనూ ప్రకారం భోజనం వండించాలని అక్కడి ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం కస్తూర్బా విద్యాలయ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ పర్యటనలో డీఈవో విజయలక్ష్మి, సెక్టోరియల్ అధికారి జ్యోతి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్, కస్తూర్బా విద్యాలయ ప్రత్యేక అధికారిని గోపీలత తదితరులున్నారు.

## ప్లాస్టిక్ రహిత మార్కెట్లే లక్ష్యంగా ముందుకు సాగాలి

- ప్రత్యామ్నాయ బ్యాగుల ప్రత్యేక స్టాల్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి



**వరంగల్ ఎంజీఎం, జూన్ 18(జనంసాక్షి):** పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్య రక్షణకు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి, మార్కెట్లను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు సమష్టి కృషి అవసరమని జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి అన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో హన్మకొండ ఎక్సయిజ్ కాలనీ రైతు బజార్‌లో ఏర్పాటు చేసిన జూట్, క్లాత్ మరియు బయోడిగ్రేడబుల్ బ్యాగుల ప్రత్యేక స్టాల్‌ను గురువారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు ప్రజల ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. అందువల్ల ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జూట్ బ్యాగులు, క్లాత్ బ్యాగులు, బయోడిగ్రేడబుల్ బ్యాగుల వినియోగాన్ని ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని సూచించారు. మార్కెట్ ప్రాంతాల్లో వ్యాపారులు, వినియోగదారులు ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని పూర్తిగా మానుకుని పర్యావరణ హిత ఉత్పత్తులను వినియోగించాలని కోరారు. ఇకపై మార్కెట్లను దశలవారీగా ప్లాస్టిక్ రహిత మార్కెట్లుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఎం హెచ్ ఓ రాజారెడ్డి, ఆర్డీఓ వెంకటేష్, బల్దియా సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటరు జాబితా రూపకల్పనలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరం

- 2కె రన్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్‌పాయి




**హనుమకొండ ప్రతినిధి, జూన్ 18 (జనం సాక్షి) :** ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది అయిన ఓటరు జాబితాను మరింత సమగ్రమైనదిగా, పారదర్శకమైనదిగా రూపొందించేందుకు భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ప్రతి పౌరుడు చురుకుగా భాగస్వామి కావా లని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి చాహత్ బాజ్‌పాయి పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్-2026పై ఓటర్లలో అవగాహన పెంపొందిం చేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 2కె రన్‌ను హనుమకొండ అదాలత్ సర్కిల్‌లోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద ఆమె ప్రారంభించారు. అక్కడి నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీ ఉత్సాహంగా కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థ విశ్వసనీయత ఓటరు జాబితా ఖచ్చితత్వంపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రతి ఓటరు సద్వినియోగం చేసుకోవాలని, అర్హులైన పౌరులు తమ పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో నిర్ధారించు కోవడంతో పాటు అవసరమైన సవరణలు, మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు. పారదర్శకమైన, సమగ్రమైన, తప్పులులేని ఓటరు జాబితా రూపకల్పనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. మరణించిన వ్యక్తుల పేర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాలు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన డూప్లికేట్ ఓట్లను గుర్తించి తొలగించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇ.వి. శ్రీనివాసరావు, రావు పద్మ, అమరేందర్ రెడ్డి, కుసుమ శ్యాంసుందర్, నాగబెల్లి రజనీ కాంత్, ప్రవీణ్ కుమార్, సయ్యద్ ఫైజుల్లా, మున్నా, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, జిల్లా యువజన, క్రీడల అధికారి కొత్త ప్రశాంత్, టీజీవో రాష్ట్ర నాయకులు జగన్మోహన్ రావు, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్, ఆర్డీఓ వెంకటేష్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్ పాల్గొన్నారు.

## సూర్యకిరణ్ వర్మ దందాలకు పోలీసుల చెక్

- 8 మంది నిందితుల అరెస్ట్ రెండు కార్లు సీజ్
- పరకాల ఎసిపి సతీష్ బాబు




**ఆత్మకూర్, జూన్ 18 (జనంసాక్షి):** వాహనాల తాకట్టు పేరుతో భారీ మోసాలకు పాల్పడుతూ, యువకుడిని కిడ్నాప్ చేసి దాడి చేసి నగదు, మొబైల్ ఫోన్ లాక్కున్న కేసును గురువారం ఆత్మకూరు పోలీసులు ఛేదించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పరకాల ఏసీపీ సతీష్ బాబు మాట్లాడుతూ ఈ కేసులో 8 మంది నిందితులను అరెస్ట్ చేసి, రెండు కార్లు, రెండు ఐఫోన్లు, నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. హనుమకొండకు చెందిన సంగాని సూర్యకిరణ్ వర్మ, ఆకారపు ప్రవీణ్ కుమార్ కలిసి అద్దెకు తీసుకున్న వాహనాలను ఇతరుల వద్ద తాకట్టు పెట్టి డబ్బులు తీసుకునేవారు. అనంతరం జీపీఎస్ ట్రాకర్ ద్వారా, డూప్లికేట్ తాళాల సహాయంతో ఆ వాహనాలను తిరిగి స్వాధీనం చేసుకొని యజమానులు, డబ్బులు ఇచ్చిన వారిని మోసం చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో ఆత్మకూరు మండలానికి చెందిన గౌని శ్రీకాంత్ గౌడ్ వద్ద వాహనాలను తాకట్టు పెట్టి డబ్బులు తీసుకున్న నిందితులు, అనంతరం వాహనం తిరిగి ఇవ్వాలంటూ ఒత్తిడి చేశారు. వాహనం అప్పగించకపోవడంతో నిందితులు కుట్రపన్ని జూన్ 10న శ్రీకాంత్‌ను ఆత్మకూరులోని ఏవీఆర్ బేకరీ సమీపం నుంచి బలవంతంగా కారులో ఎక్కించి అపహరించారు. అతడిని కోమటిపల్లి టోల్‌గేట్ సమీపంలోని కొండ ప్రాంతానికి తీసుకెళ్లి తీవ్రంగా కొట్టడంతో పాటు, అతని వద్ద ఉన్న ఐఫోన్ 17 ప్రో మొబైల్ ఫోన్, 3,000 రూపాయల నగదును లాక్కొన్నారు. అనంతరం చంపేస్తామని బెదిరించి, తర్వాత కేయూసీ పోలీస్ స్టేషన్ సమీపంలో వదిలి వెళ్లిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుల్లో 8 మందిని అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఆస్తి ఐఫోన్ మొబైల్ ఫోను,3,000 రూపాయల నగదు, టాటా నెక్సాన్ కారు,స్విఫ్ట్ కారు ,మరో ఐఫోన్ మొబైల్ ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితులపై కిడ్నాప్, దోపిడీ, బెదిరింపులు, కుట్ర తదితర నేరాల కింద కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు పరకాల ఏసీపీ సతీష్ బాబు తెలిపారు. ఈ సమావేశంలో ఆత్మకూరు సిఐ ఆర్. సంతోష్, ఎస్సై తిరుపతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## తిమ్మంపేటలో పెద్దమ్మ తల్లి గుడి ప్రారంభం

- శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్



**దుగ్గొండి, జూన్ 18 (జనం సాక్షి) :** ముదిరాజ్ కులస్తులు తిమ్మంపేట గ్రామంలో ఆధ్యాత్మిక చింతనతో ఆరాధ్య దైవమైన పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్టాపన గుడి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని శాసనమండలి డిప్యూటీ చైర్మన్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు బండ ప్రకాష్ పాల్గొని శాస్త్రవేత్తంగా పూజలు నిర్వహించారు. గురువారం మండలంలోని తిమ్మంపేట గ్రామములో ముదిరాజుల ఆరాధ్య దైవం అయినటువంటి పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన నూతన గుడి ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ముదిరాజ్ మహా సభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బండ ప్రకాష్, నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ముదిరాజ్ మహా సభ ఎన్నారై విభాగం రాష్ట్ర అధ్యక్షులు శానబోయిన రాజుకుమార్, మహాసభ వరంగల్ జిల్లా అధ్యక్షులు పొన్నం మొగిలి, ముఖ్య అతిథులుగా విచ్చేసి పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పల్లె రమేష్, సోమన్న, జిల్లా పరిషత్ వైస్ ఛైర్మెన్ ఆకుల శ్రీనివాస్, నాచినపల్లి సొసైటీ ఛైర్మెన్ సుఖినే రాజేశ్వర్ రావు, మాజీ ఎంపీపీ కాట్ల కోమల-భద్రయ్య ,గ్రామ కుల పెద్దలు దండు రవి, నర్సయ్య,వార్డ్ మెంబర్ మ్యాక సుమలత-రాజు,మాజీ సర్పంచ్ మోడెం విద్యాసాగర్, దండు చిరంజీవి, గిన్నె భాస్కర్,దండు రాజు, మ్యాక అనిల్, దండు ఉపేందర్, గిన్నె స్వామి,తెప్పే శెంకర్,పెండ్యాల సాంబయ్య, జెటబోయిన రాజు, ముదిరాజ్ కులస్థులు పాల్గొన్నారు.

# 163 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం

- గైరాన్ భూమిపై జారీ చేసిన అక్రమ పట్టా రద్దు, భూమి స్వాధీనం




**జనగామ ప్రతినిధి, జూన్ 18(జనంసాక్షి):** కోట్ల రూపాయల విలువైన, అన్యాక్రాంతం కాకూడని ప్రభుత్వ గైరాన్ భూమి, దాదాపు రెండు దశాబ్దాలుగా మోసపూరిత దస్తావేజులు, ఒక అక్రమ ఉత్తర్వు ద్వారా ఒక ప్రైవేటు వ్యక్తికి దారిమళ్లించబడింది. పూర్తిగా తెలంగాణ ప్రభుత్వానికి పునరుద్ధరించబడింది. జనగామ జిల్లా, బచ్చన్నపేట మండలం సల్వాపూర్ గ్రామంలోని సర్వే నంబరు 147 (విస్తీర్ణం ఎకరా.163-25 గుంటలు, సుమారు 163 ఎకరాలు) ప్రభుత్వ భూమిని పూర్తిగా స్వాధీనం చేసుకుని తెలంగాణ ప్రభుత్వానికి పునరుద్ధరించింది. ఇది అన్యాక్రాంతం కాకూడని ప్రభుత్వ "గైరాన్" (ప్రజా ఉమ్మడి) భూమి దాదాపు రెండు దశాబ్దాల కాలంలో మోసపూరిత, అక్రమ చర్యల పరంపర ద్వారా ఈ భూమి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి దారిమళ్లించబడింది. ప్రధానంగా ఆక్రమణలో ఉన్న సుమారు 84 ఎకరాల భూమిని వివరణాత్మక పంచనామా ద్వారా స్థలంలోనే భౌతికంగా స్వాధీనం చేసుకోవడం జరిగింది. మొత్తం సర్వే నంబరు ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వానికి స్వాధీనమై, ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చింది. ఈ ప్రజా భూమి ఎలా అన్యాక్రాంతమైందో జిల్లా యంత్రాంగం జరిపిన విచారణలో నిర్ధారణ అయింది. మూలాధార సెటిల్‌మెంట్ రికార్డు (సేత్వార్)లో "గైరాన్"గా వర్గీకరించబడి, నిషేధిత ఉత్తర్వుల పుస్తకం మరియు నిషేధిత ఆస్తుల జాబితా కింద రక్షణ పొందిన ఈ భూమిని, ముందుగా ఎటువంటి హక్కు లేని వ్యక్తులు అమలు చేసిన రిజిస్టర్డ్ అమ్మకపు దస్తావేజుల ద్వారా చేజిక్కించుకున్నారు. ఆ తర్వాత మ్యుటేషన్లు, వాటి ఆధారంగా పొందిన పట్టాదారు పాస్‌బుక్‌లు, టైటిల్ డీడ్‌లు జారీ అయ్యాయి. అనంతరం ఈ దారి మళ్లింపునకు చట్టబద్ధత రూపాన్ని ఇవ్వడం కోసం, గతంలో ఒక ఉత్తర్వు జారీ చేయబడింది. ఆ ఉత్తర్వు ద్వారా ఈ కార్యాలయపు అప్పటి అధికారి ఈ ప్రభుత్వ "గైరాన్" భూమిని ప్రైవేటు పట్టా భూమిగా పరిగణించారు. దాంతో ఆ భూమిని నిషేధిత ఉత్తర్వుల పుస్తకం నుండి తొలగించి, దాదాపు మొత్తం విస్తీర్ణాన్ని వ్యవసాయేతర అవసరాలకు మార్చడం జరిగింది. ఈ ఉత్తర్వు గౌరవ హైకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా ఉంది హైకోర్టు కేవలం భూమి స్వభావంపై తాజా విచారణ జరపాలని మాత్రమే ఆదేశించింది. ఎటువంటి హక్కును కల్పించలేదు. అంతేకాక ఈ ఉత్తర్వు అధికార పరిధికి మించినది, ఎందుకంటే ప్రభుత్వ "గైరాన్" భూమిని ప్రైవేటు పట్టాగా మార్చే అధికారం ఏ కలెక్టర్‌కూ లేదు. ఫలితంగా, గణనీయమైన విలువ కలిగిన ప్రభుత్వ ఆస్తి ప్రైవేటు చేతుల్లోకి వెళ్లి, ప్రభుత్వ ఖజానాకు తీవ్ర నష్టం వాటిల్లింది. హైకోర్టు రిమాండ్ ఆదేశం మేరకు, ప్రస్తుత జిల్లా కలెక్టర్ తాజాగా, సమగ్రంగా విచారణ జరిపి, ప్రతి మూలాధార రికార్డును, సర్వే రికార్డును పరిశీలించి, దావాదారులకు పూర్తి, న్యాయమైన విచారణ అవకాశం కల్పించి, ఒక వివరణాత్మక, సహేతుక ఉత్తర్వు ద్వారా మొత్తం సర్వే నంబరును ప్రభుత్వ "గైరాన్" భూమిగా నిర్ధారించారు. ఈ ఉత్తర్వు -అమ్మకపు దస్తావేజులు, మ్యుటేషన్లు, పాస్‌బుక్‌లు, టైటిల్ డీడ్‌ల పరంపరను మొదటి నుండే చెల్లనివిగా ప్రకటించి ప్రభుత్వ భూమిపై జారీ చేసిన "పట్టా"ను రద్దు చేసి.. నిషేధిత ఉత్తర్వుల పుస్తకం నుండి తొలగింపు, వ్యవసాయేతర మార్పిడితో సహా గత ఉత్తర్వును, దాని పర్యవసాన చర్యలను ఉపసంహరించి భూమిని ప్రభుత్వానికి స్వాధీనం చేసింది. రికార్డ్ ఆఫ్ రైట్స్ సరిదిద్దబడింది.. సర్వే నంబరు తిరిగి నిషేధిత ఉత్తర్వుల పుస్తకంలో, నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చబడింది. ఈ భూమికి సంబంధించిన ఏ దస్తావేజు రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయడం జరిగింది. తద్వారా ఈ భూమి మళ్లీ ప్రభుత్వం నుండి అన్యాక్రాంతం కాకుండా చూడడం జరిగింది. భూమిని స్వాధీనం చేసుకోవడం ఇందులో మొదటి అడుగు మాత్రమే... గత ఉత్తర్వు, దాని వెనుక ఉన్న మోసం ప్రభుత్వానికి తీవ్ర నష్టం కలిగించాయి బాధ్యతను నిర్ధారించి, ప్రజా ప్రయోజనాన్ని పూర్తిగా పరిరక్షించే విధంగా ఈ అంశాన్ని చట్ట ప్రకారం దాని తార్కిక ముగింపు వరకు తీసుకువెళ్లడం జరుగుతోంది. ప్రభుత్వ భూమి పరిరక్షణ ఒక పవిత్రమైన ప్రజా బాధ్యత అని, దానిని నిలబెట్టేందుకు జిల్లా యంత్రాంగం దృఢంగా కట్టుబడి ఉంది. అక్రమ లేదా మోసపూరిత మార్గాల ద్వారా అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని గుర్తించి ప్రజలకు తిరిగి పునరుద్ధరిస్తామని, ప్రభుత్వ ఆస్తిని ప్రైవేటు ఆస్తిగా మార్చేందుకు చేసే అధికార దుర్వినియోగాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ చెల్లనివ్వబోమని జిల్లా యంత్రాంగం పేర్కొన్నది.

## మత్తు పదార్థాల నియంత్రణలో కంట్రోల్ టీం పనితీరు భేష్

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**వరంగల్ బ్యూరో, జూన్ 18 (జనం సాక్షి) :** పోలీస్ కమిషనరేట్ పరిధిలో గంజాయి వినియోగం, రవాణా, సాగు, నిల్వ, సరఫరా మరియు అక్రమ విక్రయాలను సమర్థవంతంగా అరికట్టడంతో పాటు యువతను మాదకద్రవ్యాలు మరియు ఇతర చెడు వ్యసనాల బారిన పడకుండా రక్షించేందుకు డ్రగ్స్ కంట్రోల్ టీం పనితీరు అభినందనీయమని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. ఈ మేరకు ఆయన విలేకరుల సమావేశం గురువారం నిర్వహించారు. 15-07-2024న "డ్రగ్స్ కంట్రోల్ టీమ్" అనే ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని. ఈ బృందం నిరంతర నిఘా, సమాచార సేకరణ, ప్రత్యేక దాడుల ద్వారా గంజాయి సంబంధిత నేరాల్లో పాల్గొనే వ్యక్తులను గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో లా అండ్ ఆర్డర్ పోలీసులకు సహకరిస్తోంది. మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, వాటికి సంబంధించిన చట్టపరమైన శిక్షలపై విద్యార్థులు మరియు ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. గంజాయి సాగు, రవాణా, నిల్వ, సరఫరా లేదా అక్రమ విక్రయాలకు సంబంధించిన విశ్వసనీయ సమాచారాన్ని 8712685299, 8712584473 ఫోన్ నంబర్ల ద్వారా పోలీసులకు అందించి ప్రజలు సహకరించాలని వరంగల్ పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. సమాచారదాతల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయి. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడుతూ, మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణమే డ్రగ్స్ కంట్రోల్ టీమ్ ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోంది.

### డ్రగ్స్ కంట్రోల్ టీమ్ సాధించిన ఫలితాలు

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు డ్రగ్స్ కంట్రోల్ టీమ్ 15-07-2024 నుండి 16-06-2026 వరకు చేపట్టిన చర్యల్లో గణనీయమైన ఫలితాలు సాధించింది. నమోదైన మొత్తం కేసులు 192, కేసుల్లో ప్రమేయం ఉన్న మొత్తం వ్యక్తులు 403 మంది, స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలు, ఆస్తులుగంజాయి 1,241.110 కిలోగ్రాములు గంజాయి మొక్కలు 07ఓపియం 1.530 కిలోగ్రాములుబ్రౌన్ షుగర్ 0.2 గ్రాములు హషీష్ ఆయిల్ 22.4 లీటర్లు, గంజాయి చాక్లెట్లు 251స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాల మొత్తం విలువ రూ. 8,57,90,978, నగదు రూ. 2,15,500, మొబైల్ ఫోన్లు 601, ద్విచక్ర వాహనాలు 63ఆటోలు 06, కార్లు 83 స్వాధీనం చేసుకున్నారు. సమాచారం అందించేందుకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు 8712685299, 8712584473మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణంలో ప్రజల సహకారం ఎంతో అవసరం. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ముందుకు రావాలని వరంగల్ పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రకృతి సమతుల్యంగా ఉంటేనే మనుగడ సాధ్యం

- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- వాతావరణం సమతుల్యంగా ఉండాలంటే మొక్కల పెంపకం ఒకటే మార్గం
- ప్రతీ ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలి



**స్టేషన్ ఘన్‌పూర్ , జూన్ 18 (జనంసాక్షి) :** పర్యావరణాన్ని రక్షించాలన్న, వాతావరణం సమతుల్యంగా ఉండాలన్న మొక్కల పెంపకం ఒకటే మార్గం అని కావున ప్రతీ ఒక్కరూ విధిగా మొక్క లునాటి వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. స్టేషన్ ఘనపూర్ మండలం లో ని నమిలిగొండ గ్రామ పరిధిలో గల కస్తూరిభా గాంధీ పాఠశాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వన మహోత్సవ ప్రారంభ కార్యక్ర మానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవర ణలో మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం వన మహోత్సవం కార్యక్రమంలో మొక్కుబడిగా మొక్కలు నాటకుం డా నాటినమొక్కలనుపరిరక్షించి వాటిని వృక్షాలు గా చేసే బాధ్యత కూడా తీసుకోవాలని సూచించారు. గత 10ఏళ్లుగా ఈ కార్యక్రమం ద్వారా నాటిన మొక్కలలో 50శాతం మొక్కలుకూడా కాపాడలేక పోయమని అన్నారు. ఈ రోజు పాఠశాల ఆవరణ లోనాటిన మొక్కలన్ని కాపాడాలని ఉపాధ్యాయు లకు, విద్యార్థులకు సూచించారు. వారం రోజులలో ఆర్ వో వాటర్ ప్లాంట్, హైమాస్ లైట్లు ఏర్పాటు చేయి స్తానని హామీ ఇచ్చారు. వారంలో ఒకేసారి వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవం, కోటి 45 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తానని వెల్లడించారు. విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్య ను అందించడంతో పాటు వారిని స్వంత బిడ్డలు గా చూసుకోవాల న్నారు. ఈ విద్యా సంవత్సరం 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆదేశిం చారు. ఈకార్యక్రమంలో స్థానికసర్పంచ్ కోమల, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వినయ్ కుమార్, జిల్లా ,మండల అధికారు లు, కస్తూరిబా గాంధీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఫారెస్ట్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకు లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## డీఎంహెచ్‌వో కార్యాలయంలో బదిలీల అక్రమాలపై ఫార్వర్డ్ బ్లాక్ ఫిర్యాదు

- డీఎంహెచ్‌వో కార్యాలయంలో బదిలీల అక్రమాలు
- ఫార్వర్డ్ బ్లాక్ ఫిర్యాదు.. లోపాలపై విచారణకు డిమాండ్
- వాస్తవాలు తేలితే కఠిన చర్యలు : డీఎంహెచ్‌వో హామీ




**కరీంనగర్ బ్యూరో, జూన్ 18 (జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా జరిగిన బదిలీలు, సీనియారిటీ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కమిటీ సభ్యుడు కె. బద్రినేతతో కలిసి డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా బండారి శేఖర్ మాట్లాడుతూ, చామనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీహెచ్ఈఓగా పనిచేస్తున్న చిలుక లింగయ్య సీనియారిటీ వివరాలను తప్పుగా చూపించి బదిలీల నుంచి తప్పించు కున్నారని ఆరోపించారు. అలాగే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా 'ఫోకల్ టు ఫోకల్' బదిలీలు పొందడంతో పాటు హెచ్ఆర్ఏ విషయంలోనూ అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఫిర్యాదును స్వీకరించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి స్పందిస్తూ, "ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం" అని హామీ ఇచ్చారు.




## మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనుల ఆకస్మిక తనిఖీ

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ ప్రతినిధి, జూన్ 18(జనంసాక్షి):** జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెయిన్ రోడ్ నుండి గార్లకుంట, సూర్యాపేట రోడ్ వరకు వరద నీటికాలువ రూ 910.00 లక్షలు తో చేపట్టిన నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి పురోగతి ని తెలుసుకున్నారు. ఈ పనిలో భాగంగా...ప్రస్తుతం సెంట్ మేరీ స్కూల్ వద్ద చేపడుతున్న పనులను తనీకి చేసి...సంబదిత అధికారులతో మాట్లాడిన కలెక్టర్ పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ప్రస్తుతం సెంట్ మేరీ స్కూల్ వద్ద చేపట్టిన వరద నీటికాలువను 35 నుండి 40 రోజులలో పూర్తి చేయవలెనని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన భద్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనగామ మున్సిపల్ కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ పేరుతో ఫేక్ వాట్సాప్ సందేశాలు

- అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**ములుగు ప్రతినిధి, జూన్ 18(జనంసాక్షి) :** ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు పేరుతో కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు వాట్సాప్ ద్వారా ఫేక్ మెసేజ్‌లు పంపుతూ అధికారులను సంప్రదించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఇటువంటి నకిలీ సందేశాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించవద్దని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్ అధికారిక సమాచార వ్యవహారాలు కేవలం అధికారిక మార్గాల ద్వారానే జరుగుతాయని స్పష్టం చేశారు. తెలియని నంబర్ల నుంచి, జిల్లా కలెక్టర్ పేరు, ఫోటో, ఇతర వివరాలు ఉపయోగించి వచ్చే సందేశాలను నమ్మకుండా వెంటనే తమ దృష్టికి,స్థానిక పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రతి అధికారి అప్రమత్తంగా ఉండి, సైబర్ మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

# ప్రతి ఒక్కరూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి

- చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు సీఎస్.రంగరాజన్

**మొయినాబాద్, జూన్ 18 (జనంసాక్షి) :** ధర్మాన్ని రక్షించాలనే తపన ప్రతి ఒక్కరిలో ఉండాలని చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకులు సీఎస్.రంగరాజన్ పేర్కొన్నారు. హైదరాబాద్ కు చెందిన ఆంజనేయులు గురుస్వామి 8 నెలల పాటు 25,200 కిలోమీటర్లు పాదయాత్ర చేసి 18 శక్తి పీఠాలు దర్శించుకుని గురువారం చిలుకూరు బాలాజీ దేవాలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆంజనేయులు స్వామిని పూలమాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా అర్చకులు సీఎస్.రంగరాజన్ మాట్లాడుతూ.. దైవానికి సముచిత స్థానాన్ని రాజ్యాంగబద్ధంగా కల్పించుకోవాలని అన్నారు. ఈ దేశాన్ని, ధర్మాన్ని రక్షించుకోవడంతో పాటు మన దేవాలయ వ్యవస్థను కాపాడుకోవాలని అన్నారు. ఈ మూడింటిని ఈ పాదయాత్ర సాధిస్తుందనే విశ్వాసాన్ని రంగరాజన్ ప్రదర్శించారు. అఖండ భారత దేశంలోని కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అందరినీ కలిపేది దైవ సన్నిధానాలేనని చెప్పారు. దేశాన్ని ఏకం చేసేది శక్తి పీఠాలు, దేవాలయాలు ప్రార్థన స్థలాలనీ ఆయన పేర్కొన్నారు. దేశాన్ని ఒకటి చేయడం కోసం. ప్రపంచంలో శాంతి నెలకొల్పడం కోసం ఈ పాదయాత్ర చేయడం అభినందనీయం



అన్నారు. ఈ యాత్ర ద్వారా అందరిలో సద్భావన రావాలని ఆయన ఆకాంక్షించారు. ధర్మాన్ని రక్షించడం కోసం ఆంజనేయులు పాదయాత్ర చేశారని అన్నారు. దేశ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలన్నారు. 8 నెలల పాటు ఎండకు వానకు చలికి తట్టుకొని పాదయాత్ర చేయడం మామూలు విషయం కాదన్నారు. బెంగళూరులోని చాముండేశ్వరి ఆలయం నుంచి పాదయాత్ర ప్రారంభించి ఆక్రమిత కాశ్మీర్ ప్రాంతంలో ఉన్న సరస్వతి మాత ఆలయం వరకు పాదయాత్ర చేసి అమ్మవారి దర్శనం చేసుకోవడం ఎంతో గొప్ప విషయం అని ప్రత్యేకంగా అభినందించాడు. ఆయన కుటుంబ సభ్యులు, ప్రజల సహకారం తోపాటు దేవుడి ఆశీర్వాదంతోనే ఈ పాదయాత్ర దిగ్విజయంగా పూర్తి చేయగలిగారని అన్నారు. ఆయనపై చిలుకూరు బాలాజీ అనుగ్రహం ఉండాలని ఆకాంక్షించారు. యాత్ర చేపట్టిన ఆంజనేయులు గురుస్వామి మాట్లాడుతూ.. లోక కళ్యాణం, గో సంరక్షణతోపాటు దేశ ప్రజలందరూ బావుండాలనే ఆలోచనతో ఈ పాదయాత్ర చేపట్టడం జరిగింది తెలిపారు. తమ కుటుంబ ల సభ్యులతోపాటు ప్రజలందరి సహకారం దేవుడి ఆశీర్వాదంతోనే ఈ యాత్ర పూర్తి చేయగలరని పేర్కొన్నారు. నేడు 19న శు క్రవారం శ్రీశైలంలో అధికారికంగా పాదయాత్ర ముగించనున్నట్లు తెలిపారు.

### బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం..

పాదయాత్ర ముగించుకొని చిలుకూరు బాలాజీ దేవాలయానికి వచ్చిన ఆంజనేయులు గురు స్వామికి ఘన స్వాగతం లభించింది. బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనానంతరం చిలుకూరు బాలాజీ ఆలయం అర్చకులతో పాటు బజరంగ్ దళ్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు ఆంజనేయ స్వామిని ఘనంగా సన్మానించారు. లోకకల్యాణం కోసం పాదయాత్ర చేపట్టిన ఆయన్ను భక్తులందరూ అభినందించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సురేష్ శర్మ, బాలస్వామి. బజరంగ్ ధళ్ మండల ప్రముఖ విజయ్ పాండు, గోరక్షణ సమితి ప్రముఖ శ్రీనివాస్, జిల్లా నాయకులు నందకిషోర్, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకం

- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**శంషాబాద్, జూన్ 18 (జనంసాక్షి) :** పచ్చదనం పెంపొందించడం, పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం మన అందరి సామాజిక బాధ్యత అని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం మల్కారం గ్రామ సర్పంచ్ యాదగిరి రెడ్డి తో కలిసి అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కల కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని కంటికి రెప్పలా సంరక్షించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో నర్కుడ గ్రామ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ దండు ఇస్తారీ, నాయకులు చంద్ర రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి చిలకమర్రి మహేందర్ ముదిరాజ్, పార్టీ నాయకుడు నీళ్ల శ్రీధర్ గౌడ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలు వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి

-జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, జూన్ 18 (జనంసాక్షి) :** రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కొనేందుకు జిల్లా అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. విపత్తు నిర్వహణ, సహాయక చర్యలపై అన్ని ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి శాఖ తమ బాధ్యతలను గుర్తించి, ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు వీలుగా జిల్లా యంత్రాంగం పటిష్టమైన కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. ముఖ్యంగా గత అనుభవాలు, జరిగిన నష్టాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి ముందస్తు ప్రణాళికతో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. భారీ వర్షాల పట్ల జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించాలని, అదే విధంగా మండల స్థాయిలో రెవెన్యూ విభాగం తరపున తహశీల్దార్లు, డీపీఓలు, ఇతర అధికారులు బాధ్యత వహించాలని ఆదేశించారు. చెరువులకు గండ్లు పడే అవకాశం ఉన్నందున వాటి కిందున్న ముంపు గ్రామాలను ముందే గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అత్యవసర సమయాల్లో అధికారులందరూ ఒకరికొకరు అందుబాటులో ఉండేలా కమ్యూనికేషన్ బుక్‌లెట్ రూపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్ రాజ్, జడ్పీ సీఈఓ శిరీష, జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి, డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో ఆగనున్న 'కేరళ ఎక్స్‌ప్రెస్'

**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 18 (జనం సాక్షి) :** శబరిమల వెళ్లే అయ్యప్ప స్వాములతో పాటు దక్షిణ భారత రాష్ట్రాలకు ప్రయాణించే వారికి శుభవార్త. న్యూఢిల్లీ – తిరువనంతపురం (కేరళ) మధ్య రాకపోకలు సాగించే ప్రధాన రైలు 'కేరళ ఎక్స్‌ప్రెస్' (నంబర్లు 12625/12626) త్వరలో ఖమ్మం రైల్వే స్టేషన్‌లో నిలవనుంది. జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ఖమ్మం వచ్చిన బిజెపి జాతీయ నాయకులు, కర్ణాటక తమిళనాడు రాష్ట్రాల కో ఇన్చార్జి మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి కి బిజెపి ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో చేసిన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకులు పొంగులేటి సుధాకర్ రెడ్డి ఈ విషయమై కేంద్ర రైల్వే శాఖ మంత్రితో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రయాణికుల ఇబ్బందులను ఆయన మంత్రికి కూలంకషంగా వివరించగా, సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి ఖమ్మంలో ఈ రైలు నిలుపుదలకు స్పష్టమైన హామీ ఇచ్చారు. భౌగోళికంగా, వాణిజ్యపరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న ఖమ్మం జిల్లా కేంద్రం గుండా కేరళ ఎక్స్‌ప్రెస్ వెళ్తున్నప్పటికీ ఇక్కడ హాల్టింగ్ లేదు. దీనివల్ల ప్రతీ ఏడు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల నుంచి శబరిమల యాత్రకు వెళ్లే లక్షలాది మంది భక్తులు తీవ్ర అవస్థలు పడేవారు. ముఖ్యంగా ఇరుముడితో వెళ్లే స్వాములు, వయోవృద్ధులు తప్పనిసరి పరిస్థితుల్లో వరంగల్ లేదా విజయవాడ వెళ్లి అక్కడి నుంచి ఈ రైలు ఎక్కాల్సి వచ్చేది. ఇది వారికి ఆర్థికంగా, శారీరకంగా ఎంతో శ్రమతో కూడుకున్న వ్యవహారం. కేవలం భక్తులకే కాకుండా విద్యా, వ్యాపార, ఉద్యోగ నిమిత్తం కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు వెళ్లే విద్యార్థులు, వ్యాపారులకు ఖమ్మంలో రైలు ఆగకపోవడం పెద్ద లోటుగా ఉండేది. ప్రజల ఈ కష్టాలను గ్రహించి, బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సుధాకర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన తక్షణమే స్పందించి కేంద్ర ప్రభుత్వం ద్వారా సమస్యకు పరిష్కారం చూపారు. కేరళ ఎక్స్‌ప్రెస్ నిలుపుదలకు కేంద్రం నుంచి సానుకూల నిర్ణయం రావడం పట్ల ఖమ్మం జిల్లా వాసులు, అయ్యప్ప భక్తులు అమితానందం వ్యక్తం చేస్తున్నారు. భక్తుల కష్టాలను తీర్చేందుకు చొరవ చూపిన పొంగులేటి సుధాకర్ రెడ్డికి, ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన బిజెపి ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావుకు జిల్లా నాయకత్వం, స్థానిక నేతలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నిర్ణయం వల్ల లక్షలాది మందికి మేలు జరగడమే కాకుండా, ప్రజలకు వ్యయప్రయాసలు తప్పుతాయని పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## నెల్లికల్ లిఫ్ట్ పనులు వెంటనే పూర్తి చేయాలి

మాజీ ఎమ్మెల్యే నోముల భగత్



**తిరుమలగిరి (సాగర్), జూన్ 18 (జనంసాక్షి) :** మండలంలో నెల్లికల్ ప్రాంతంలోని లిఫ్ట్ నిర్మాణ పనులను మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ గురువారం రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్కడి రైతులతో చర్చించారు. నోముల భగత్ తెలిపిన వివరాల ప్రకారం, ప్రస్తుతం జరుగుతున్న లిఫ్ట్ పనులు గత బి.ఆర్.ఎస్. ప్రభుత్వ సమయంలో ప్రారంభించబడి చేపట్టినవి కాగా, తాజా ప్రభుత్వం ఎన్నికల తర్వాత కొత్తగా ఎలాంటి అభివృద్ధి కార్యాచరణలు తీసుకురాలేదని ఆయన ఆరోపించారు: గత ప్రభుత్వం ప్రారంభించిన ప్రాజెక్టులను మాత్రమే ఇప్పుడు కొనసాగిస్తున్నారు. రైతులు పంటలు సాగు చేసుకునే సమయానికి లిఫ్ట్ పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను కోరారు. పార్టీలతో సంబంధం లేకుండా రైతుల ప్రయోజనాలే ప్రధానంగా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పిడిగం నాగయ్య, పగడాల పెద్దిరాజు, వీరబోయిన మల్లికార్జున్, కార్యకర్తలు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## హాలియాను గుడిసెలు లేని పట్టణంగా తీర్చిదిద్దాలి



**హాలియా, జూన్ 18 (జనం సాక్షి) :** హాలియా పురపాలక సంఘం సాధారణ సభ సమావేశం చైర్మన్ చింతల చంద్రారెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి నాగార్జునసాగర్ శాసనసభ్యుడు కుందూరు జైవీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభను ఉద్దేశించి చైర్మన్ చంద్రారెడ్డి మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు, వర్షాకాలానికి ముందస్తు ఏర్పాట్లు, తాగునీటి సమస్యల పరిష్కారానికి బోర్ల మరమ్మతులు, పట్టణ అభివృద్ధి పనులపై చర్చించినట్లు తెలిపారు. శాసనసభ్యుడు జైవీర్ రెడ్డి మాట్లాడుతూ హాలియాను గుడిసెలు లేని పట్టణంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రాధాన్య క్రమంలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందని చెప్పారు. తొలి విడతలో అదనంగా ఎంపికైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా అనుముల మండల తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పురపాలక కమిషనర్ కె. రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు గౌని రాజా రమేష్ యాదవ్, కౌన్సిలర్లు నకిరేకంటి అన్నపూర్ణ, కుందూరు వెంకటరెడ్డి, కడమంచి ప్రమీల, చిట్టిపోలు శ్రీదేవి, బొంగరాల యేసురాజు, గౌహర్ జబిన్, చెరుపల్లి ముత్యాలు, పిల్లి చంద్రకళ, సహనియుక్త సభ్యులు కొమ్మనబోయిన జయమ్మ, చెన్ను రాజేశ్వరి, వర్కాల శేఖర్ రెడ్డి, ఎండీ రషీద్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

## మర్రిగూడ కేజీబీవీలో వంట మనుషుల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**మర్రిగూడ, జూన్ 18 (జనం సాక్షి) :** నల్గొండ జిల్లా మర్రిగూడ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ఖాళీగా ఉన్న మూడు సహాయ వంట మనుషుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి (ఎంఈఓ) శారద గురువారం తెలిపారు. కేజీబీవీ హాస్టల్‌లో విద్యనభ్యసిస్తున్న బాలికలకు ఆహారాన్ని సిద్ధం చేసే బాధ్యతలను నిర్వహించేందుకు వంట పనుల్లో అనుభవం కలిగిన మహిళా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక మహిళలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను జూన్ 19 నుంచి జూన్ 20 సాయంత్రం 5 గంటలలోపు కేజీబీవీ మర్రిగూడ పాఠశాలలో నేరుగా సమర్పించాలని సూచించారు. గడువు తేదీ అనంతరం వచ్చే దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించబోమని స్పష్టం చేశారు. పోస్టులకు సంబంధించిన పూర్తి వివరాలు, అర్హతలు మరియు ఎంపిక ప్రక్రియపై సమాచారం కోసం పాఠశాల స్పెషల్ ఆఫీసర్‌ను సంప్రదించాలని సూచించారు. మర్రిగూడ మండల పరిధిలోని నిరుద్యోగ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. దరఖాస్తుల స్వీకరణకు కేవలం రెండు రోజులే గడువు ఉండటంతో అర్హులైన మహిళలు ఆలస్యం చేయకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

## మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా వన మహోత్సవం

**చండూరు, జూన్ 18 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చండూరు నూతన మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం ఉదయం 11:30 గంటలకు 'వన మహోత్సవ' ప్రారంభ కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించబడింది. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, కమిషనర్ ఎల్. మల్లేశం ఆధ్వర్యంలో జరిగిన ఈ మెగా ప్లాంటేషన్ కార్యక్రమానికి చండూరు ఆర్డీఓ వనజ రాణి, తహశిల్దార్ రమాకాంత్ శర్మ ముఖ్య అతిథులుగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆర్డీఓ వనజ రాణి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ మరియు వాతావరణ సమతుల్యతను కాపాడటంలో మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా, వాటి సంరక్షణ బాధ్యతను కూడా స్వీకరించాలని సూచించారు. హరితహారం, వనమహోత్సవ కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేసి, భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కానుకగా అందించాలని ఆమె కోరారు. ఈ హరిత సంబరంలో మున్సిపల్ వైస్ చైర్మన్ భూతరాజు దశరథ, తహశిల్దార్ రమాకాంత్ శర్మ, కౌన్సిల్ సభ్యులు తెలుకుంట్ల రాజకుమారి చంద్రశేఖర్, కొండ్రెడ్డి మధు, కోడి సుష్మ వెంకన్న, కటకం రమేష్ పాల్గొన్నారు. అలాగే కో-ఆప్షన్ సభ్యులు షేక్ ఖలీల్, మొగుదాల సతమ్మ వెంకన్న, ఎండీ. సలీమా షరీఫ్, మున్సిపల్ అధికారులు సాయి భరద్వాజ్, జగన్,



సాయి రామ్, పర్యావరణ ఇంజనీర్ అరవింద్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఆంధ్ర - కేరళ గంజాయి స్మగ్లింగ్‌కు అన్నపురెడ్డిపల్లి పోలీసుల చెక్

- రూ.44.29 లక్షల విలువైన 88.590 కేజీల నిషేధిత గంజాయి స్వాధీనం
- ఇద్దరు నిందితులు అరెస్ట్
- కారు, సెల్‌ఫోన్ సీజ్



**అన్నపురెడ్డిపల్లి, జూన్ 18 (జనం సాక్షి) :** అన్నపురెడ్డిపల్లి పోలీసుల అప్రమత్తతతో భారీ గంజాయి అక్రమ రవాణా యత్నం భగ్నమైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి కేరళ రాష్ట్రానికి కారులో తరలిస్తున్న సుమారు 88.590 కిలోల నిషేధిత గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.44,29,500 ఉంటుందని అధికారులు తెలిపారు. వాహనాల తనిఖీల్లో భాగంగా అనుమానాస్పదంగా వెళ్తున్న కారును పోలీసులు తనిఖీ చేయగా, అందులో భారీ మొత్తంలో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే కారును స్వాధీనం చేసుకుని, అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ ఎల్. ఆదినారాయణ మాట్లాడుతూ, గంజాయితో పాటు రవాణాకు ఉపయోగించిన కారు, ఒక సెల్‌ఫోన్‌ను కూడా సీజ్ చేసినట్లు వెల్లడించారు. నిందితులపై సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అక్రమ మాదక ద్రవ్యాల రవాణాపై పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారని, ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్, స్థానిక ఎస్సై, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఇంటి స్థలం కేటాయింపు నా బాధ్యత

- ఎమ్మెల్యే కూనంనేని
- ఇండ్ల స్థలాల కోసం పలుమార్లు సీఎంకు వినతులు అందజేత
- పండుగ వాతావరణంలో ఘనంగా కొత్తగూడెం ప్రెస్ క్లబ్ ప్రారంభోత్సవం..

**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 18 (జనం సాక్షి) :** జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నా వంతుగా కృషి చేస్తున్నానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. గురువారం కొత్తగూడెం ప్రెస్‌క్లబ్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇప్పించే విషయమై ఇప్పటికే పలుమార్లు సీఎం తో మాట్లాడనని అన్నారు. జర్నలిస్టులు సమాజాభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలన్నారు. జర్నలిస్టుల కోసం కొత్తగూడెంలో పది ఎకరాల స్థలాన్ని కేవలం జర్నలిస్టుల కోసమే కాపాడుతున్నానన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ.. అన్ని రంగాలలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఎప్పటికప్పుడు నిరంతరం తప్పును ఎత్తిచూపుతూ సమాజ శ్రేయస్సుకోసం నిరంతరం కృషి చేస్తున్న జర్నలిస్టులకు తాను ఎప్పుడు అండగా ఉంటానన్నారు. నగరంలో సమస్యలను తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. బిజెపి జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు గత ప్రభుత్వం లో ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా హామీలతోనే కాలం వెళ్ల బుచ్చిందన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇండ్ల స్థలాల విషయంలో జాప్యం చేస్తుండడం బాధాకారమన్నారు. ప్రెస్‌క్లబ్ ప్రారంభోత్సవంలో వెలుగు స్టాఫ్ రిపోర్టర్ కీలక భూమిక పోషించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె షాబిర్ పాషా, సీనియర్ రిపోర్టర్లు పోతు



రాజేందర్, లోగాని శ్రీనివాస్, ఇమంది ఉదయ్ కుమార్, యెర్రా ఈశ్వర్, జునుమాల రమేష్, కల్లోజి శ్రీనివాస్, మోటమర్రి రామకృష్ణ, శంకర్, లక్ష్మణ్, అఫ్జల్, కృష్ణ గోవింద్, కాగితపు వెంకటేశ్వర్లు, నర్సింహ్మా, పండుగ రేశ్వంత్, రవి, రాజేశ్, కుమార్, నాగాచారి, భాస్కర్, సురేష్, పూర్ణ, పాపారావు, రాజేష్, కృష్ణారావు, సుధాకర్, శ్రీనివాస్, షఫి, ఉమాకాంత్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




# కొనసాగిన బుల్‌రన్..

## ఐదో రోజూ లాభాల్లోనే సూచీలు



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా ఐదోరోజూ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గుముఖం పట్టడం, అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదరడంతో సెంటిమెంట్ బలపడింది. పీఎస్‌యూ బ్యాంక్, హెల్త్‌కేర్, మెటల్, రియల్టీ స్టాక్స్‌లో కొనుగోళ్ల దన్నుతో సూచీలు రాణించాయి. ఆఖర్లో కొనుగోళ్ల మద్దతు కలిసొచ్చింది. ఈ క్రమంలోనే సెన్సెక్స్ ఓ దశలో 300 పాయింట్ల మేర రాణించగా.. నిఫ్టీ 24,100 ఎగువన ముగిసింది. గడిచిన ఐదు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 4.85 శాతం రాణించగా.. నిఫ్టీ 50 ఇండెక్స్ 4.35 శాతం లాభపడింది. సెన్సెక్స్ ఉదయం 77,131.66 పాయింట్ల (క్రితం ముగింపు 77,155.62) వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 77,492.33 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 254.36 పాయింట్ల లాభంతో 77,409.98 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 82.30 పాయింట్ల లాభంతో 24,168 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 94.34గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండిగో, ట్రెంట్, బీఈఎల్, ఎన్టీపీసీ, ఎస్‌బీఐ షేర్లు రాణించాయి. ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, మారుతీ సుజుకీ, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 77 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4268 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



# మెంబర్‌షిప్ ధర తగ్గింపు

- అమెజాన్ ప్రైమ్ డే సేల్ తేదీ ఖరారు..

**న్యూఢిల్లీ:** ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ ప్రైమ్ డే సేల్‌కు సిద్ధమవుతోంది. జులై 4 నుంచి జులై 6 వరకు మూడు రోజుల పాటు నిర్వహించనుంది. కేవలం ప్రైమ్ యూజర్ల కోసమే ఏటా నిర్వహించే ఈ సేల్‌లో ఎక్స్‌క్లూజివ్ డీల్స్, భారీ ఆఫర్లను అందిం చనుంది. ఆఫర్ల వివరాలు ఇంకా ప్రకటించలేదు. సేల్‌కు కొన్ని రోజుల ముందే ఈ వివరాలను కంపెనీ వెల్లడించనుంది. జులై 4న రాత్రి 12 గంటలకు సేల్ ప్రారంభమవుతుంది. జులై 6న రాత్రి 11.59 నిమిషాలకు ముగుస్తుంది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ సేల్‌లో వన్‌ప్లస్, శాంసంగ్ బ్రాండ్లకు సంబంధించిన 500 కొత్త ప్రొడక్ట్‌లపై భారీ ఆఫర్లు ఉంటాయని కంపెనీ ప్రకటించింది. ఎకో స్మార్ట్ స్పీకర్స్, అలెక్సా, ఫైర్ టీవీలపై 45 శాతం వరకు ఆఫర్లు అందించనుంది. ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంకు క్రెడిట్ కార్డు హోల్డర్లకు అదనంగా 10 శాతం ఇన్‌స్టంట్ డిస్కౌంట్ లభిస్తుంది. అమెజాన్ ఐసీఐసీఐ క్రెడిట్ కార్డు హోల్డర్లకు 5 శాతం క్యాష్‌బ్యాక్ ఇవ్వనుంది. ప్రైమ్‌డే సేల్ 10వ ఎడిషన్ సందర్భంగా కొత్తగా ప్రైమ్ మెంబర్‌షిప్ తీసుకునే వారి కోసం ఆఫర్‌ను ప్రకటించింది. ప్రస్తుతం స్టాండర్డ్ ప్రైమ్ మెంబర్‌షిప్ ఏడాది ప్లాన్ ధర రూ.1499 ఉండగా.. రూ.999కి తగ్గించింది. ప్రైమ్ లైట్ సబ్‌స్క్రిప్షన్ రూ.799 నుంచి రూ.599కే అందిస్తోంది. కేవలం షాపింగ్ డిస్కౌంట్‌ల కోసం అందించే ఎడిషన్ ప్లాన్‌ను రూ.399 నుంచి రూ.299కి తగ్గించింది. త్వరగా ప్రొడక్ట్‌లను తెలుసుకునేందుకు ఏఐ టూల్స్‌నూ ఆఫర్ చేస్తోంది. కొనుగోలుదారులకు అమెజాన్ పే లేటర్ సదుపాయం కూడా అందిస్తోంది.

# కార్డెలియా ఐపీఓ..



23 నుంచి క్రూయిజెస్ ధరల శ్రేణి ఇదే

ముంబయి: చాలా రోజుల తర్వాత ఐపీఓ మార్కెట్‌లో మళ్లీ సందడి ప్రారంభం కాబోతోంది. ఎన్ఎస్ఈ, ఫోన్‌పే, రిలయన్స్ జియో వంటి పెద్ద పెద్ద కంపెనీలు ఐపీఓకు సన్నద్ధమవుతున్నాయి. ఈ క్రమంలోనే వాటర్ లీజర్ క్రూయిజ్ ఆపరేటర్ కార్డెలియా క్రూయిజెస్ సంస్థ రూ.585 కోట్లు సమీకరించేందుకు సిద్ధమవుతోంది. ఈ నెల 23న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమై 25న ముగుస్తుంది. ఇందులో భాగంగా ధరల శ్రేణిని రూ.769-808గా నిర్ణయించింది. ఒక్కో ఇన్వెస్టర్ కనీసం 18 ఈక్విటీ షేర్లను (లాట్) కొనుగోలు చేయాల్సి ఉంటుంది. గరిష్ఠ ధర వద్ద రూ.14,544 పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఫ్రెష్ ఇష్యూ ద్వారా నిధులు సమీకరిస్తున్నారు. ఇందులో రూ.480 కోట్లను తన అనుబంధ సంస్థ బే క్రూయిజ్ షిప్పింగ్ అండ్ లీజింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు డిపాజిట్/ అడ్వాన్స్ చెల్లింపులు చేయనుంది. మిగిలిన మొత్తాలను సాధారణ కార్పొరేట్ అవసరాలకు కంపెనీ వినియోగించనుంది.

79 శాతం మార్కెట్ వాటా

2025-26 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ.580 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. రూ.52 కోట్ల నికర లాభాన్ని నమోదుచేసింది. 2023-24లో ఏడాది రూ.444 కోట్ల ఆదాయాన్ని, రూ.123 కోట్ల నష్టాలను ప్రకటించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 79 శాతం మార్కెట్ వాటా కార్డెలియా క్రూయిజ్‌దేనని క్రిసిల్ పేర్కొంది. హంబన్‌తోట, ట్రింకోమలీ, జాఫ్నా (శ్రీలంక), ఫుకెట్ (థాయ్‌లాండ్), సింగపూర్, కౌలాలంపూర్, లాంగ్‌కావి (మలేసియా) వంటి ప్రదేశాలకు అంతర్జాతీయ ప్యాకేజీలను అందిస్తోంది. దేశీయంగా ముంబయి, గోవా, కొచ్చి, చెన్నై, లక్షద్వీప్, విశాఖపట్నం, పుదుచ్చేరి వంటి దేశీయ గమ్యస్థానాలకూ సేవలందిస్తోంది.

# జులై నుంచి కార్ల ధరలు పెంపు

## మారుతీ, టాటా బాటలోనే కియా..

డాలర్‌తో పోలిస్తే రూపాయి అస్థిరత, ముడిసరకు ధరలు భారంగా మారడంతో ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీలు ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నాయి. దీంతో తమ కార్ల ధరలను పెంచేస్తున్నాయి. ప్రముఖ కార్ల కంపెనీలైన మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, బీఎండబ్ల్యూ, హ్యూందాయ్ వంటివి ఇప్పటికే ధరలు పెంచుతున్నట్లు ప్రకటించాయి. తాజాగా ఆ జాబితాలోకి కియా కూడా చేరింది. జులై 1 నుంచి తన మోడళ్ల ధరను 2 శాతం వరకు పెంచుతున్నట్లు కంపెనీ ప్రకటించింది. ముడి సరకుల ఖర్చు, నిర్వహణ వ్యయం పెరగడమే ఇందుకు కారణంగా కంపెనీ పేర్కొంది. ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్ విద్యుత్ వాహన సెగ్మెంట్‌లోని మోడళ్లు, వేరియంట్‌ను బట్టి ఈ ధరల పెంపు ఉంటుందని కియా పేర్కొంది. పెరుగుతున్న తయారీ ఖర్చులను తగ్గించుకోవడానికి ఈ పెంపు అనివార్యంగా మారిందని తెలిపింది. పెద్ద మొత్తంలో భారాన్ని కంపెనీ భరిస్తూ.. వినియోగదారులపై ఆ ప్రభావం పడకుండా స్వల్ప మొతాదులోనే ధరల పెంపు చేపడుతున్నట్లు ప్రకటించింది. దేశీయంగా సెల్టోస్, సోనెట్, కరెన్స్, క్లావిస్, సైరోస్, కార్నివాల్‌తో పాటు ఇ౦6, ఇ౦9 మోడళ్లను కంపెనీ విక్రయిస్తోంది. టాటా మోటార్స్, బీఎండబ్ల్యూ ఇండియా, మెర్సిడెజ్ బెంజ్, నిస్సాన్ జులై నుంచి కార్ల ధరలు పెంచుతుండగా.. మారుతీ సుజుకీ జూన్ 1 నుంచే తన మోడళ్ల ధరలను రూ.30 వేల వరకు పెంచిన విషయం తెలిసిందే.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,45,800 | ₹ 1,59,060 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,95,000

# ఫోన్‌పే వాలెట్ ఇన్‌యాక్టివ్‌లో ఉంటే 'ఛార్జ్'!

**న్యూఢిల్లీ:** ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పేపై ప్రస్తుతం నెట్టింట చర్చ జరుగుతోంది. ఏడాది పాటు ఎలాంటి లావాదేవీలూ జరపని వాలెట్‌లపై ఛార్జీలు వసూలు చేస్తా మంటూ ఆ సంస్థ వినియోగదారులకు సందేశాలు పంపిస్తోంది. దీనిపై యూజర్లు భగ్గుమంటున్నారు. వాలెట్ ఉండడమే నేరమా అంటూ ప్రశ్నిస్తున్నారు. తమకు ఫోన్‌పే నుంచి వచ్చిన సందేశాలను సామాజిక వేదికగా పోస్ట్ చేస్తున్నారు. ఏడాది పాటు ఎలాంటి డిజిటల్ చెల్లింపులు చేయని ఫోన్‌పే వాలెట్‌లపై ఛార్జీలు వసూలుచేస్తామని ఫోన్‌పే సందేశాలు పంపిస్తోంది. వీటిని ఇనాక్టివేట్ వాలెట్‌గా పరిగణించి నిర్వహణ ఛార్జీల పేరిట 3 నెలలకు రూ.100 చొప్పున వసూలు చేస్తామని అందులో పేర్కొంది. ఛార్జీల విషయాన్ని కంపెనీ తన టర్మ్స్ అండ్ కండిషన్స్‌లోనూ తెలిపింది. అయితే, మూడు నెలలకోసారి ఫీజు వసూలుచేస్తామని వెల్లడించినప్పటికీ.. ఎంతనేది అందులో పేర్కొనలేదు. 15 రోజుల ముందుగానే యూజర్లకు నోటిఫికేషన్ అలర్ట్ జారీ చేస్తున్నామని, ఈలోపు వాలెట్ యాక్టివేట్ చేసుకుంటే అదనపు రుసుముల భారం తప్పుతుందని తెలిపింది. యాప్ వాడినంత మాత్రాన వాలెట్ యాక్టివేట్‌లో ఉన్నట్లు కాదని పేర్కొంది. వసూలు చేసిన ఛార్జీలను కంపెనీ కార్యకలపాలకు వినియోగిస్తామని పేర్కొంది. మెసేజ్‌లకు వాట్సప్ ఎలా మారిందో చెల్లింపులకు ఫోన్‌పే అలా నిత్యజీవితంలో భాగమైపోయింది. ఇందులో యూపీఐ లావాదేవీలు చేసే వారే అధికం. కొందరైతే ఫోన్‌పేలో యూపీఐ లైట్‌ను వాలెట్‌లా వినియోగిస్తుంటారు. దీంతో వాలెట్‌లు వాడే వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందనే చెప్పాలి. కొందరికైతే చివరిసారిగా ఎప్పుడు వాడేమో కూడా తెలీడం లేదు. అలాంటి వాడనంత మాత్రన ఛార్జీలు వసూలుచేయడం దోపిడీనే అవుతుందని విమర్శిస్తున్నారు.

# బంగారానికి కస్టమ్స్ షాక్..

## 70 శాతం తగ్గిన దిగుమతులు



**దిల్లీ:** దేశంలో బంగారం దిగుమతులు భారీగా తగ్గుముఖం పట్టాయి. పసిడిపై కస్టమ్స్ సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం దాదాపు రెట్టింపు చేసిన నేపథ్యంలో దిగుమతులు 70 శాతం మేర క్షీణించాయి. కేవలం 25-30 టన్నులు మాత్రమే దిగుమతి అయినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. మే 13న బంగారం, వెండిపై 6 శాతంగా ఉన్న దిగుమతి సుంకాన్ని 15 శాతానికి కేంద్రం పెంచిన నేపథ్యంలో దిగుమతులు ఈ స్థాయిలో తగ్గడం గమనార్హం. "సుంకం పెంచిన గత నెల రోజుల్లో 25-30 టన్నుల బంగారం మాత్రమే దిగుమతి అయ్యింది. అంతకుముందు ఈ మొత్తం 75-100 టన్నులుగా ఉండేది" అని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. విలువపరంగా చూసినప్పుడు మే నెలలో పసిడి దిగుమతుల బిల్లు 34 శాతం పెరిగి 3.41 బిలియన్ డాలర్లకు చేరింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది బంగారం ధరలు భారీగా పెరగడమే దీనికి కారణం. ఈ ఏడాది ఏప్రిల్- మే మధ్య బంగారం దిగుమతుల విలువ ఏకంగా 60.14 శాతం పెరిగి 9.04 బిలియన్ డాలర్లకు చేరింది. ఈనేపథ్యంలో దిగుమతుల బిల్లు తగ్గించుకోవడం, విదేశీ మారక ద్రవ్యాన్ని కాపాడుకోవడంలో భాగంగా బంగారం కొనుగోళ్లను తగ్గించాలని ప్రధాని మోదీ పౌరులకు విజ్ఞప్తి చేశారు. ఆపై కొనుగోళ్లను నిరాశ పరిచేందుకు సుంకాలనూ కేంద్రం పెంచడంతో దిగుమతులు తగ్గాయి. చైనా తర్వాత అత్యధికంగా బంగారాన్ని దిగుమతి చేసుకునే దేశాల్లో రెండో స్థానంలో ఉన్న భారత్.. 2025-26 పూర్తి ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 71.98 బిలియన్ డాలర్ల విలువైన 721.03 టన్నుల బంగారాన్ని దిగుమతి చేసుకుంది.

# అది సిగ్గుచేటు

## ఐరోపా మిత్రదేశాలపై అమెరికా ఫైర్!

**వాషింగ్టన్:** ఐరోపాలోని నాటో మిత్రదేశాలపై అమెరికా రక్షణశాఖ మంత్రి పీట్ హెగ్సెత్ విరుచుకుపడ్డారు. ఇరాన్‌పై దాడులు చేసేందుకు ఐరోపాలోని స్థావరాలను వినియోగించుకునేందుకు అమెరికాకు అనుమతించలేదని మండిపడ్డారు. తద్వారా అనేకమంది అమెరికన్ల ప్రాణాలను ప్రమాదంలో పడేశాయని ఆరోపించారు. ఇది చాలా సిగ్గుచేటు అని విమర్శించారు. బ్రస్సెల్స్ వేదికగా నాటో సభ్యదేశాల రక్షణశాఖ మంత్రులతో సమావేశమైన సందర్భంగా ఆయన ఈ మేరకు మాట్లాడారు. ఈ క్రమంలోనే ఐరోపాలోని అమెరికా దళాలపై ఆరు నెలల రివ్యూ ప్రోగ్రామ్‌ను హెగ్సెత్ ప్రకటించారు. ఐరోపా దేశాలు తమ సొంత భద్రతకు ఎంత వేగంగా చర్యలు తీసుకుంటాయనే దానిపై రివ్యూ ఫలితం ఆధారపడి ఉంటుందన్నారు. "మేం సీరియస్‌గా సమీక్ష చేస్తాం. ఐరోపా రక్షణకు అక్కడి దేశాలే ప్రాథమిక బాధ్యత వహించడానికి ముందుకు వచ్చేలా చూడటానికే ఈ ప్రోగ్రామ్‌ను రూపొందించాం" అని తెలిపారు. హర్మూజ్‌ను తెరిపించేందుకు కలిసి రావాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో చేసిన విజ్ఞప్తిని ఐరోపా దేశాలు పట్టించుకోలేదు. దాంతో ఆగ్రహానికి గురైన ఆయన.. నాటో నుంచి వైదొలిగే యోచనలో ఉన్నామని పలుమార్లు ప్రకటించారు. నాటో కూటమికి అందిస్తోన్న సాయాన్ని కత్తిరించేందుకు ట్రంప్ యంత్రాంగం ప్రతిపాదనలు చేస్తోంది. ఐరోపాలో నాటో కార్యకలాపాల కోసం అందుబాటులో ఉంచిన విమానాలు, యుద్ధనౌకలను తగ్గించాలని యోచిస్తున్నట్లు సమాచారం.




# పకడ్బందీగా నీట్ రీ టెస్ట్

వదంతులను, సోషల్ మీడియా వేదికగా జరిగే దుష్ప్రచారాన్ని నమ్మొద్దని 'ఎక్స్' వేదికగా సందేశం విడుదల చేసింది. ఎన్‌టీఏ నుంచి వచ్చే అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని తెలిపింది. మరోవైపు.. పరీక్ష నిర్వహణపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అభ్యర్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే మే 3నాటి పరీక్షను రద్దు చేశాం. ఈ వ్యవహారం నుంచి పాఠాలు నేర్చుకుని పరీక్షా ప్రక్రియను మరింత బలోపేతం చేశాం. సంబంధిత మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, భద్రతా సంస్థల సమన్వయంతో పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేశాం. పటిష్ఠమైన, బహుళ అంచెల భద్రతా చర్యలు తీసుకుంటున్నాం. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. పరీక్ష సంబంధిత ఒత్తిడిని ఎదుర్కొంటున్న విద్యార్థులు 'మానస్' మానసిక ఆరోగ్య హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించి సాయం కోరవచ్చని ఎన్‌టీఏ సూచించింది.




పరీక్షకు ఇంకా మూడు రోజులే మిగిలి ఉన్నాయి. ఇప్పటికే సిద్ధమయ్యారు.. కాబట్టి అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడంపైనే దృష్టి పెట్టండి. ప్రశాంతంగా ఉండండి. బాగా విశ్రాంతి తీసుకోండి. మీ నుంచి ఇదే కోరుకుంటున్నాం అని అభ్యర్థులను ఉద్దేశించి ఎన్‌టీఏ పేర్కొంది. తల్లిదండ్రులు, అధ్యాపకులు కూడా.. విద్యార్థులను ప్రశాంతంగా ఉంచాలని, ధ్రువీకరించని సమాచారాన్ని వారితో షేర్ చేసుకోవద్దని విజ్ఞప్తి చేసింది. వారు స్థిరమైన మనసుతో, నిశ్చింతగా పరీక్షకు వెళ్లేలా చూడాలని సూచించింది. పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో మే 3నాటి నీట్-యూజీ పరీక్ష రద్దయిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది.

**తెలంగాణలోనూ 'నీట్' విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం**

తెలంగాణలోనూ నీట్ యూజీ పరీక్ష రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. జూన్ 21న నీట్ రీ-ఎగ్జామ్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. విద్యార్థులు హాల్ టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఇప్పటికే ఏపీలో నీట్ విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే.

# ఈపీఎఫ్ వడ్డీకి కేంద్రం ఆమోదం

## ఈ నెలలోనే జమ



దిల్లీ: ఈపీఎఫ్ చందాదారులకు గుడ్‌న్యూస్. లక్షలాది మంది ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఈపీఎఫ్ వార్షిక వడ్డీ ఈ నెలలోనే జమ కానుంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సెంట్రల్ బోర్డు ఆఫ్ ట్రస్టీస్ ప్రతిపాదించిన 8.25 శాతం వడ్డీకి కేంద్ర ఆర్థికశాఖ తాజాగా ఆమోదం తెలిపింది. 2025-26 సంవత్సరానికి గాను ఖాతాదారులకు 8.25 శాతం వార్షిక వడ్డీ అందించాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సీబీటీ) మార్చి 2న చేసిన సిఫార్సులను యథాతథంగా ఆమోదించింది. వరుసగా మూడో ఏడాదీ ఇదే వడ్డీ రేటు కొనసాగుతోంది. సాధారణంగా సీబీటీ సిఫార్సు చేసిన వడ్డీని ఆర్థిక మంత్రిత్వశాఖ నోటిఫై చేయాల్సివస్తుంది. గతేడాది మే 24న వడ్డీని కేంద్రం నోటిఫై చేయగా.. ఈ ఏడాది దాదాపు నెల రోజులు ఆలస్యంగా ఆమోదం తెలపడం గమనార్హం. అయితే, ఈ నెలాఖరులోగా పీఎఫ్ ఖాతాలకు వడ్డీ జమయ్యే అవకాశం ఉందని సంబంధితవర్గాలు తెలిపాయి. గతంలో కేంద్రం ఆమోదం తెలిపిన తర్వాత కూడా వడ్డీ జమ అవడానికి మరికొన్ని రోజులు సమయం పట్టేది. కొత్త ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేసిన నేపథ్యంలో చందాదారుల ఖాతాల్లో వెంటనే నిధులు జమయ్యే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. గత ఆర్థిక సంవత్సరానికి కేంద్రం ఇప్పుడు వడ్డీ జమ చేస్తోంది. కానీ ఆర్థిక సంవత్సరం ముగిసి మూడు నెలలు కావొస్తోంది. ఈ ఆలస్యం వల్ల ఆ మేర చక్రవడ్డీ ప్రయోజనం కోల్పోతామన్న ఆందోళన కొందరు చందాదారుల్లో నెలకొంది. కానీ, అలాంటి భయాలేవీ అక్కర్లేదంటోంది భవిష్య నిధి సంస్థ. ఈపీఎఫ్ నిల్వలపై ఆర్థిక సంవత్సరం మొదటి తేదీ నుంచి ఆ ఏడాది చివరి తేదీ వరకు ఏ నెలకు ఆ నెల వడ్డీని గణిస్తారు. నెలనెలా లెక్కించినప్పటికీ వడ్డీ మాత్రం ఏడాది చివర్లోనే జమ చేస్తారు. ఒకవేళ విత్‌డ్రాలు ఉంటే ఆ మేర వడ్డీ తగ్గుతుంది. అలాగే, నిలిచిపోయిన ఖాతాలకు ఈపీఎఫ్ఓ ఎలాంటి వడ్డీ చెల్లించదు. కాబట్టి వడ్డీ ఖాతాలో జమ ఆలస్యం అయినా చక్రవడ్డీ ప్రయోజనానికి ఎలాంటి ఢోకా ఉండదు. 2015-16 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా 8.8 శాతం వడ్డీ చెల్లించారు. 2018-19లో అది 8.65 శాతానికి, 2019-20 ఆర్థిక సంవత్సరంలో 8.50 శాతానికి తగ్గించారు. 2020-21లో కేవలం 8.10 శాతం మాత్రమే వడ్డీ చెల్లించారు. ఇటీవల కాలంలో ఇదే అత్యల్పం. 2022-23లో మళ్లీ 8.15 శాతానికి పెంచారు. ఆ మరుసటి ఏడాది నుంచి గత మూడేళ్లుగా 8.25 శాతం చొప్పున వడ్డీ చెల్లిస్తున్నారు.

# సీసీటీవీ దృశ్యాలు తారుమారు..!


ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్ల కోసం దాదాపు రూ.10 కోట్లు ఖర్చు చేశారు. ఇంత ఖర్చు చేసినప్పటికీ.. విరాళాల పెట్టెల నుంచి నగదు, ఆభరణాలు చోరీకి గురవడం.. భద్రతా వ్యవస్థపై తీవ్ర ఆందోళన రేకెత్తించాయి. దర్యాప్తులోభాగంగా.. ఆలయంలోని నిఘా వ్యవస్థలు, రికార్డయిన సీసీటీవీ దృశ్యాలు, భద్రత నిర్వహణ నియమాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ నేపథ్యంలో సీసీటీవీ కెమెరాలను తారుమారు చేశారనే క్లూస్‌ను కనుగొన్నారు. దీంతో ఆలయ భద్రతా వ్యవస్థలోని వివిధ స్థాయిలలో ఏమైనా లోపాలు ఉన్నాయా..? వారి హస్తం ఏమైనా ఉందా అనే కోణంలోనూ దర్యాప్తు చేపట్టారు. నిఘా, భద్రతా నిర్వహణకు సంబంధించి కొంతమంది సిబ్బంది సర్వీస్ రికార్డులు.. ఇతర వివరాలను కూడా సేకరిస్తున్నారు. విరాళాల లెక్కింపు ప్రక్రియలో బ్యాంకు పాత్రను కూడా సిట్ పరిశీలిస్తుంది. ఈ ప్రక్రియలో బ్యాంకు సిబ్బందితో పోలిస్తే.. ట్రస్ట్ ఉద్యోగుల సంఖ్య పరిమితంగా ఉన్నట్లు సమాచారం. దీంతో లెక్కింపుల సమయంలో ఏమైనా నిర్లక్ష్యం జరిగిందా అనే కోణంలో పరిశీలిస్తున్నారు. విచారణ కోసం దాదాపు 200 మందితో సిట్ జాబితాను సిద్ధం చేయగా.. ఇందులో ఇప్పటికే 125 మందికి పైగా వ్యక్తులను విచారించింది. ఇక, కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న రామ్‌శంకర్ అలియాస్ తినూ యాదవ్ అనే వ్యక్తిని పలు గంటల పాటు సిట్ అధికారులు ప్రశ్నించారు.



# ఐఫోన్ ధరల పెంపు తప్పదు

## యాపిల్ సీఈఓ టిమ్ కుక్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాకతో మెమొరీ చిప్‌లకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. దీంతో ఇటీవల కాలంలో వీటి ధరలకు రెక్కలొచ్చాయి. ఆ ప్రభావం స్మార్ట్‌ఫోన్ల తయారీపై పడింది. రానున్న రోజుల్లో ఐఫోన్ల ధరల పెంపు తప్పేలా లేదని యాపిల్ (౦జూజూశ్రీవ) సీఈఓ టిమ్‌కుక్ వెల్లడించారు. మెమొరీ చిప్‌ల కొరత కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. "డేటా సెంటర్లు, ఏఐ సర్వర్లకు వినియోగించే అధునాతన మెమొరీ, స్టోరేజ్ విడిభాగాల తయారీకే సరఫరాదారులు ప్రాధాన్యమిస్తున్నారు. దీంతో స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్లు, పర్సనల్ కంప్యూటర్లు వంటి కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్‌కు ఉపయోగించే సాధారణ మెమొరీ చిప్‌లకు కొరత ఏర్పడింది. ఫలితంగా వాటి ధరలు భారీగా పెరిగాయి. ఈ భారాన్ని వినియోగదారులపై వేయకుండా ఉండేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం. కానీ, ఈ పరిస్థితిని సుదీర్ఘకాలం కొనసాగించడం కష్టం. అందువల్ల మా ఉత్పత్తుల ధరలను సవరించడం అనివార్యంగా మారింది. ఐఫోన్లు, ఐప్యాడ్‌లు, మ్యాక్ ధరలు పెరగొచ్చు" అని ఓ ఇంటర్వ్యూలో టిమ్ కుక్ వెల్లడించారు. అయితే, ఏయే మోడళ్లపై ఈ ప్రభావం ఉంటుంది.. ఎంత మేర ధరలు పెరుగుతాయనే వివరాలపై టిమ్ కుక్ స్పష్టతనివ్వలేదు. కాగా.. ఈ ఏడాది సెప్టెంబరులో యాపిల్ తన తొలి ఫోల్డబుల్ ఫోన్‌ను విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. దీంతోపాటు ఐఫోన్ 18 ప్రో, 18 ప్రో మ్యాక్స్ వెర్షన్లు కూడా మార్కెట్లోకి రానున్నాయి. ఒకవేళ ధరలపై యాపిల్ నిర్ణయం తీసుకుంటే.. ఈ మోడళ్లు మరింత ప్రియమయ్యే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా.. ఈ ఏడాది స్మార్ట్‌ఫోన్, పీసీల ధరలు 15శాతం వరకు పెరిగే అవకాశం ఉందని మోర్గాన్ స్టాన్లీ అంచనా వేసింది.




**రెండో షోకాజ్.. ఇన్నాళ్లూ ఏంచేశారు?**

తాజా నోటీసుతో నారాయణ కళాశాల అక్రమాలపై ఇంటర్మీడియట్ శాఖ రెండోసారి షోకాజ్ జారీ చేసినట్లయింది. అయితే ఇక్కడే అసలు ప్రశ్న తలెత్తుతోంది. ఒకసారి నోటీస్ ఇచ్చినా బేఖాతరు చేస్తూ, అడ్డగోలుగా అడ్మిషన్లు సాగిస్తున్నా అధికారులు ఇన్నాళ్లూ ఎందుకు కిమ్మనకుండా ఉన్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చర్యలు తీసుకోరా..? అంటూ ఆధారాలతో సహా నిలదీసే వరకు ఉన్నతాధికారుల్లో చలనం రాకపోవడం వెనుక ఉన్న 'అదృశ్య హస్తాలు' ఎవరివనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# దిగొచ్చిన యంత్రాంగం

- అనుమతులు లేకుండా అడ్మిషన్లు.. నారాయణ మార్క్ అరాచకం
- ఖమ్మం నడిబొడ్డున అనధికారిక జూనియర్ కళాశాల సామ్రాజ్యం
- 'జనంసాక్షి' ఎక్స్‌పోజ్‌తో విద్యాశాఖ ఎట్టకేలకు నిద్రలేచింది
- రెండో షోకాజ్ నోటీసు.. ఇన్నాళ్లు ఏం చేశారు?
- విచ్చలవిడిగా డబ్బులు వసూలు.. అధికారుల నిద్రమత్తు ఎందుకు?

**ఖమ్మం బ్యూరో, (జనంసాక్షి) :**
అడ్డగోలు అనుమతులు.. అంతకుమించిన లీలలు.. విద్యా వ్యాపారంలో 'నారాయణ' మార్క్ అరాచకానికి ఖమ్మం నడిబొడ్డున ఎట్టకేలకు బ్రేక్ పడింది.. నిబంధనలను తుంగలో తొక్కి, వైరా రోడ్డు పక్కన దర్జాగా వెలసిన అనధికారిక జూనియర్ కళాశాల సామ్రాజ్యంపై 'జనంసాక్షి' దినపత్రిక సంధించిన అక్షర యుద్ధం గమ్యాన్ని తాకింది. ఇన్నాళ్లు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిన ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఎట్టకేలకు నిద్ర లేచింది. గురువారం సాయంత్రం సదరు కాలేజీ గుమ్మం ముందు నిలబడి విద్యాశాఖ సిబ్బంది షోకాజ్ నోటీస్ చేతిలో పెట్టడం ఇప్పుడు ఖమ్మం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ విషయాన్ని జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి రవిబాబు స్వయంగా ధృవీకరించారు.

**గురువారం సాయంత్రం హైడ్రామా**
జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి రవిబాబు స్వయంగా రంగంలోకి దిగి ఈ అక్రమ బ్రాంచ్ ఉదంతాన్ని ధృవీకరించారు. 'జనంసాక్షి'లో వచ్చిన కథనాలు జిల్లావ్యాప్తంగా సంచలనం సృష్టించడంతో, గురువారం సాయం త్రం అత్యవసరంగా సిబ్బందిని పంపి షోకాజ్ నోటీసు అందజేశారు.
నోటీసులు ఇవ్వడం సరే.. మరి తదుపరి యాక్షన్ ఏది? కార్పొరేట్ విద్యాసంస్థల మేనేజ్‌మెంట్లు ఇలాంటి షోకాజ్ నోటీసులను లైట్ తీసుకుని, కోర్టుల నుంచో లేదా పైస్థాయి రాజకీయ ఒత్తిళ్లతోనో కాలయాపన చేయడం పరిపాటిగా మారింది. మరి ఈ రెండో షోకాజ్ నోటీసుతోనైనా అధికారులు ఆ అనధికారిక బ్రాంచ్‌ను సీజ్ చేస్తారా లేక 'నోటీసు ఇచ్చాం.. చేతులు దులుపుకున్నాం' అన్నట్లుగా వ్యవహరిస్తారా అనేది వేచి చూడాలి.

# డీర్ పార్కులో ఘనంగా వన మహోత్సవం

- మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, మేయర్, నగరపాలక సంస్థ కమిషనర్.



**కరీంనగర్ బ్యూరో, జూన్ 18 (జనంసాక్షి) :**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపుమేరకు కరీంనగర్ నగరంలోని డీర్ పార్కులో బుధవారం సాయంత్రం ఘనంగా వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అడిషనల్ కలెక్టర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడేతో పాటు పలువురు అధికారులు మొక్కలు నాటారు. రాష్ట్ర ప్రభుత్వం, అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, మహిళలు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, భావితరాలకు పచ్చని తెలంగాణను అందించాలంటే మొక్కల పెంపకాన్ని ప్రజా ఉద్యమంగా చేపట్టాలని అధికారులు పిలుపునిచ్చారు. అనంతరం హైదరాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగాన్ని డీర్ పార్కులో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, అధికారులు తిలకించారు. అంతకుముందు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ముఖ్యమంత్రి సభను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో షర్మిల, మెప్మా పీడీ స్వరూపారాణి, డీఆర్‌డీఓ గీత, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, కరీంనగర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ షౌకత్ హుస్సేన్, స్ట్రైక్ ఫోర్స్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ షౌకత్ అలీతో పాటు పలువురు అటవీశాఖ అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### 2010 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులకు
# 'టెట్' నుండి మినహాయింపు ఇవ్వాలి

**రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో డీఆర్వోకు 'తపస్ అధ్వర్యంలో వినతిపత్రంఅందజేత**



**ఇబ్రహీంపట్నం,జూన్ 18 (జనం సాక్షి) :** 23 ఆగస్టు 2010 కంటే ముందు నియమితు లైన ఉపాధ్యాయులందరికీ ఆర్డినెన్స్ లేదా రాజ్యాంగ సవరణ ద్వారా టెట్ పరీక్ష నుండి శాశ్వత మినహాయింపు ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం చట్టం తేవాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర సంఘటన కార్యదర్శి కానుగంటి హనుమంతరావు, సంఘం బాధ్యులు సూరం విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. తపస్' రాష్ట్ర శాఖ పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి కె. అనంత రెడ్డిని బుధవారం ఉపాధ్యాయ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాల యం ద్వారా ప్రధానమంత్రికి, కేంద్ర విద్యా శాఖ మంత్రికి, మరియు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రికి పంపే వినతి పత్రాన్ని డీఆర్వోకు సమర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ నేతలు మాట్లాడుతూ.. సుదీర్ఘ కాలంగా విద్యావ్యవస్థకు సేవలందిస్తున్న సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ నిబంధన నుండి మినహాయింపు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో 'తపస్' రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోట్ల కాశీ రావు, పూజారి రమేష్, రాష్ట్ర బాధ్యులు శ్రీహరి, కృష్ణ, యుగంధర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కాలే శ్రీశైలం, జిల్లా కార్యదర్శి పట్నం కృష్ణ, మరియు వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, బాలరాజు గౌడ్, సత్యనారాయణ, ప్రవీణ్ కుమార్, రాజు, లక్ష్మీ కాంత్ రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



### అర్హులైన ప్రతి పేద కుటుంబానికి
# ఇందిరమ్మ ఇల్లు అందేలా చూస్తాం

**ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**

**యాలాల జూన్ 18 (జనంసాక్షి) :** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా చూస్తామనిఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నూతనంగా నిర్మించిన గృహాలకు గురువారం పండుగ వాతావరణం నెలకొంది. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి యాలాల్, బషీరాబాద్ మండలాల్లో పర్యటించి లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. యాలాల్ మండలం విశ్వనాథ్ పూర్ గ్రామంలో ఉమాదేవి–గోపాల్ దంపతుల ఇందిరమ్మ ఇల్లు, గోరేపల్లి గ్రామంలో మరో లబ్ధిదారుని నూతన గృహం. బషీరాబాద్ మండ లం ధామర్ చెడ్ గ్రామంలో మెతుకు పెంటమ్మ ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ పూజ. ఎమ్మెల్యే లబ్ధిదారులకు పూజా కార్యక్రమాల్లో పాల్గొని, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కొత్తింట్లో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సొంతింటి కల నెరవేరింది. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిలకు ఎల్లప్పుడూ రుణ పడి ఉంటాం" అంటూ లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్లతో పేదల ఆత్మగౌరవం పెరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. "అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా చూస్తాం. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ హామీ" అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి

- వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి
- పూర్వ ప్రాథమిక పాఠశాల,జిపి భవన నిర్మాణానికి భూమిపూజ



**బొంరాస్ పేట, జూన్ 18 (జనం సాక్షి):** గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నట్లు వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని టేకులగడ్డ తండాలో స్థానిక సర్పంచ్ లక్ష్మీ, రాష్ట్ర ఉపాధి హామీ కౌన్సిల్ సభ్యులు నర్సింలు గౌడ్ తో కలిసి పూర్వ ప్రాథమిక పాఠశాల, గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ రెడ్డి విద్యార్థులకు మెరుగైన ప్రశాంత వాతావరణంలో విద్యా కల్పించేందుకు నూతన భవనాలను నిర్మించడం జరుగుతుందన్నారు. అనంతరం నర్సింలు గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్య మౌలిక సదుపాయాలను కల్పిస్తూ విద్యకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ జయకృష్ణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్, పంచాయతీరాజ్ ఏఈ సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు అంజిల్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేశం, తండావాసులు పాల్గొన్నారు.

### యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్
# పాఠశాల నిర్మాణ పనుల పరిశీలన

**పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు : ఎమ్మెల్యే కసిరెడ్డి**



**తలకొండపల్లి జూన్ 18(జనంసాక్షి):** కల్వకుర్తి నియోజకవర్గంలోని తలకొండపల్లి మండలం ఖానాపూర్ రెవెన్యూ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గురువారం ప్రత్యక్షంగా పరిశీలించారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలో నూతనంగా నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల కోసం కేటాయించిన స్థలంలో జరుగుతున్న పనులను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాంగణంలో జరుగుతున్న గుట్ట తొలగింపు, లెవెలింగ్ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల నిర్మాణానికి సంబంధించిన మ్యాప్ ద్వారా భవనాల రూపకల్పన, విభాగాల వారీగా ఏర్పాటు చేయనున్న సదుపాయాలపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు అందించనున్న తరగతి గదులు, లైబ్రరీలు, బ్లాక్ రహదారులు, ఇతర మౌలిక వసతుల ఏర్పాటుపై వివరాలు తెలుసుకున్నారు. నిర్మాణ పనులు నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తి అయ్యేలా వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి అధికారులకు ఆదేశించారు. అవసరమైతే అదనపు సిబ్బంది, యంత్ర సామగ్రి ఏర్పాటు చేసి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పనుల నాణ్యతపై ఎటువంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అత్యుత్తమ సౌకర్యాలతో పాఠశాల నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని సర్వసన్నద్ధం

- శేరిలింగంపల్లి సమస్యల పరిష్కారానికి అధికారులు సహకరించాలి
- డ్రైనేజీ, మంచినీరు, వాటర్ లాగింగ్‌పై ప్రత్యేక దృష్టి
- అక్రమ నిర్మాణాలు తొలగించి, నాళాలు ప్రక్షాళన చేయాలి
- ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



**శేరిలింగంపల్లి, జూన్ 18 (జనంసాక్షి):** నియోజకవర్గం పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు సహకరించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రజాబద్దల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లిలో నెలకొన్న సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై జలమండలి ఈడి సంతోష్ రెడ్డి, డైరెక్టర్ నారాయణ తదితరులతో గురువారం ఆయన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ శేర్లింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పని కాలనీలు, పరిసర ప్రాంతాల ప్రజల నుండి అందిన వినతి పత్రాల నేపథ్యంలో వాటిని పరిగణలోకి తీసుకొని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.
వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, సమిష్టి కృషితో ప్రజలకు ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సర్వసన్నద్ధంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రతి ఫిర్యాదుపై స్పందించాలని, ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలని, ప్రజా సంక్షేమమే పాలకులకైనా, అధికారులకైనా ప్రథమ కర్తవ్యమన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందించాలని, ఎక్కడికక్కడ నీటి కాలుష్యాన్ని యుద్ధ ప్రాతిపదికన అరికట్టాలని, నీటి వల్లనే అనేక వ్యాధులు విస్తరించే అవకాశం ఉన్నందున నీటి సరఫరా విషయంలో అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టిని సాధించాలని, మురుగునీరు ఎక్కడ పొంగి పొర్లకుండా చూడాలని, పైప్ లైన్ వ్యవస్థ పాడైన చోట కొత్త లైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరమున్నచోట కొత్త ప్రతిపాదనలు తీసుకోవాలని, పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, కొత్తగా చేపట్టాల్సిన యూజీడీ పైప్ లైన్ మరియు మంచి నీటి పైప్ లైన్ కొరకు ప్రతిపాదనలు పంపించాలని అధికారులకు సూచించారు.
పనులు ప్రాధాన్యతా క్రమాన్ని గుర్తించి వాటిని పూర్తి చేయడం ద్వారా అధికారుల విషయంలో ప్రజలకు మంచి అభిప్రాయాన్ని పెంపొందించాల్సిన అవసరాన్ని అధికారులు గుర్తుంచుకోవాలని అరికెపూడి గాంధీ పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్లు శ్రీకృష్ణ, హరిశంకర్, మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్, జలమండలి అధికారులు డిజిఎం శ్రీమన్నారాయణ, శ్రీనివాసరాజు, నరేందర్, శ్రీహరి, మేనేజర్లు సందీప్, విక్రమ్ రెడ్డి, సలోమీ, ప్రియాంక, అనిల్ మరియు తదితరులు పాల్గొన్నారు.

### ప్రవేట్ పాఠశాలను ప్రారంభించిన ప్రజా ప్రతినిధులు.

**భాష్యం ప్రైవేట్ పాఠశాలకు రిబ్బెన కట్ చేసిన ఎమ్మెల్యే శంకర్**

**జిల్లేడు చౌదరి గూడెం (జనంసాక్షి) :**
ప్రైవేటు పాఠశాలకు రిబ్బెన కట్ చేసిన ప్రజా ప్రతినిధులు జిల్లేడు చౌదరిగుడా మండల పరిధి లాల్ పాడు సమీపంలో ఉన్న భాష్యం ప్రైవేటు పాఠశాలకు ఎమ్మెల్యే శంకరయ్య. మాజీ ఎమ్మెల్యే అంజయ్యాయాదవ్. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి లు రిబ్బన కట్ చేసి పాఠశాలను తెరిచారు.
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలని కోరుతుంటే ఒకపక్క ప్రజా ప్రతినిధులు ప్రవేట్ పాఠశాలలకు తోడుగా ఉంటున్నారు.

### పాఠశాల బస్సులో ప్రయాణిస్తున్న
# విద్యార్థుల జాబితా తప్పనిసరి

- పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్లే అక్కడికక్కడే బస్సులు సీజ్
- జిల్లా రవాణా శాఖ అధికారులు



**మహబూబ్ నగర్ బ్యూరో జూన్ 18 (జనంసాక్షి) :**
విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రవాణా శాఖ పాఠశాల బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలను ముమ్మరం చేసింది. ఇప్పటికే పాఠశాలలు ప్రారంభమవ్వడంతో నిబంధనలు పాటించని, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని బస్సులపై అధికారులు కొరడా జులిపించనున్నారు. మోటారు వాహనాల చట్టం–1988 మరియు కేంద్ర మోటారు వాహన నియమావళి అమలకు క్షణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న 6 బస్సులను రవాణ శాఖ అధికారులు సీజ్ చేశారు.
పాఠశాలలు పునఃప్రారంభంకు ముందే బస్సులకు కావాల్సిన మరమ్మత్తులు చేపించి వాటికి అవసరమైన ఫిట్‌నెస్ సర్టిఫికెట్, బీమా, కాలుష్య నియంత్రణ పత్రాలతో పాటు, ప్రథమ చికిత్స పెట్టె, అగ్నిమాపక పరికరాలు, అత్యవసర ద్వారాలు (ఎమర్జెన్సీ ఎగ్జిట్స్), అత్యవసర పరిస్థితుల్లో అద్దలు పగులగొట్టేందుకు సుత్తె వంటి పరికరాలను పొందుపరచాల్సిన అవసరం ఉంది. 60 ఏళ్లపై బడిన డ్రైవర్లు పాఠశాల బస్సులను నడిపేందుకు అనర్హత ఉండటంతో లైసెన్సులను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. సుప్రీంకోర్టు నిర్దేశించిన రవాణా మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని, ప్రతి బస్సులో విధిగా వేగ నియంత్రణ పరికరాలు (స్పీడ్ గవర్నర్స్), జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్, సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడం వల్ల పిల్లల కదలికలను నిరంతరం పర్యవేక్షించవచ్చు పేర్కొంటున్నారు.
ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా నడుస్తున్న వాహనాలు లేదా సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలిస్తున్న బస్సులను వెంటనే సీజ్ చేస్తామని రవాణా శాఖ అదికారులు హెచ్చరిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన డ్రైవర్లపై మాత్రమే కాకుండా సంబంధిత విద్యాసంస్థల యాజమాన్యాలపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంటున్నారు. విద్యార్థుల భద్రత విషయంలో యాజమాన్యాలదే పూర్తి బాధ్యత తీసుకోవాలని అదికారులు స్పష్టం చేస్తున్నారు. ఫిట్‌నెస్ లేని బస్సుల్లో పిల్లలను పంపవద్దని తల్లిదండ్రులకు సూచిస్తున్నారు.
పాఠశాల బస్సులో ప్రయాణించే విద్యార్థుల భద్రత రవాణా శాఖ, యాజమాన్యాల బాధ్యత మాత్రమే కాదని.. ఇందులో తల్లిదండ్రుల పాత్ర కూడా ఎంతో కీలకం అంటున్నారు. ప్రతి రోజు విద్యార్థులను బస్సు ఎక్కించే క్రమంలో బస్సు కండిషన్, డ్రైవర్లపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**నరసింహ స్వామి, మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్, మహబూబ్‌నగర్**
మహబూబ్‌నగర్ జిల్లాలో 499 బస్సులకు గాను ఇప్పటి వరకు 469 బస్సులకు తనిఖీలు పూర్తయ్యాయి. ఇంకా 30 బస్సులు పెండింగ్‌లో ఉన్నాయి.. ఆ బస్సుల ఫిట్‌నెస్ పూర్తి చేసుకునేందుకు మరో రెండు రోజుల సమయం ఇచ్చామని.. అనంతరం వాటి చిరునామాల ఆదారంగా బస్సుల పరిస్థితి పరిశీలించి నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా పాఠశాల బస్సులు పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్నారని తమ దృష్టికి వచ్చింది.. తనిఖీలు చేసి పరిమితికి మించి విద్యార్థులు ఉన్నట్టయితే అక్కడికక్కడే బస్సులను సీజ్ చేస్తాము. విధిగా పాఠశాల బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థుల జాబితా ఖచ్చితంగా బస్సులో ఉండే విధంగా, డ్రైవర్‌లు డ్రెస్ కోడ్ వాడే విధంగా, హెల్పర్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే సంబంధిత పాఠశాల యాజమాన్యాలకు సూచించడం జరిగింది.

# తెలంగాణకు ప్రమాదం పొంచి ఉంది.. అప్రమత్తంగా ఉండాలి

- ఉద్యమ స్ఫూర్తిని కాపాడుకోవాలి
- పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు బీజేపీ వ్యూహమా?
- జీహెచ్ఎంసీ విస్తరణ వెనుక కుట్ర?
- టీఆర్ఎస్ చీఫ్ కవిత సంచలన వ్యాఖ్యలు




**కరీంనగర్ బ్యూరో / టౌన్, జూన్ 18 (జనంసాక్షి):** తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు – సాధన రౌండ్ టేబుల్ సమావేశం ముగింపు సందర్భంగా టీఆర్ఎస్ చీఫ్ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ అస్తిత్వం, సంస్కృతి, సంప్రదాయాలపై ప్రమాదం పొంచి ఉందని, రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వెనుక బీజేపీ రాజకీయ వ్యూహం పనిచేస్తోందని ఆరోపిస్తూ, తెలంగాణలో పరోక్షంగా పాగా వేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో సంవత్సరాలు పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామని గుర్తు చేసిన కవిత, ఇప్పుడు మరోసారి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోవాల్సిన అవసరం వచ్చిందన్నారు.
బీజేపీ నేరుగా పోటీ చేస్తే ప్రజల ఆదరణ లభించదనే ఉద్దేశంతో పవన్ కళ్యాణ్‌ను ముందుకు తెస్తోందనే అనుమానం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయించి రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. జీహెచ్ఎంసీ పరిధి విస్తరణ అంశాన్ని ప్రస్తావిస్తూ, చుట్టుపక్కల ప్రాంతాలను విలీనం చేయడం వెనుక కూడా రాజకీయ కుట్ర ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలకు ఎదురవుతున్న ప్రమాదాలను వివరించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు. తెలంగాణ చరిత్రను, సంస్కృతిని అవమానించే శక్తులను ప్రజలు గుర్తించాలని కోరారు. పవన్ కళ్యాణ్‌పై తీవ్ర విమర్శలు చేసిన కవిత, ఆయనను రాజకీయ నాయకుడిగా కాకుండా సినిమా నటుడిగా మాత్రమే చూడాలని యువతకు సూచించారు. సినిమా నటుల డ్యాన్సులు, ఫైట్లు చూసి వినోదం పొందవచ్చని, కానీ రాజకీయంగా వారి ప్రభావానికి లోనుకావద్దని కోరారు. సినిమా రంగానికి చెందిన వ్యక్తులను "ఎంటర్‌టైన్‌మెంట్ ఫ్యాక్టర్స్"గానే చూడాలని, రాజకీయ నిర్ణయాలు ప్రజల ప్రయోజనాల ఆధారంగా తీసుకోవాలని సూచించారు.
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ అంశాన్ని ప్రస్తావిస్తూ, బీజేపీ అధికారంలోకి వస్తే స్థానిక దేవతల ఆరాధన వంటి ప్రత్యేక సంప్రదాయాలకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని వ్యాఖ్యానించారు. తెలంగాణలో ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన దేవుడిని పూజించే స్వేచ్ఛ ఉన్నదని, అలాంటి వైవిధ్యభరిత సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పవన్ కళ్యాణ్ రూపంలో బీజేపీ "మేక వన్నె పులి"లా వస్తోందని, ప్రజలు ఈ వ్యూహాన్ని అర్థం చేసుకోవాలని కోరారు.
. ఎన్నికల ఖర్చులను తగ్గించే రాజకీయ సంస్కృతి రావాలని, బీసీలు, ఎస్సీలు సాధారణ స్థానాల నుంచే గెలిచే పరిస్థితి ఏర్పడాలని అభిప్రాయపడ్డారు. మహిళలకు రాజకీయాల్లో అధిక ప్రాధాన్యం కల్పిస్తామని ప్రకటించిన కవిత, తమ పార్టీ తరఫున కనీసం 33 శాతం టికెట్లను మహిళలకు కేటాయిస్తామని వెల్లడించారు. భవిష్యత్తులో 50 శాతం వరకు మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు కృషి చేస్తామని చెప్పారు.
ఈ సందర్భంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆరు కీలక తీర్మానాలను ఆమోదించినట్లు వెల్లడించారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహాయం అందించాలని, ఉద్యమకారుల హక్కుల సాధన కోసం పోరాటం కొనసాగించాలని, తెలంగాణను అవమానించే వ్యాఖ్యలు చేసిన పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలని, తెలంగాణ ద్రోహులకు మద్దతు ఇచ్చే వారిని ప్రజలు తిరస్కరించాలని తీర్మానించినట్లు తెలిపారు. అలాగే కరీంనగర్ జాలిగుట్ట ప్రాంతంలో ఉద్యమకారులకు 250 గజాల చొప్పున స్థల పట్టాలు పంపిణీ చేయాలని, కరీంనగర్ పట్టణంలో ఉద్యమ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సమావేశం డిమాండ్ చేసినట్లు కవిత వెల్లడించారు. తెలంగాణ అస్తిత్వం, సంస్కృతి, ఉద్యమ స్ఫూర్తి పరిరక్షణ కోసం సమిష్టిగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఆమె పిలుపునిచ్చారు.

# దొర గారి మెప్పు కోసమే కొప్పుల, ఆర్ఎస్పీ ఆరాటం

- దోచుకోవడం బీఆర్ఎస్ పార్టీకి పెటెంట్ హక్కు
- కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు జీవన్‌రెడ్డి వాట ఎంతో చెప్పాలి
- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**కరీంనగర్ బ్యూరో, జూన్ 18 (జనంసాక్షి) :** హరీష్ రావు దొర మెప్పు పొందడానికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ పార్టీ కార్యదర్శిగా ఉన్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తనపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో దొరలు అవమానించినప్పుడు కొప్పుల ఈశ్వర్ కు సాటి దళితుడిగా అండగా నిలిచానని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. దోచుకోవడం దాచుకోవడం బీఆర్ఎస్ పార్టీకి పెటెంట్ హక్కు అని, కాంగ్రెస్ పార్టీలో ఉన్న సమయంలో జీవన్ రెడ్డికి వచ్చిన వడ్ల కమీషన్ ఎంతో చెప్పాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి అడ్లూరి మాట్లాడుతూ... ఏడాది క్రితం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రిగా తాను బాధ్యతలు తీసుకున్నానని మంత్రి అడ్లూరి అన్నారు. గత ప్రభుత్వంలో సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పని చేశారని, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకుల పాఠశాల కార్యదర్శిగా పని చేశారని ఏడాది కాలంగా ఎందుకు ఆయా శాఖలపై మాట్లాడలేదని మంత్రి అడ్లూరి ప్రశ్నించారు.

సంక్షేమ శాఖలో రూ. 2వేల కోట్ల అవినీతి జరిగిందని హరీష్ రావు ఆరోపిస్తే ఆశాఖ మంత్రిగా జవాబు చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందని మంత్రి అడ్లూరి అన్నారు. సంక్షేమ శాఖకు సంబంధించి విద్యార్థులకు కావాల్సిన వస్తువుల కొనుగోలుకు రూ. 683 కోట్లతో టెండర్లు పిలిచామని, రూ. 500 కోట్లతో ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం టెండర్ల ఖారారు చేశామని మంత్రి అడ్లూరి తెలిపారు.


మొత్తం రూ. 1183 కోట్లకు టెండర్లు పిలిస్తే మాజీ మంత్రి హరీష్ రావు రూ. 2వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపిస్తే ఆశాఖ మంత్రిగా జవాబు చెప్పానని మంత్రి అడ్లూరి అన్నారు. తాను జవాబు చెప్పితే దొర మెప్పు కోసం కొప్పుల ఈశ్వర్ ఖాబ్దార్ అని మాట్లాడుతున్నారని మంత్రి అడ్లూరి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొప్పుల ఈశ్వర్ కు అవమానం జరిగితే తాను సాటి దళితుడిగా ఆరోజు ప్రతిపక్షంలో ఉండి అండగా నిలిచానని మంత్రి అడ్లూరి అన్నారు.

**జీవన్ రెడ్డి వాటాఎంతో చెప్పాలి..**

కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రి జీవన్ రెడ్డి వద్ద కొనుగోలులో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్నారని, జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉన్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సీజన్లలో వడ్లు కొనుగోలు చేసిందని, మరి అప్పుడు జీవన్ రెడ్డికి ఎంత కమీషన్ వచ్చిందో చెప్పాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.



- ఎన్నికల హామీలు గాలిలో.. రోడ్డు మాత్రం మారడం లేదు
- వర్షాకాలంలో ప్రమాదాలు తప్పని స్థితి
- ప్రభుత్వాలు మారినా ప్రజల బాధలు మారడం లేదు



# చదువుకు వెళ్లాలంటే ప్రాణాలతో పోరాటమే!

## విద్యార్థుల పాలిట శాపంగా మారిన మోడల్ స్కూల్ రహదారి

**సిరికొండ, జూన్ 18 (జనంసాక్షి):** సిరికొండ మండల కేంద్రం నుంచి చిన్న వాల్గొట్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి అధ్వాన్న పరిస్థితిలో ఉండటంతో ప్రజలు, విద్యార్థులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. తెలంగాణ మోడల్ స్కూల్, ప్రభుత్వ గోదాములు ఉన్న ఈ రహదారి మండలంలోని అనేక గ్రామాలకు ప్రధాన మార్గంగా ఉన్నప్పటికీ సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురవుతోంది.

గత ప్రభుత్వ హయాంలో ఈ రహదారి అభివృద్ధికి నోచుకోకపోగా, ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి 30 నెలలు గడిచినా పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది సుమారు రూ.10 లక్షలతో చేపట్టిన ప్యాచ్‌వర్క్ పనులు కూడా తూతూమంత్రంగా నిర్వహించడంతో కొద్ది రోజులకే రోడ్డు మళ్లీ గుంతలమయంగా మారింది. ఎన్నికల సమయంలో నాయకులు "రోడ్డు బాగు చేస్తాం", "డబుల్ రోడ్డు నిర్మిస్తాం", "విద్యార్థుల ఇబ్బందులు తొలగిస్తాం" అంటూ ఇచ్చిన హామీలు మాటలకే పరిమితమయ్యాయని స్థానికులు విమర్శిస్తున్నారు. చేతల్లో మాత్రం ఎలాంటి అభివృద్ధి కనిపించడం లేదని మండిపడుతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా ఈ రోడ్డు తలరాత మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్గమధ్యంలో ఉన్న కాల్వర్ట్ విరిగి సంవత్సరాలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ రహదారి ద్వారా సిరికొండ, మైలారం, హుస్సేన్‌నగర్, రామడుగు, కొండూరు, చిన్న వాల్గొట్, పెద్ద వాల్గొట్, పోతునూర్ తండా, సిరికొండ పరిసర తండాల నుంచి వందలాది మంది విద్యార్థులు ప్రతిరోజూ తెలంగాణ మోడల్ స్కూల్‌కు సైకిళ్లు, ఆటోలు, ఇతర వాహనాల్లో ప్రయాణిస్తున్నారు. రోడ్డు ఇరుకుగా ఉండటంతో ఎదురుగా భారీ లోడుతో వచ్చే వాహనాలకు దారి ఇవ్వాలంటే వెడల్పుగా ఉన్న చోట్ల ఆగాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాకాలంలో రహదారి పూర్తిగా బురదమయంగా మారి ప్రయాణానికి అనర్హంగా తయారవుతోంది. స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పలుమార్లు ప్రమాదాలు తప్పిన సంఘటనలు జరిగినప్పటికీ అధికారులు స్పందించకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు మాట్లాడుతూ, "ప్రతి రోజు ఈ రహదారిపై ప్రయాణం చేయడం ఒక నరకయాతనగా మారింది. పాఠశాలకు చేరుకునే వరకు భయంతోనే ప్రయాణిస్తున్నాం. మా ప్రాణాల కంటే అధికారులకు ఈ సమస్య చిన్నదిగా కనిపిస్తోందేమో" అని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భద్రత, గ్రామాల రాకపోకలను దృష్టిలో ఉంచుకొని వెంటనే ఈ రహదారిని విస్తరించి, డబుల్ రోడ్డు నిర్మించడంతో పాటు విరిగిన కాల్వర్ట్‌ను పునర్నిర్మించాలని ప్రజలు, తల్లిదండ్రులు, విద్యార్థులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. లేకపోతే ఎప్పుడైనా జరిగే ప్రమాదానికి బాధ్యత ఎవరిదనే ప్రశ్నకు సమాధానం చెప్పాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.




# మున్సిపల్ కార్మికుల నిరసన దీక్షలు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జులై 18 (జనంసాక్షి) :** తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు అనుబంధం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారము తెలంగాణ రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ ఆఫీసుల ముందు రెండు రోజుల పాటు నిరసన దీక్షలో భాగంగా వేములవాడ మున్సిపల్ కార్యాలయం ముందు యూనియన్ ఆధ్వర్యంలో దీక్షలను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మూసం రమేష్ ప్రారంభించారు.మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి గుర్రం అశోక్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మున్సిపల్ కార్మికులందరికీ పర్మనెంట్ చేయాలని కార్మికులందరికీ కనీస వేతనాలు రూ 26 వేలు ఇవ్వాలని, చనిపోయిన వారి కార్మికుల స్థానంలో మరియు 60 సంవత్సరాలు పైబడిన కార్మికుల స్థానంలో వారి వారసులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. పిఎఫ్ ఈఎస్ఐ లు సక్రమంగా చెల్లించాలని తదితర డిమాండ్లపై రెండు రోజుల నిరసన కార్యక్రమం ఉంటుందన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ పట్టణ అధ్యక్షులు సరిపల్లి నరేష్, ప్రధాన కార్యదర్శి దుబ్బల లచ్చయ్య, ఉపాధ్యక్షులు సుంకపాక పరశురాములు,సావనపల్లి శ్రీనివాస్, బొట్టు శ్రీనివాస్, ఎండి అజ్జు, బొడ్డు శ్రీనివాస్, గాజుల వజ్రమ్మ,వావిలాల లక్ష్మి, పుప్పాల మమత, వావిలాల రాధా తోపాటు కార్మికులు పాల్గొన్నారు.



# యదేచ్ఛగా అక్రమ మట్టి రవాణ

**జెసిబి, మూడు టిప్పర్లను పట్టుకున్న రెవెన్యూ యంత్రగం**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** వేములవాడ అర్బన్ మండల పరిధిలోని అగ్రహారం గుట్టల ప్రాంతం నుండి అక్రమంగా మట్టి రవాణ జరుగుతోంది. గురువారము యధావిధిగా మట్టి అక్రమ రవాణ జరుగుతుండగా వేముల వాడ తహసిల్దార్ జయంత్ కుమార్ ఆధ్వర్యంలో తన సిబ్బందితో ఆ ప్రాంతానికి వెళ్లగా ఒక జెసిబితో పాటు మూడు టిప్పర్లను అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయంపై తహసిల్దార్ను వివరణ కోరగా మట్టి రవాణాకు ఎలాంటి అనుమతులు లేకపోవడం ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమ మట్టి రవాణా చేస్తున్న జెసిబి మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకొని, వాటి యజమానిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఆర్ఐలు శ్రీనివాస్, శ్రీధర్ సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్తపల్లి మండలంలో టాస్క్‌ఫోర్స్ పోలీసుల మెరుపు దాడి

- అక్రమ ఇసుక డంపు సీజ్, 30 ట్రాక్టర్ల లోడుల ఇసుక స్వాధీనం
- అక్రమ ఇసుక మాఫియా పై ఉక్కుపాదం మోపుతున్న పోలీసులు
- పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం



**కొత్తపల్లి, జూన్ 18 (జనంసాక్షి) :** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా, నిల్వలను అరికట్టేందుకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం రోజు ఉదయం కొత్తపల్లి మండలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగులమల్యాల గ్రామ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన భారీ ఇసుక డంపు టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించి, సీజ్ చేశారు. సీజ్ చేసిన ఈ డంపులో మొత్తం 30 ట్రాక్టర్ల లోడుల ఇసుక ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. స్వాధీనం చేసుకున్న ఇసుక నిల్వలను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ... ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా తవ్వడం, నిల్వ చేయడం, రవాణా చేయడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణా పై జిల్లా వ్యాప్తంగా నిరంతర నిఘా కొనసాగుతుందని, నిబంధనలు ఉల్లంఘించే వారి పై మైనింగ్ చట్టాలు, ఇతర సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



# బడిబాటలో పాల్గొన్న కలెక్టర్

**కామారెడ్డి ప్రతినిధి, జూన్ 18 (జనంసాక్షి) :** బడిబాట కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొన్నారు. విద్యతోనే విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది అని ఆయన వివరించారు. జిల్లాలోని గర్గుల్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూకేజీ తరగతిని ప్రారంభించి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం సంచారజాతుల పిల్లలను పాఠశాలలో చేర్పించి వారికి అక్షరాభ్యాసం నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో రెండు మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. హైస్కూల్ , ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. గర్గుల్ పాఠశాలకు చెందిన నలుగురు జాతీయ స్థాయి హాకీ క్రీడాకారులు, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న 12 మంది క్రీడాకారులను జిల్లా కలెక్టర్ సన్మానించి అభినందించారు. క్రీడల్లో ప్రతిభ కనబరుస్తూనే విద్యలో కూడా రాణించాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ శ్రీమతి దివ్య రవితేజ గౌడ్ గ్రామంలో విద్యాభివృద్ధికి ప్రత్యేక బాధ్యత తీసుకుని చదువుకు ప్రాధాన్యత ఇస్తుండటం అభినందనీయమని అన్నారు. విద్యార్థుల ప్రగతి కోసం గ్రామస్తులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. ప్రతి చిన్నారి విద్యను అభ్యసించేలా అందరూ కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్, ఎంఈఓ ఎల్లయ్య, ఎంపీడీవో, సర్పంచ్ దివ్య రవితేజ గౌడ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు పి.డి. మధుసూదన్, సీఆర్పీ రాములు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మైనర్ బాలికపై వేధింపులకు పాల్పడ్డ తండ్రికి 4 సంవత్సరాల జైలు శిక్ష

- నిందితుడికి రూ.2,000 జరిమానా
- పోక్సో కేసులో సత్వర న్యాయం
- అధికారుల కృషిని అభినందించిన జిల్లా ఎస్పీ
- నేరస్థులు ఎవరైనా శిక్ష నుండి తప్పించుకోలేరు

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, జూన్ 18 (జనంసాక్షి):** రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఓ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడైన తండ్రికి 4 సంవత్సరాల జైలు శిక్ష, రూ.2,000 జరిమానా విధిస్తూ సిరిసిల్ల పోక్సో కోర్టు ప్రధాన న్యాయమూర్తి రాధికా జైస్వాల్ గురువారం తీర్పు వెల్లడించారు. జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఈ విషయం తెలిపారు.

జిల్లా పరిధిలోని ఓ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మైనర్ బాలికపై తండ్రి లైంగిక వేధింపులకు గురి చేయగా, బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అప్పటి దర్యాప్తు అధికారి దర్యాప్తు అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించి, కోర్టులో చార్జిషీట్ ఫైల్ చేయడం జరిగింది. కోర్టు విచారణలో భాగంగా అదనపు ఎస్పీ చంద్రయ్య పర్యవేక్షణలో కోర్టు మానిటరింగ్ ఎస్ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్, కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్, పోక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల కోర్టులో 8 మంది సాక్షులను ప్రవేశపెట్టగా, ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజనీకాంత్ వాదించారు. సాక్షులను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితుడికి 4 సంవత్సరాల జైలు శిక్ష, రూ.2,000 జరిమానా విధించారు.

సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకోలేరని, శిక్షల ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని జిల్లా ఎస్పీ తెలిపారు. పోలీసులు మరియు ప్రాసిక్యూషన్ సమన్వయంతో వ్యూహాత్మకంగా న్యాయ విచారణ, న్యాయ నిరూపణ నిర్వహించి నిందితులకు తప్పనిసరిగా శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కేసులో పకడ్బందీగా దర్యాప్తు చేపట్టి నిందితునికి శిక్ష పడటంలో కృషి చేసిన అధికారులను, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను, కోర్టు కానిస్టేబుళ్లను, కోర్టు మానిటరింగ్ అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# పోలీస్ స్టేషన్‌ను అస్మికంగా తనిఖీ చేసిన డిఎస్పి

**కొడంగల్,(జనం సాక్షి):** వికారాబాద్ జిల్లా పరిగి డిఎస్పి శ్రీనివాస్ సార్ ఆధ్వర్యంలో కొడంగల్ పోలీస్ స్టేషన్ నందు ఇన్స్పెక్షన్ నిర్వచించారు, అనంతరం వివిధ రకాల రికార్డులను పరిశీలించి సమస్యలు తెలుసుకొని పోలీసు వ్యవస్థ పై ప్రజలకు నమ్మకాన్ని పెంచే విధంగా ఉద్యోగం నిర్వహించాలని తగు సూచనలు చేశారు.కార్యక్రమంలో సీఐ శ్రీధర్ రెడ్డి, ఎస్పై సత్యనారాయణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కార్మిక హక్కుల పరిరక్షణకు ఏఐటీయూసీ నిరంతర పోరాటం

- బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు
- 29 కార్మిక చట్టాల రద్దును ఖండించిన చాడ వెంకటరెడ్డి
- సెప్టెంబర్ 6-8న తెలంగాణ ఏఐటీయూసీ మహాసభలు
- కరీంనగర్‌లో ఆహ్వాన సంఘం సమావేశం




**కరీంనగర్ టౌన్, జూన్ 18 (జనంసాక్షి):** దేశంలోని అన్ని రంగాల కార్మికులకు అండగా నిలుస్తూ, వారి వేతనాల పెంపు, హక్కుల పరిరక్షణ, కార్మిక చట్టాల అమలు కోసం నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తున్న సంఘం ఏఐటీయూసీ అని రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం చీఫ్ ప్యాట్రన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. గురువారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సెప్టెంబర్ 6, 7, 8 తేదీల్లో జరగనున్న తెలంగాణ రాష్ట్ర ఏఐటీయూసీ నాలుగో మహాసభల విజయవంతం కోసం కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల ఏఐటీయూసీ ఆఫీస్ బేరర్లు, అనుబంధ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆహ్వాన సంఘం అధ్యక్షుడు పంజాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు వి.ఎస్. బోస్, కలవేన శంకర్, ఎస్. బాలరాజు, టేకుమల్ల సమ్మయ్యలతో కలిసి చాడ వెంకటరెడ్డి మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ, భారతదేశంలో ఏర్పడిన తొలి కార్మిక సంఘంగా ఏఐటీయూసీ చరిత్ర కలిగి ఉందన్నారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య ఉద్యమంలో కార్మికులు, ఉద్యోగులను ఐక్యం చేసి కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులకు ఆశాజ్యోతిగా నిలిచిన ఏఐటీయూసీ, పని గంటల తగ్గింపు, వేతనాల పెంపు, కనీస వేతనాల అమలు, కార్మిక సంక్షేమ చట్టాల సాధన కోసం ఎన్నో ఉద్యమాలు నిర్వహించిందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను, కార్మిక చట్టాలను కాపాడటంలో ఏఐటీయూసీ ముందుంటుందని చెప్పారు.

ఏఐటీయూసీ రాష్ట్ర ఇన్‌చార్జి, ప్రధాన కార్యదర్శి వి.ఎస్. బోస్, రాష్ట్ర నాయకుడు ఎస్. బాలరాజు మాట్లాడుతూ, కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పద్మనాయక కళ్యాణ మండపంలో సెప్టెంబర్ 6, 7, 8 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఏఐటీయూసీ నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్మికులు, నాయకత్వం ఈ మహాసభల విజయానికి కృషి చేయాలని కోరారు.

ఈ సమావేశంలో మహాసభల ప్యాట్రన్ కలవేన శంకర్, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు పంజాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, కోశాధికారి కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, సీపీఐ జగిత్యాల జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, ఏఐటీయూసీ పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కదారి సునీల్, ఎం.డి. ముక్రం, సుతారి రాములు, అజ్జ వేణు, కదారి రాములు తో పాటు పొనగంటి కేదారి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, బోయిని అశోక్, పిట్టల సమ్మయ్య, కాశెట్టి లక్ష్మయ్య, వెల్దండి దామోదర్, అల్లేపు రాజు, నిఖిల్, కేంసారం నర్సయ్య, కొమురయ్య, కవిత, స్వరూప, రాధ, మమత, భీరయ్య, ఎం. తిరుపతి, గందే కొమురయ్య, గంగుల అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

- రికార్డులు, సిబ్బంది పనితీరు పరిశీలన
- ప్రతి కేసు సీసీటీఎన్ఎస్‌లో అప్‌డేట్ చేయాలి
- నేర నియంత్రణ, రౌడీ షీటర్లపై ప్రత్యేక దృష్టి
- ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి





**కామారెడ్డి, జూన్ 18 (జనంసాక్షి):** కామారెడ్డి జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర గురువారం కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ తనిఖీల్లో భాగంగా స్టేషన్ పరిసరాలు, పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ మరియు సిబ్బంది పనితీరును ఆయన నిశితంగా పరిశీలించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమై రోల్ కాల్ ప్రాముఖ్యతను వివరించడంతో పాటు, వారు నిర్వహిస్తున్న విధులు, బాధ్యతలపై ఆరా తీశారు. స్టేషన్ రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన ఎస్పీ, ప్రస్తుతం దర్యాప్తులో ఉన్న కేసుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కేసులోనూ నాణ్యమైన దర్యాప్తు జరగాలని, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో పెండింగ్ కేసుల పరిష్కారానికి ఒక ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, దాన్ని పక్కాగా అమలు చేయాలని స్పష్టం చేశారు. అలాగే, స్టేషన్‌కు సంబంధించిన అన్ని రికార్డులను నిర్ణీత గడువులోగా సీసీటీఎన్ఎస్ పోర్టల్‌లో నమోదు చేసి, ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ను ఆదేశించారు.

శాంతిభద్రతల పరిరక్షణపై స్పందిస్తూ పట్టణంలో వాహనాల తనిఖీలు, నాకాబందీలు, ప్రత్యేక డ్రైవ్‌లు నిరంతరం నిర్వహిస్తూ అనుమానిత వ్యక్తులు, వాహనాలపై గట్టి నిఘా ఉంచాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, కేడీలు, పాత నేరస్థుల వివరాలపై ప్రతి సిబ్బందికీ పూర్తి అవగాహన ఉండాలని ఎస్పీ పేర్కొన్నారు. పగలు, రాత్రి సమయాల్లో బీట్‌లను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ ఆన్‌లైన్ రికార్డులను అప్‌డేట్ చేయాలన్నారు. వీటితో పాటు సైబర్ నేరాలు, ఆస్తి నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళల భద్రత వంటి కీలకమైన అంశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

సిబ్బందిని ఉద్దేశించి జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర మాట్లాడుతూ, విధి నిర్వహణలో నిబద్ధత, క్రమశిక్షణ, వృత్తిపరమైన నైపుణ్యంతో పనిచేయాలని సూచించారు. తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించాలని స్పష్టం చేశారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను ఓపికగా విని, చట్టబద్ధంగా సత్వర పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే కామారెడ్డి పోలీసుల ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. నేర రహిత సమాజ నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, పోలీసులకు సహకరిస్తూ అనుమానాస్పద కార్యకలాపాల పై వెంటనే సమాచారం అందించాలని కోరారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సైబర్ నేరాలు కూడా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని లింకులు, ఫోన్ కాల్స్, ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని హెచ్చరించారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారుల భద్రత విషయంలో ఎలాంటి సమస్య ఎదురైనా తక్షణమే పోలీసులను ఆశ్రయించాలని, వారి రక్షణకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. "మీ భద్రత – మా బాధ్యత" అనే నినాదంతో ప్రజలకు మరింత చేరువగా, మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు కామారెడ్డి పోలీసులు కట్టుబడి ఉన్నారని ఎస్పీ పేర్కొన్నారు.

# సైబర్ నేరాల నుంచి రక్షణకు అవగాహన సదస్సు

- టీఎన్జీఓల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు జగదీశ్వర్ పోస్టర్ ఆవిష్కరణ
- "ఒక్కక్లిక్ చేసే ముందు ఆలోచించండి".. జూన్ 20న కరీంనగర్‌లో సదస్సు
- యువత, విద్యార్థులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరవ్వాలి



**కరీంనగర్ బ్యూరో, జూన్ 18 (జనంసాక్షి):** స్కిల్‌ఫోర్జ్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 20న కరీంనగర్ గణేష్‌నగర్‌లోని అదితి బ్యాంక్వెట్ హాల్‌లో నిర్వహించనున్న సైబర్ సెక్యూరిటీ అవగాహన సదస్సు పోస్టర్‌ను టీఎన్జీఓల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మారం జగదీశ్వర్ మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాల నుంచి రక్షణ పొందాలంటే ప్రతి ఒక్కరికీ అవగాహన అత్యవసరమని, "ఒక్క క్లిక్ చేసే ముందు ఒక్కసారి ఆలోచించాలి" అనే జాగ్రత్తను అలవాటు చేసుకోవాలని సూచించారు. టీఎన్జీఓ జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ మోసగాళ్లు మొబైల్ ఫోన్ల ద్వారా ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్నారని, ఓటీపీలు, ఫేక్ లింకులు, డిజిటల్ చెల్లింపుల మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సైబర్ నేరాలను ఎదుర్కొనేందుకు అవగాహనే ప్రధాన ఆయుధమని పేర్కొంటూ, ఈ ఉచిత సదస్సుకు యువత, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ముప్పిడి కిరణ్ కుమార్, రాగి శ్రీనివాస్, సర్దార్, ఆర్మిందర్ సింగ్ రాజేష్ భరద్వాజ్, వాస్తవికు, కోట రామస్వామి, శంకరయ్య, జీవన్, జీనియస్ అకాడమీ చైర్మన్ అనూప్ నారాయణ, నరసయ్య, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

# యూరియా యాప్ తొలగించాల్సిందే..

- బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ వేముల ప్రశాంత్ రెడ్డి



**నిజామాబాద్, జూన్18 (జనంసాక్షి) :** యూరియా యాప్‌ను తక్షణం తొలగించాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా వేల్పూర్ ఎక్స్ రోడ్డు వద్ద బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆందోళనకు దిగారు. రైతులు, గులాబీ శ్రేణులు పెద్ద ఎత్తున ఈ నిరసన కార్యక్రమానికి హాజరయ్యారు. మాజీ మంత్రి నేతృత్వంలో జాతీయ రహదారిపై నేతలంతా కలిసి బైఠాయించారు. సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతుల ఉసురు పోసుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కొత్త తరహా యూరియా పంపిణీ వ్యవస్థను తీసుకువచ్చిందని ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు. దుకాణాల్లో లేని యూరియా బస్తాలు యాప్ ద్వారా ఎలా రైతులకు అందుతాయని ప్రశ్నించారు. యాప్ వల్ల గ్రామాల్లో రైతులు అనేక విధాలుగా ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. అందుకే యూరియా యాప్ తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా 'యూరియా యాప్ పోవాలి.. రేవంత్ దిగిరావాలి' అంటూ నినాదాలు చేశారు. రైతులకు తక్షణమే యూరియా అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రైతులపై కక్ష సాధింపు చర్యలో భాగంగానే యూరియా యాప్ తెచ్చి రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నారని ఆరోపించారు. సకాలంలో రైతుబంధు ఇవ్వక రైతులను ప్రభుత్వం నట్టేట ముంచుతుందని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతును రాజును చేసే ఘనత కేసీఆర్ కే దక్కిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుపై రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నా రేవంత్ సర్కార్ పట్టించుకోకపోవడం సిగ్గు చేటన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సకాలంలో రైతులకు ఎరువులు సకాలంలో పథకాలు అందించడంతోపాటు రైతు సంక్షేమం కోరిందని గుర్తు చేశారు.

# విద్యార్థుల కోసం రేయింబవళ్లు శ్రమిస్తున్న మహిళా సంఘాలు

- సెర్ప్ ఆధ్వర్యంలో యూనిఫాంల తయారీలో 20 వేల మందికి పైగా మహిళలు
- ప్రతిరోజూ లక్షకు పైగా యూనిఫాంల కుట్టి పాఠశాలలకు సరఫరా
- నేడు సీఎం చేతుల మీదుగా పంపిణీ కానున్న 5 వేల స్టూడెంట్ కిట్లను సిద్ధం చేసిన మహిళలు
- మహిళా సాధికారతకు, విద్యార్థుల భవిష్యత్తుకు సెర్ప్ వారధి : మంత్రి సీతక్క



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు కొత్త విద్యా సంవత్సరంలో యూనిఫాంలు సకాలంలో అందేలా సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులు అహర్నిశలు కృషి చేస్తున్నారు. మహిళల నైపుణ్యాలను ఉపాధిగా మార్చి, వారి కుటుంబాలకు ఆదాయ వనరులు కల్పించడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలను అందించే ఉమ్మడి లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోంది.



2026-27 విద్యా సంవత్సరానికి గాను రాష్ట్రవ్యాప్తంగా 20 వేల మందికి పైగా మహిళా సంఘాల టైలర్లు యూనిఫాంల కుట్టు పనుల్లో పాల్గొంటున్నారు. వీరిలో దాదాపు 15 వేల మందికి ప్రత్యేక శిక్షణ అందించి, ఆధునిక ప్రమాణాలతో యూనిఫాంల తయారీ చేపట్టారు. విద్యార్థుల కొలతలను సేకరించి, వాటి ఆధారంగా యూనిఫాంలను కుట్టడం ద్వారా ప్రతి విద్యార్థికి సరైన కొలతలో దుస్తులు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. యూనిఫాంల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా 'మేకర్ అండ్ చెకర్' విధానాన్ని అమలు చేస్తున్నారు. ప్రతి కేంద్రంలో ప్రత్యేకంగా మహిళా సభ్యులను నాణ్యత పరిశీలకులుగా నియమించి, కుట్టిన ప్రతి యూనిఫాంను తనిఖీ చేస్తున్నారు. అలాగే అవసరమైన మార్పులు, చేర్పులు వెంటనే చేయడానికి గ్రామ స్థాయిలోనే టైలర్లను అందుబాటులో ఉంచుతున్నారు. ప్రస్తుతం మహిళా సంఘాల సభ్యులు ప్రతిరోజూ లక్షకు పైగా యూనిఫాంలను కుట్టి సంబంధిత పాఠశాలలు, గురుకులాలకు సరఫరా చేస్తున్నారు. విద్యార్థులందరికీ యూనిఫాంలు అందేలా వేగంగా పనులు కొనసాగిస్తున్నారు. అదేవిధంగా శుక్రవారం ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభం కానున్న విద్యా కానుక పంపిణీ కార్యక్రమం కోసం 8వ, 9వ, 10వ తరగతి విద్యార్థులకు అందించే 5 వేల స్టూడెంట్ కిట్లను కూడా సెర్ప్ మహిళలు విజయవంతంగా సిద్ధం చేశారు. ఈ కిట్లలో భాగంగా యూనిఫాంల తయారీ, ప్యాకింగ్, పంపిణీ ఏర్పాట్లను సమర్థవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, "మహిళా స్వయం సహాయక బృందాలు కేవలం పొదుపు, రుణాలకే పరిమితం కాకుండా రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వాములుగా ఎదుగుతున్నాయి. విద్యార్థుల భవిష్యత్తు కోసం వారు చూపుతున్న అంకితభావం అభినందనీయం. సెర్ప్ మహిళలకు శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ వారి ఆర్థిక స్వావలంబనకు బాటలు వేస్తోంది. ఒకవైపు మహిళలకు ఆదాయం, మరోవైపు విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలు అందేలా చేస్తున్న ఈ కార్యక్రమం ఆదర్శప్రాయమైనది" అని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులకు అవసరమైన యూనిఫాంల తయారీలో భాగస్వాములైన ప్రతి మహిళా సంఘ సభ్యురాలికి మంత్రి సీతక్క ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో మహిళా సంఘాలు కీలక పాత్ర పోషిస్తూ తెలంగాణకు ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆమె పేర్కొన్నారు.

# ఎంజీయూ- టీ సాట్ మధ్య ఒప్పందం



- ఆన్‌లైన్ శిక్షణా కార్యక్రమాలు, సర్టిఫికెట్ ప్రోగ్రామ్లు ద్వారా విద్యా అవకాశాలు విస్తరణ

**నల్గొండ (జనంసాక్షి) :** మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం, బిజినెస్ మేనేజ్మెంట్ విభాగం మరియు తెలంగాణ స్కిల్ అండ్ అకాడమిక్ ట్రైనింగ్ టీ-సాట్ ఆధ్వర్యంలో మరిన్ని ఆన్లైన్ తరగతులతో పాటు కొత్తగా సర్టిఫికెట్ కోర్సుల ప్రారంభానికి అవగాహన ఒప్పందం కుదిరింది.ఎం జి యు ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ టీ-సాట్ సీఈవో బొదనపల్లి వేణుగోపాల్ రెడ్డి హాజరైన ఈ కార్యక్రమంలో ఎంజీయూ, టీసాట్ మధ్య ఒప్పంద పత్రాలను పరస్పరం పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎంజియు ఉపకులపతి ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ 'ఈ భాగస్వామ్యం ద్వారా మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం అందిస్తున్న విద్యా అవకాశాలు మరింత ఉపయోగకరంగా, విస్తృతంగా మారనున్నట్లు ఆయన తెలిపారు . ప్రత్యేకంగా గ్రామీణ మరియు పరిమిత వనరుల ప్రాంతాల్లో జీవించే యువతకు, వృత్తిలో నైపుణ్యాన్ని పెంపొందించుకో వాలనుకునే వారికి ఈ ఆన్‌లైన్ కోర్సులు కీలకంగా నిలుస్తాయన్నారు. నాణ్యమైన పాఠ్యాంశాలు, వ్యవహారిక శిక్షణా మాడ్యూల్స్ ద్వారా ఉపాధి అవకాశాలు పెరిగేలా రూపొందించాలని సూచించారు. భవిష్యత్తులో కోర్సుల పరిధి మరింత పెంచి ఇతర విభాగాలు కూడా అందించాలని కోరారు. టీ-సాట్ సీఈఓ బోధనపల్లి వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆన్‌లైన్ శిక్షణ ద్వారా నాణ్యమైన విద్యను అందుబాటులోకి తేవడం ప్రధాన లక్ష్యంగా టీసాట్ పనిచేస్తుందని పేర్కొన్నారు. ఆర్థిక పరిమితులు కారణంగా అవకాశాల నుండి దూరమైన వర్గాలకు ప్రయోజనం కలిగేలా ప్లాట్‌ఫారమ్ రూపకల్పన చేసిన టి-సాట్ , విశ్వవిద్యాలయాలతో అనుసంధానం ద్వారా మరింత విస్తరించను న్నట్లు ఆయన తెలిపారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక సర్టిఫికెట్ ప్రోగ్రాములు రూపొందించి, ఉపాధి నైపుణ్యాల పెంపుకు, విధ్యార్థుల సామర్థ్యాన్ని మెరుగుప రచటానికి టీ-సాట్ ప్రయత్నాలకు విశ్వవిద్యాలయాల అనుసంధానం తోడ్పడుతుం దన్నారు. బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం గతంలో టూరిజం మేనేజ్మెంట్ పై డిజిటల్ తరగతుల నిర్వహణ అనుభవాన్ని బట్టి టూరిజం మేనేజ్‌మెంట్, లాజిస్టిక్ మేనేజ్‌మెంట్ వంటి ప్రత్యేక సర్టిఫికెట్ కోర్సులు కూడా త్వరలో ప్రవేశపెట్టనున్నారు. బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం రూపొందించిన శిక్షణా మాడ్యూల్స్‌లో లైవ్ లెక్చర్లు, రికార్డ్డ్ పాఠ్యాంశాలు, అసైన్మెంట్లు, వర్క్‌షాప్‌లకు విద్యార్థుల నుండి మంచి స్పందన వచ్చిం దన్నారు. గతంలో మేనేజ్మెంట్ విభాగం అందించిన టూరిజం ఆన్లైన్ తరగతు లను మరింత విస్తరిస్తూ, ఈ ఒప్పందం ద్వారా ఎంజియు మరిన్ని ఆన్లైన్ తరగతులకు అదనం గా సర్టిఫికెట్ కోర్సులను సైతం అందిం చనున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజి రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీసాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాదిక్ , జనరల్ మేనేజర్ లింగారెడ్డి, మహాత్మ గాంధీ యూనివర్సిటీ మేనేజ్మెంట్ డీన్ ఆచార్య అలవాల రవి, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ డైరెక్టర్ ఆచార్య ఆకుల రవి, డా సభినా హరాల్డ్, డా మిరియాల రమేష్, డా మారం వెంకట రమణారెడ్డి, డా లక్ష్మీప్రభ, ఆచార్య శ్రీ లక్ష్మి, డా శ్వేత, డా అనురాధ, డా జక్క సురేష్ రెడ్డి, డా కట్ట కిరణ్ మై, డా జ్యోతి , రమేష్ నాయక్ అధ్యాపకులు పాల్గొన్నారు.

# మొక్కల పెంపకం అత్యంత కీలకం

- వన మహోత్సవం 2026 ను ప్రజా ఉద్యమంగా విజయవంతం చేద్దాం
- తెలంగాణలో పచ్చదనం పెంపు కోసం 'వన మహోత్సవం'
- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** పర్యావరణ పరిరక్షణ, అడవుల విస్తరణ, వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కోవడంలో మొక్కల పెంపకం అత్యంత కీలకమని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గుర్రంగూడ అటవీ ప్రాంతంలో నిర్వహించిన వనమహోత్సవం-2026 ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ ప్రసంగించారు. వనమహోత్సవాన్ని భారత జాతీయ కాంగ్రెస్ ప్రభుత్వం 1950లో ప్రజా ఉద్యమంగా ప్రారంభించిందని గుర్తు చేసిన మంత్రి, అదే స్ఫూర్తితో ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో వనమహోత్సవాన్ని మహా ప్రజా ఉద్యమంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రజలు గత రెండు సంవత్సరాలుగా వనమహోత్సవ కార్యక్రమాలకు అపూర్వ స్పందన అందించారని, "ప్రతి నవజాత శిశువు పేరుతో ఒక మొక్క" అనే ముఖ్యమంత్రి పిలుపు రాష్ట్రవ్యాప్తంగా పర్యావరణ చైతన్యాన్ని పెంచి, పచ్చదనం పెంపు దిశగా సమాజాన్ని ప్రేరేపించిందని అన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేసి పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత ఏడాది నాటిన మొక్కలలో 94 శాతం మొక్కలు విజయవంతంగా పెరుగుతున్నాయని వెల్లడించారు. ఈ ఏడాది రాష్ట్రంలోని 13,242 నర్సరీలలో సిద్ధం చేసిన 16.06 కోట్ల మొక్కలను నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. గుర్రంగూడ అటవీ ప్రాంతం తెలంగాణ ప్రభుత్వ సంకల్పానికి, అటవీ శాఖ పట్టుదలకు, న్యాయపరమైన విజయానికి ప్రతీకగా నిలిచిందని మంత్రి పేర్కొన్నారు. సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పుతో సుమారు 102 ఎకరాల అటవీ భూమి తిరిగి అటవీ శాఖకు లభించిందని, అనంతరం మొత్తం 424 ఎకరాల 31 గుంటల భూమిని రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటించినట్లు తెలిపారు. ఇది తెలంగాణ అటవీ సంరక్షణ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిందన్నారు. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు ప్రకృతి సమతుల్యత కోల్పోవడమేనని మంత్రి సురేఖ అన్నారు. తీవ్రమైన వాతావరణ మార్పులు, ఉష్ణోగ్రతల పెరుగుదల, భూగర్భ జలాల తగ్గుదల వంటి సమస్యలను అధిగమించేందుకు అడవుల విస్తీర్ణాన్ని పెంచడమే పరిష్కారమన్నారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను పెంచాలని, ప్రతి కుటుంబం ఒక మొక్కకు బాధ్యత వహించాలని మంత్రి సురేఖ పిలుపునిచ్చారు. జాతీయ అటవీ విధానం నిర్దేశించిన 33 శాతం అటవీ విస్తీర్ణ లక్ష్య సాధన కోసం అందరూ భాగస్వాములు కావాలని, పచ్చని తెలంగాణ – ఆరోగ్యకరమైన తెలంగాణ – సుసంపన్న తెలంగాణ నిర్మాణంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

# ముగిసిన బ్రహ్మానాయుడు కస్టడీ

- కోర్టుకు తరలించిన పోలీసులు

**హైదరాబాద్, జూన్18 (జనంసాక్షి) :** ఫేక్ జీవో కేసులో వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు కస్టడీ పూర్తయ్యింది. మూడురోజుల కస్టడీ ముగియడంతో బొల్లా బ్రహ్మానాయుడిని రంగారెడ్డి జిల్లా కోర్టుకు పోలీసులు తరలించారు. బ్రహ్మానాయుడిని సైబరాబాద్ ఈవోడబ్ల్యూ అధికారులు మూడు రోజులపాటు కస్టడీకి తీసుకొని విచారించారు. అయితే కస్టడీలో పోలీసులకు మాజీ ఎమ్మెల్యే ఏమాత్రం సహకరించనట్లు తెలుస్తోంది. ఏ ప్రశ్న అడిగినా 'తెలియదు, గుర్తులేదు' అనే సమాధానాలు చెప్పినట్లు సమాచారం. రూ.1000 కోట్ల భూమిని అక్రమంగా కొట్టేయాలని బ్రహ్మానాయుడు ప్లాన్ చేసినట్టు ఈవోడబ్ల్యూ అధికారుల విచారణలో వెల్లడైంది. భూమిని కొట్టేసేందుకు బ్రహ్మానాయుడు రూ.8 కోట్లు సమకూర్చినట్లు అధికారులు గుర్తించారు. దీనిపైనే ప్రశ్నలు వేయగా.. మాజీ ఎమ్మెల్యే సమాధానాలు దాటవేసినట్లు తెలుస్తోంది. మరికొన్ని ప్రశ్నలకు మౌనంగా ఉంటూ తనకేం తెలియదని బుకాయించే ప్రయత్నం చేసినట్లు సమాచారం. ఇప్పటికే ఐదుగురు నిందితులు కస్టడీలో వెల్లడించిన వివరాలను ఆధారంగా చేసుకొని బ్రహ్మానాయుడిని అధికారులు ప్రశ్నించారు. 'వారు చెప్పిన సమాధానాలకు నాకు ఎలాంటి సంబంధం లేదు' అని పోలీసుల ముందు బ్రహ్మానాయుడు బుకాయించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది.

# అవినీతిపై ప్రశ్నిస్తే ఎదురుదాడులా?

- సమాధానం చెప్పకుండా తప్పించుకోలేరు
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై కొప్పుల ఫైర్



**కరీంనగర్, జూన్18 (జనంసాక్షి) :** ధాన్యం కొనుగోళ్లు, సంక్షేమ హాస్టళ్ల టెండర్లలో భారీ అవినీతి జరిగిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. ఈ విషయాలపై సమాధానం చెప్పకుండా వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. ధర్మపురి నియోజకవర్గంలోని ఇసుక రీచ్‌లు మాయమయ్యాయన్న అంశం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఈ మేరకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు నిజంగా ధైర్యం ఉంటే మంత్రి పదవికి రాజీనామా చేసి ప్రజల ముందుకు రావాలని సవాల్ విసిరారు. మంత్రి పదవికి రాజీనామా చేయడం అంత సులభమైన విషయం కాదని, ఎన్నో కష్టాలు పడి ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిచిన లక్ష్మణ్‌కు రాజీనామా చేసే ధైర్యమే లేదని ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలు, అవినీతి ఆరోపణలపై సమాధానాలు చెప్పలేక వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. హరీశ్‌రావును 'దొర' అంటూ కులాన్ని ప్రస్తావిస్తూ రాజకీయాలు చేస్తున్నావా? అంటూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో కరోనా లాంటి క్లిష్ట పరిస్థితుల్లో సైతం ఏనాడు ఆపలేదని గుర్తు చేశారు. రైతు భీమా ప్రీమియం గడువు పూర్తయి నాలుగు నెలలు అయిందని, రైతులు చనిపోతే ఆ కుటుంబాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. డిస్కం పేరుతో రైతులకు విద్యుత్తు కోతను తీసుకురానున్నారని ఆరోపించారు. రిజర్వాయర్లు, మెయిన్ కెనాల్స్ పూర్తి చేసి వేల ఎకరాలకు నీరిచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వముదేనని, పిల్ల కాలువలు పూర్తి చేస్తే మరిన్ని ఎకరాలకు నీరు అందించవచ్చన్నారు. అడుగడుగునా రైతులను వేధిస్తున్న కాంగ్రెస్ కి ఎవరైనా ఓటు వేస్తారా అంటూ ప్రశ్నించారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ

## జర్నలిస్టులకు అవగాహన కార్యక్రమం

**హైదరాబాద్, జూన్ 18 (జనంసాక్షి) :** జర్నలిస్టుల కోసం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ అంశంపై తెలంగాణ మీడియా అకాడమీ, తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయ అధికారులతో ప్రత్యేక అవగాహన, పరస్పర చర్చా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ఈ నెల 22వ తేదీ సోమవారం నాడు ఉదయం 11.00 గంటలకు మీడియా అకాడమీ ఆడిటోరియం, చాపెల్ రోడ్, నాంపల్లి, హైదరాబాద్‌లో నిర్వహించబడుతుంది. ఈ సమావేశంలో ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయ అధికారులు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, దాని లక్ష్యాలు, అమలు విధానం, ప్రజల భాగస్వామ్యం, ఓటరు నమోదు, సవరణలు తదితర అంశాలపై సమగ్రంగా వివరించనున్నారు. అలాగే జర్నలిస్టులు తమ సందేహాలను నేరుగా అధికారులను అడిగి నివృత్తి చేసుకునే అవకాశం కల్పించబడుతుంది. ఈ కార్యక్రమం మధ్యాహ్నం 1.00 గంటలకు ముగియనుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన జర్నలిస్టులు తమ పేర్లను 20వ తేదీ మధ్యాహ్నం 1.00 గంటలలోపు వాట్సాప్ నంబర్ 7093600977 కు పంపి నమోదు చేసుకోవలసిందిగా కోరడమైనది. కార్యక్రమ నిర్వహణ సౌలభ్యం దృష్ట్యా, నిర్దేశిత గడువులోపు తమ పేర్లను నమోదు చేసుకున్న జర్నలిస్టులకు మాత్రమే కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించబడుతుంది.

# ఛత్తీస్‌ఘడ్‌లో ఇసుక తవ్వకాల పంచాయితీ

- స్థానిక నేతను సజీవ దహనం చేసిన దుండగులు



**రాయపూర్, జూన్ 18 (జనంసాక్షి) :** ఛత్తీస్‌గఢ్‌లో ఇసుక తవ్వకాలకు సంబంధించి ఇరు వర్గాల మధ్య చెలరేగిన వివాదం దారుణ మలుపు తిరిగింది. స్థానిక నేత, జన్‌పద్ పంచాయతీ మాజీ ప్రెసిడెంట్ భరత్ సింగ్ సజీవదహనమయ్యారు. కొరియా జిల్లాలో మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ కేసులో పోలీసులు ఇప్పటికే నలుగురు నిందితులను అరెస్టు చేశారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, స్థానికంగా ఇసుక తవ్వకాల కాంట్రాక్ట్‌ను భరత్ సింగ్ దక్కించుకున్నారు. ఈ క్రమంలో మనోజ్ త్రిపాఠీ వర్గంతో భరత్ సింగ్‌కు వివాదం మొదలైంది. ఇసుక తవ్వకాల కోసం వాడే టిప్పర్ ట్రక్‌లు త్రిపాఠీ కుటుంబానికి చెందినవని స్థానికులు తెలిపారు. దీంతో, ఇసుక తరలింపు, చెల్లింపుల విషయంలో భరత్ సింగ్, త్రిపాఠీ వర్గాల మధ్య వివాదం మొదలైంది. చివరకు ఇది ఆధిపత్య పోరుగా మారినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. మంగళవారం రాత్రి ఇసుక తవ్వకాలకు సంబంధించి తలెత్తిన వివాదాన్ని పరిష్కరించేందుకు భరత్ సింగ్ నౌగెయిన్ గ్రామానికి వెళ్లారు. దీంతో, అక్కడ వివాదం చెలరేగగా భరత్ సింగ్ ప్రయాణిస్తున్న ఫార్చ్యునర్ కారును కొందరు అడ్డగించారు. తప్పించుకునే వీలులేకుండా కారుకు ముందు, వెనుక లారీలను అడ్డుపెట్టారు. ఆ తరువాత కారుపై పెట్రలో పోసి నిప్పటించడంతో భరత్ సింగ్ సజీవదహనమయ్యారు. భరత్ సింగ్‌తో పాటు కారులో ఉన్న విరేంద్ర సింగ్, నాగేంద్ర సింగ్ కూడా కాలిన గాయాలతో కన్నుమూశారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన మయాంక్ సింగ్ పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది.ఘటనపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని మృతుల కుటుంబం డిమాండ్ చేసింది. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ కేసులో ఇప్పటికే నలుగురిని అరెస్టు చేశామని ఏఎస్పీ సురేషా చౌబే తెలిపారు. మరికొందరు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలో పట్టుకుంటామని అన్నారు.

# సిఎం విజయ్‌తో వైకో భేటీతో ఊహాగానాలు

- డిఎంకెను వీడుతారన్న ప్రచారం

**చెన్నై, జూన్18 (జనంసాక్షి) :** తమిళనాడు రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. తన స్థానాన్ని పదిలం చేసుకునే దిశగా సిఎం విజయ్ అడుగులు వేస్తున్నారు. ద్రవిడ పార్టీలు కలిసినా తన మనుగడకు ఢోకా లేకుండా చేసుకుంటున్నారు. అందుకే అన్నా డిఎంకె ఎమ్మెల్యేలు ఒక్కరొక్కరుగా రాజీనామా చేసి, టివికెలో చేరుతున్నారు. వీరంతా మళ్లీ ఉప ఎన్నికల్లో అధికార పార్టీ నుంచి పోటీచేసే అవకాశం ఉంది. దీంతో అన్నా డిఎంకె కూడా పూర్తిగా బలహీనపడే పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు వైకో సిఎంతో భేటీ కావడం మరో కొత్త అంశం తెరపైకి వచ్చింది. డీఎంకేకు చిరకాల మిత్రపక్షమైన మరుమలార్చి ద్రవిడ మున్నేట్ర కళగం(ఎండీఎంకే) అధికార తమిళగ వెట్రి కళగం(టీవీకే)తో జట్టుకట్టనుందా? అనే చర్చ ఆ రాష్ట్ర రాజకీయాల్లో జోరందుకుంది. ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైకో.. సీఎం జోసెఫ్ విజయ్‌తో భేటీ కావడం ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది. కాగా.. ఇటీవలే వైకో కుమారుడు, ఎండీఎంకే ఎంపీ దురై వైకో కూడా విజయ్‌తో సమావేశమైన సంగతి తెలిసిందే. కాగా.. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే నేతృత్వంలోని కూటమిలో ఎండీఎంకే పోటీచేసి రెండు స్థానాలను కైవసం చేసుకుంది. ఆ పార్టీ సాధారణ మండలి సమావేశం ఈ నెలాఖరులో జరగనుంది. పార్టీ భవిష్యత్తు రాజకీయ దిశగా ఆ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశమున్నట్టు తెలుస్తోంది. అయితే.. టీవీకే నేతృత్వంలోని మైనారిటీ ప్రభుత్వంపై జరిగిన విశ్వాస పరీక్షలో ఎండీఎంకే తటస్థంగా వ్యవహరించింది. డీఎంకేతో కలిసి పనిచేసిన పలువురు మాజీ మిత్రపక్షాలు ఇప్పటికే టీవీకే ప్రభుత్వానికి మద్దతిస్తున్నాయి. కాంగ్రెస్, వీసీకే, ఐయూఎంఎల్ పార్టీలు అధికార వ్యవస్థలో భాగస్వాములయ్యాయి. మరోవైపు సీపీఐ, సీపీఎం పార్టీలు విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వానికి బయట నుంచే మద్దతు తెలుపుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎండీఎంకే వైఖరి మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఊహాగానాలపై వైకో అప్రమత్తంగా వ్యవహస్తున్నట్టు తెలుస్తోంది. పార్టీ భవిష్యత్తు రాజకీయ నిర్ణయాలను సాధారణ మండలి ఆధ్వర్యంలోనే తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. సీఎం విజయ్‌తో సమావేశం పూర్తిగా ప్రజా సమస్యలపైనే జరిగిందని పేర్కొన్నారు. తూత్తుకుడిలో వేదాంత గ్రూప్‌నకు అనుబంధంగా మరో రాగి పరిశ్రమ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అలాంటి ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వొద్దని కోరానని వెల్లడించారు.

# తంత్రీ వాయిద్యకారుడు రమయ్యకు పురస్కారం

**పెద్దపల్లి, జూన్18 (జనంసాక్షి):** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి గ్రామానికి చెందిన, కడ్డీ తంత్రి వాయిద్య కళాకారుడు దురిచేటి రామయ్య కు కేంద్ర ప్రభుత్వ పురస్కార్ అవార్డు దక్కింది. ఆయన ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు గురువారం హర్షం వ్యక్తం చేశారు. గ్రామస్తులు పులి వెంకటేశంతో పాటు పలువురు రామయ్య ఇంటికి వెళ్లి అవార్డుకు ఎంపిక కావడం పట్ల శు భాకాంక్షలు తెలిపి అభినందించారు. అనంతరం శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. నిరుపేద కుటుంబానికి చెందిన రామయ్య కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370